ఈనాడు

విజయవాడ 25-1-2019 శుక్రవారం సిటీ సంపుటి 45 . సంచిక 165
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

Joyalukkas
World's favourite jeweller
Shop online @ joyalukkas.com



ఈనాడు



విజయవాడ 25-1-2019 శుక్రవారం సిటీ సంపుటి 45 . సంచిక 165

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



"ఎలాంటి విమర్శలనైనా స్వీకరించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. రాజకీయ పార్టీలు సహా ఏ వర్గం నుంచైనా అభిప్రాయాలు తెలుసుకుంటాం. ఎందుకంటే (ఎన్నికల క్రతువులో) అతిపెద్ద భాగస్వాములు రాజకీయ పార్టీలే. అయితే అదే సమయంలో మేం ఈవీఎంలపై విమర్శలకు భయపడిపోయేది లేదు. విమర్శలు వస్తున్నాయని ఒత్తిడికి గురై ఈవీఎంలను, ఓటు రసీదు యంత్రాలను (వీవీప్యాట్‌లను) విడనాడేది లేదు."

- సీఈసీ అరోడా

బ్యాలెట్ల ప్రశ్నే లేదు

- ఈవీఎంలపై విమర్శలకు వెరవం
- కొన్ని వర్గాలు ఉద్దేశపూర్వకంగానే బురద జల్లుతున్నాయి
- పాత పద్ధతికి మళ్లడమనేది జరగదు
- మరోసారి స్పష్టం చేసిన సీఈసీ అరోడా



దిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) స్థానంలో మళ్లీ బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టాలని వివిధ వర్గాలు చేస్తున్న డిమాండ్లను కేంద్ర ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ పాత పద్ధతికి వెళ్లేది లేదని తేల్చి చెప్పింది. కొన్ని వర్గాలు ఉద్దేశపూర్వకంగానే ఈవీఎంలపై బురద జల్లుతున్నాయని, వాటికి తాము వెరవబోమని ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోడా స్పష్టం చేశారు. 'విమర్శలకు భయపడిపోయి ఈవీఎంలను విడనాడి బ్యాలెట్ పెట్టెల శకానికి వెళ్లే ప్రశ్నేలేదు. ఈవీఎంలను కొన్ని వర్గాలు ఫుట్‌బాల్‌లా వాడుకుంటున్నాయి. ఈ అంశాన్ని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయి. అయితే నేను మాత్రం మరోసారి అత్యంత సుస్పష్టంగా ఒకటి చెప్పదలచుకున్నాను. నేనే (మిగతా 2లో)

మధ్యంతర భృతిపై త్వరలో నిర్ణయం

- మంత్రివర్గంలో చర్చిస్తాం
- ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సుప్రీం ఉత్తర్వులే ఆటంకం
- దీనిపై అప్పీలుకు వెళ్తాం
- ఉద్యోగ సంఘాల నాయకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి (ఐఆర్) ఇచ్చే అంశంపై మంత్రివర్గంలో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగ సంఘాల నాయకులకు హామీనిచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సానుకూలంగా లేకపోవడంతో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని, దీన్ని ఉద్యోగులు కూడా అర్థం చేసుకోవాలని కోరారు. ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు పి.అశోక్‌బాబు, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్‌దారుల ఐకాస ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు, బండి శ్రీనివాసరావుల నేతృత్వంలోని బృందం గురువారం ఉండవల్లిలోని నివాసంలో సీఎంను కలిసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల డీఏ ప్రకటించడంపై వారు ధన్యవాదాలు తెలిపారు. 11వ వేతన సవరణ నివేదిక (మిగతా 2లో)



ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

"కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లపై వైకాపా, భాజపా నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారు. కాపులకు రిజర్వేషన్ల అంశం తన పరిధిలోకి రాదని తూర్పుగోదావరి జిల్లాలో జగన్ ప్రకటించారా? లేదా? అప్పుడు సాధ్యం కాదన్న వ్యక్తి.. ఇప్పుడు తెదేపా ప్రభుత్వం కాపులకు రిజర్వేషన్లు ఇస్తుంటే వ్యతిరేకిస్తున్నారు. భాజపా నాయకులూ మనల్ని విమర్శిస్తున్నారు."

- తెదేపా నేతలతో చంద్రబాబు

డబ్బున్నవారికే వైకాపా టికెట్లు

- జగన్ తెరాసకు రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారు
- మోదీ నిరంకుశపాలన అంతమే భాజపాయేతర పార్టీల లక్ష్యం
- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం వ్యాఖ్యలు

2లో



జిల్లాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు గృహ యోగం

- సొసైటీ/బృందం ద్వారా కేటాయింపు
- 15 ఏళ్ల వరకు విక్రయాలు జరపకూడదు
- గృహ విధానాన్ని ప్రకటించిన ప్రభుత్వం

3లో

జగన్ పదేపదే అవమానించారు



- గాలికి కొట్టుకుపోతావనేవారు
- తండ్రిలేడనే పార్టీలో కొనసాగనిస్తున్నానన్నారు
- జగన్‌పై వంగవీటి రాధా ఆరోపణలు
- వైకాపాలో అన్నీ అవమానాలేనని ఆవేదన
- రంగా హత్యను తెదేపాకు ఆపాదించడం సరికాదని వ్యాఖ్య
- ఏ పార్టీలో చేరేది స్పష్టం చేయని మాజీ ఎమ్మెల్యే

7లో

నాగావళి మురిసేలా వంశ'ధార'

- త్వరలో పూర్తికానున్న అనుసంధాన పనులు
- వేగంగా సాగుతున్న కాలువ నిర్మాణం
- లక్షన్నర ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం

2లో



శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్ పేట మండలం మల్లికార్జున పురం వద్ద నిర్మిస్తున్న అండర్ టన్నెల్ ఇది. కింది నుంచి కాలువ.. పై నుంచి వాగు ప్రవహించేందుకు నిర్మిస్తున్నారు. ఇరువైపులా గోడ నిర్మిస్తే తొట్టి పూర్తవుతుంది. కాలువ పొడవున ఇలాంటి నిర్మాణాలు జరుగుతున్నాయి

యూనిఫామ్ ఉద్యోగాల వయోపరిమితి రెండేళ్లకు పెంపు

- ఇతర ఉద్యోగాలకూ పెంచాలని నిరుద్యోగుల అభ్యర్థన
- గ్రూపు-1, గ్రూపు-2 దరఖాస్తుల స్వీకరణ గడువూ పెంపు

ఈనాడు, అమరావతి: యూనిఫామ్డ్ ఉద్యోగాల వయోపరిమితిని రెండేళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీలోగా జారీచేసే ఉద్యోగాల భర్తీ ప్రకటనలకు వయో పరిమితి పెంపు నిర్ణయం వర్తిస్తుందని సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్) కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ, ఇతర (మిగతా 6లో)

ఇదీ సంగతి!



డిగ్రీ అయిపోయాక ఏం చేద్దామనుకుంటున్నావురా, ...నేనైతే సన్యాసం తీసుకుందామనుకుంటున్నా!

చందా కొచ్చర్‌పై సీబీఐ కేసు

- వీడియోకాన్‌కు ఐసీఐసీఐ రుణం మంజూరు వివాదం




దిల్లీ: ఐసీఐసీఐ బ్యాంకు-వీడియోకాన్ రుణాల మంజూరు వ్యవహారంపై కేసులు నమోదు చేసినట్టు గురువారం సీబీఐ వర్గాలు తెలిపాయి. ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈవో చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ ధూత్‌లపై కేసులు నమోదయ్యాయి. దీపక్ కొచ్చర్ నిర్వహిస్తున్న నూ పవర్ రెన్యువబుల్స్, సుప్రీం ఎనర్జీ, వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, వీడియోకాన్ (మిగతా 2లో)

పీఎస్ఎల్వీ విజయవంతం

- కక్ష్యలోకి కలాంశాట్, మైక్రోశాట్ ఉపగ్రహాలు



సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లాలోని సతీశ్‌ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్) నుంచి గురువారం అర్ధరాత్రి నింగిలోకి పంపిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్-సీ44 ప్రయోగం విజయవంతమైంది. బుధవారం రాత్రి 7.37 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ ప్రక్రియ నిరంతరాయంగా 28 గంటలపాటు కొనసాగింది. గురువారం రాత్రి 11.37 గంటలకు పీఎస్ఎల్వీ-సీ44 నింగిలోకి దూసుకెళ్లింది. దీని ద్వారా తమిళనాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 1.2 కిలోల బరువున్న కలాంశాట్‌తోపాటు 740 కిలోల మైక్రో శాట్-ఆర్ (మిగతా 2లో)



ఉమ్మడి హైకోర్టు చరాస్తుల పంపకాలపై ఏకాభిప్రాయం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఉమ్మడి హైకోర్టు చరాస్తుల పంపకాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. హైకోర్టు విభజన నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకు దాని చరాస్తుల కేటాయింపులపై గురువారం హైదరాబాద్‌లోని బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్రపునేఠ, ఇరు రాష్ట్రాల న్యాయశాఖ కార్యదర్శులు నిరంజన్‌రావు, వెంకటరమణ, ఏపీ, తెలంగాణ హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లు మానవేంద్రనాథ్‌రాయ్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీ పునర్వ్యవస్థీకరణ విభాగం ముఖ్యకార్యదర్శి ప్రేమ్‌చంద్రారెడ్డి, తెలంగాణ ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, తెలంగాణ హైకోర్టు పరిపాలన రిజిస్ట్రార్ నాగార్జునలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైకోర్టులోని వాహనాలు, బీరువాలు, ల్యాప్‌టాప్‌లు, ఫర్నీచర్, దస్త్రాలు, గ్రంథాలు ఇతర వస్తువుల విభజనపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని నిర్ణయించారు. ఏపీ హైకోర్టుకు కేటాయించిన వస్తు సామగ్రిని త్వరలోనే ఆ రాష్ట్రానికి తరలిస్తారు. సమావేశం అనంతరం ఇద్దరు ప్రధాన కార్యదర్శులు బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు కార్యాలయంలో మొక్కలు నాటారు.



సమావేశం అనంతరం బయటకు వస్తున్న ఏపీ పునర్వ్యవస్థీకరణ విభాగం ముఖ్యకార్యదర్శి ప్రేమ్‌చంద్రారెడ్డి, ఏపీ న్యాయశాఖ కార్యదర్శి వెంకటరమణ, ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మానవేంద్రనాథ్‌రాయ్, తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీ సీఎస్ అనిల్‌చంద్రపునేఠ, తెలంగాణ సీఎస్ ఎస్‌కేజోషి, తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, హైకోర్టు పరిపాలన రిజిస్ట్రార్ నాగార్జున

విభజన సమస్యలపై 1న సమావేశం

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యల పరిష్కారానికి కేంద్ర హోంశాఖ ఫిబ్రవరి1న దిల్లీలో సమావేశం ఏర్పాటుచేసింది. ఇందుకు హాజరుకావాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014 ప్రకారం పరిష్కారం కావాల్సిన ద్వైపాక్షిక అంశాలపై ఇందులో చర్చించనున్నట్లు పేర్కొంది. మొత్తం ఎనిమిది అంశాలను అజెండాలో చేర్చింది.

పరిశోధన

ఐదు కోతుల్ని సృష్టించారు



- జన్యు ఎడిటింగ్ కోతిపై క్లోనింగ్ చేసిన చైనా శాస్త్రవేత్తలు
- మానవ వ్యాధులపై పరిశోధనలకు ప్రయోజనం

బీజింగ్: జన్యు ఎడిటింగ్ విధానం ద్వారా పుట్టిన ఒక కోతిని క్లోన్ చేసిన చైనా శాస్త్రవేత్తలు ఐదు ప్రతిరూపాలను సృష్టించారు. వీటిలో పలు మానవ రుగ్మతలను చొప్పించారు. ఈ మర్కటాలు వైద్య పరిశోధనకు ఉపయోగపడతాయని వారు చెబుతున్నారు. అయితే ఈ చర్య వల్ల జన్యు ఎడిటింగ్ నైతికతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఈ విధానం ద్వారా ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఇద్దరు చిన్నారులకు జన్మనిచ్చినట్లు గత నవంబర్‌లో చైనా పరిశోధకుడొకరు చేసిన ప్రకటన తీవ్ర విమర్శలకు దారితీసిన సంగతి తెలిసిందే.

మానవ జీవక్రియ గడియారంలో (సర్కాడియన్ రిథమ్) లోపాలు ఉండేలా జన్యు ఎడిటింగ్‌తో ఒక కోతిని తమ శాస్త్రవేత్తలు రూపొందించారని చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా పేర్కొంది. దాని నుంచి మరో ఐదు కోతులను వారు సృష్టించారని తెలిపింది. జన్యుమార్పిడి చేసిన కోతి నుంచి వైద్య పరిశోధనల కోసం ఇన్ని ప్రతిరూపాలను క్లోన్‌లు చేయడం ఇదే మొదటిసారని వివరించింది. ఇవి షాంఘైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్స్‌లో జన్మించాయని పేర్కొంది.

సర్కాడియన్ రిథమ్‌లోని లోపాలకు నిద్రలేమి, కుంగుబాటు, మధుమేహం, క్యాన్సర్, అల్జీమర్స్ వంటి వ్యాధులతో సంబంధం ఉంది. గతంలో ఇలాంటి వ్యాధులపై పరిశోధనల కోసం ఎలుకలు, ఈగలను ఎక్కువగా ఉపయోగించేవారు. తాజా క్లోనింగ్‌లో జన్మించిన కోతులు శరీర అంతర్గత తీరుతెన్నులు చాలా వరకూ మానవులను పోలి ఉన్నాయి. అందువల్ల అనేక వ్యాధులకు చికిత్స విధానాలను రూపొందించడానికి ఇవి మెరుగైన నమూనాలుగా పనికొస్తాయని జిన్హువా పేర్కొంది.

డబ్బున్నవారికే వైకాపా టికెట్లు

చంద్రబాబు ధ్వజం

ఈనాడు, అమరావతి: డబ్బుల కోసం వైకాపా అధ్యక్షుడు జగన్ రాష్ట్రాన్ని తెరాసకు తాకట్టు పెడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. 'జగన్ డబ్బు మనిషి. టికెట్లు కూడా డబ్బులున్న వాళ్లకే ఇస్తున్నారు. మోసాల్లో ఘనుడు. అందుకే 16 నెలలు జైలుకి వెళ్లారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి గురువారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా 15వేల మందికిపైగా తెదేపా నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'రాష్ట్రం విడిపోయిన ఐదేళ్ల తర్వాత జగన్ ఇక్కడికి వచ్చి ఉంటారట. త్వరలో గృహప్రవేశం చేస్తారట. దానికి కేసీఆర్ ముఖ్యఅతిథిగా వస్తారట. రాజకీయం, డబ్బు, కేసుల మాఫీ కోసం జగన్ కేసీఆర్‌తో కలిసి ఫెడరల్‌ఫ్రంట్ అంటున్నారు. ముగ్గురు మోదీలు కలిసి ఆడుతున్న ఈ నాటకాన్ని ప్రజలకు వివరించాలి' అని ఆయన సూచించారు. 'నేరాలు, ఘోరాలు చేయడం.. కుట్రలు పన్నడమే వాటి పని. ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా మళ్లీ అధికారంలోకి వస్తే తన చేతగానితనం ఎక్కడ బయటపడుతుందోనని కేసీఆర్ భయపడుతున్నారు. ఏపీలో జగన్‌వంటి చేతగాని వ్యక్తి అధికారంలోకి వస్తే తన చెప్పుచేతల్లో ఉంటారన్నది కేసీఆర్ ఉద్దేశం' అని మండిపడ్డారు.

అక్కడ కలివిడిగా... ఇక్కడ విడివిడిగా: జాతీయ స్థాయిలో భాజపాకు వ్యతిరేకంగా సంఘటితమైన 23 రాజకీయ పార్టీలు మోదీ నిరంకుశ పాలనను అంతం చేయడమే లక్ష్యంగా త్వరలో కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందిస్తాయని చంద్రబాబు తెలిపారు. ఈ పార్టీలు జాతీయ స్థాయిలో భాజపాకు వ్యతిరేకంగా పోరాడతాయని, రాష్ట్రాల్లో మాత్రం స్థానిక పరిస్థితులు, ఆయా పార్టీల రాష్ట్ర శాఖల అభీష్టం మేరకు ఎన్నికల్లో పోటీ చేస్తాయని తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించింది. మనం కూడా భారతదేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్న నినాదంతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో కలిశాం.' అని వివరించారు. దేశాన్ని కాపాడుకునేందుకు జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో కలసి పనిచేస్తూ రాష్ట్రంలో విడివిడిగా పోటీ చేయడం మంచిదేనని భావిస్తున్నారా? అని ఆయన పార్టీ నాయకులను ప్రశ్నించారు. దీనిపై అప్పటికప్పుడు ఓటింగ్ నిర్వహించగా 93 శాతం అది మంచి నిర్ణయమేనని బదులిచ్చారు.

కేసీఆర్ 'సెంటిమెంట్'తో బతకాలని చూస్తున్నారు: 'తెలుగువాళ్లంతా కలసి ఉండాలని మనం చెబుతుంటే.. కేసీఆర్ మాత్రం మనల్ని తిడుతున్నారు. ఆయన రాజకీయం కోసం తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టాలని, సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని బతకాలని చూస్తున్నారు' అని ధ్వజమెత్తారు.

రంగంలోకి దిగండి: ఎన్నికలు వచ్చేశాయని, ఇక అందరూ కార్యరంగంలోకి దిగాలని పార్టీ నాయకులకు చంద్రబాబు సూచించారు. ఓటర్ల సర్వేలో మిగతా నియోజకవర్గాలకంటే ఉరవకొండ ముందంజలో ఉందంటూ ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పయ్యావుల కేశవ్‌ను చంద్రబాబు అభినందించారు.



కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన కాపు ఐకాస నేతలు

కాపు నేతల కృతజ్ఞతలు

ఈనాడు, అమరావతి: కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించడంపై ఆంధ్రప్రదేశ్ కాపునాడు, కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, కార్యనిర్వాహక సభ్యులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా కాపులకు న్యాయం చేయలేదని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 5 శాతం రిజర్వేషన్ కల్పించి ఆదుకున్నారని ప్రశంసించారు. గురువారం సాయంత్రం ఉండవల్లి ప్రజావేదికలో చంద్రబాబును కలిసిన వారిలో కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లా వెంకటేశ్వరరావు, కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కంటా రాయల్ మురళీ మోహన్, 13 జిల్లాల ప్రతినిధులు ఉన్నారు.

మధ్యంతర భృతిపై త్వరలో నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా రానందున ప్రస్తుతానికి రాష్ట్రంలోని ప్రభుత్వోద్యోగులు అందరికీ మధ్యంతర భృతి ఇవ్వాలని సీఎంను ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపే మధ్యంతర భృతిని ప్రకటించి అమలుచేయాలని విన్నవించారు. ఒప్పంద ఉద్యోగులను దశలవారీగా క్రమబద్ధీకరిస్తామంటూ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. వీటిపై చంద్రబాబు స్పందిస్తూ.. ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఆటంకంగా ఉన్నాయని, దీనిపై అప్పీలుకు వెళ్లాల్సి ఉందని వివరించారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వానికి ఉద్యోగుల సహకారం మరువలేనిదని అన్నారు. 'హైదరాబాద్ నుంచి మీరంతా కట్టుబట్టలతో అమరావతికి వచ్చారు. మన, పిల్లల భవిష్యత్తు కోసం నవ్యాంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని ఉద్యమించారు. కేంద్రంలో మనకు అనుకూలమైన ప్రభుత్వం ఉంటే ఈ కష్టాలు తప్పేవి. ఉద్యోగులను ఇబ్బంది పెట్టాలని ఎప్పుడూ అనుకోను. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం మరో 15 ఏళ్లు మనం శ్రమించాలి. మన కష్టం భావితరాలకు పునాది కావాలి' అని సీఎం వ్యాఖ్యానించారు. మధ్యంతర భృతి ఇవ్వకపోతే సమ్మె చేస్తామని కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని, ఇది సరికాదని ముఖ్యమంత్రి అన్నారు. ఉద్యోగుల విన్నపాలపై సానుకూలంగా ఉన్నామని అన్నారు.

ఉద్యోగ సంఘాల నాయకుల వినతులివే..

- దిల్లీ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన తరహాలోనే రాష్ట్రంలోనూ సీపీఎస్‌ను రద్దు చేయాలి. సీపీఎస్ రద్దుపై అసెంబ్లీలో తీర్మానించాలి.
- ప్రభుత్వ సంస్థలు, గురుకుల పాఠశాలల్లో పని చేసే వారికి వేతన సవరణ అమలుచేయాలి. 4 వేల మంది ఉద్యోగుల సమస్య ఇది.
- అమరావతిలో ఉద్యోగ సంఘాల భవనాల నిర్మాణానికి స్థలాలు ఇవ్వాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు.
- స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ల సమస్య పరిష్కారంపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీనిచ్చారు.
- నాలుగో తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయసును మరో రెండేళ్లు పొడిగించాలని ఐకాస కోరింది.
- ఉద్యోగుల ఆరోగ్య కార్డు పథకం అమలు సక్రమంగా లేదని ఐకాస విన్నవించగా గాడిలో పెడతామని సీఎం చెప్పారు.

ఐఆర్ మంజూరుకు సూత్రప్రాయ అంగీకారం.. ఐకాస: మధ్యంతర భృతి (ఐఆర్) మంజూరుకు ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా అంగీకరించారని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారుల ఐకాస ఛైర్మన్, సెక్రటరీ జనరల్ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బ్యాలెట్ల ప్రశ్నే లేదు

(మొదటి పేజీ తరువాయి)

కాదు, ప్రస్తుత ఈసీ మాత్రమే కాదు, మున్ముందు రాబోయే ఈసీలు కూడా బ్యాలెట్ పత్రాల శకానికి వెళ్లేదే లేదు. బ్యాలెట్ పత్రాలను మోసుకుపోవడం, దానికోసం మనుషుల్ని పురమాయించడం, ఓట్ల లెక్కింపులో జాప్యం, క్షేత్రస్థాయి సిబ్బందికి అనేక అవస్థలు... ఇవన్నీ ఉండే పాత పద్ధతికి మేం వెళ్లబోం' అని పునరుద్ఘాటించారు. గురువారం దిల్లీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో సీఈసీ ప్రసంగించారు. శుక్రవారం జరగనున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని దీనిని నిర్వహించారు. ఈవీఎంలపై ఇటీవలి కాలంలో వినిపిస్తున్న ఆరోపణల మీద అరోడా ఘాటుగా స్పందించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఫలితాలు ఒక విధంగా వస్తే ఆ తర్వాత నాలుగు నెలల్లో దిల్లీ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో మరో రకంగా వచ్చాయన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 'దిల్లీ తర్వాత హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, త్రిపుర, నాగాలాండ్, మిజోరం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్‌లలో ఎన్నికలు నిర్వహించాం. ఒక్కో సమయంలో ఒక్కో రకమైన ఫలితాలు వచ్చాయి. 'ఎక్స్' అనే ఫలితం వచ్చినప్పుడు ఈవీఎంలు సరైనవి, 'వై' అనే ఫలితం వచ్చినప్పుడు సరైనవి కాదని ఎలా అంటారు? ఫలితాలపై ఈవీఎంలను ఎందుకు తప్పు పడతారు? రక్షణరంగ సంస్థల కోసం ఎంతో పని చేసే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లు ఈవీఎంలను, వీవీప్యాట్‌లను తయారు చేస్తాయి. అత్యంత కట్టుదిట్టమైన భద్రత వాతావరణంలో పనులు జరుగుతాయి' అని వివరించారు.

1.76 లక్షల బూత్‌లలో ఆరుచోట్లే ఇబ్బందులు

ఇటీవల అయిదు రాష్ట్రాలకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో 1,76,000 పోలింగ్ బూత్‌లు ఏర్పాటైతే వాటిలో కేవలం ఆరు చోట్లే ఈవీఎంలతో ఇబ్బందులు తలెత్తాయని, వాటినీ తాను సమర్థించడం లేదని అరోడా చెప్పారు. కొన్ని వైఫల్యాలు తలెత్తిన ఆ ఈవీఎంలను ఎన్నికల్లో వాడనే లేదని, తక్షణమే అవసరమైన చర్యలన్నీ తీసుకున్నామని వివరించారు. ఇలాంటివి సున్నా కావాలనేదే తమ ప్రయత్నమన్నారు. వీవీప్యాట్‌లను ఇటీవలే ప్రవేశపెట్టినందువల్ల కొన్ని ఇబ్బందులు కనిపిస్తున్నా వాటినీ పరిహరిస్తామని చెప్పారు.

నజీర్ అహ్మద్ వానీకి 'అశోక్ చక్ర'

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ అమరుడైన లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వానీకి శాంతికాలంలో ఇచ్చే అత్యున్నత సాహస పురస్కారం 'అశోక్ చక్ర'ను ప్రభుత్వం ప్రకటించింది. జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ ఆయన స్వస్థలం. గత ఏడాది నవంబర్ 25న షోపియాన్‌లో జరిగిన ఒక భీకర ఎన్‌కౌంటర్‌లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. నజీర్ అహ్మద్ ఒకప్పుడు ఉగ్రవాది. ఆ తర్వాత లొంగిపోయారు. 2004లో ఆయన భారత సైన్యంలో చేరారు. దక్షిణ కశ్మీర్‌లో ఉగ్రవాదులపై చేపట్టిన అనేక ఎన్‌కౌంటర్‌లలో ఆయన పాల్గొన్నారు. ముష్కరులపై పోరులో చూపిన ధైర్యసాహసాలకు గుర్తింపుగా ఆయనకు ఇప్పటికే 'సేనా పతకం' లభించింది.



చందా కొచ్చర్‌పై సీబీఐ కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థలపైనా కేసులు పెట్టింది. ముంబయి, ఔరంగాబాద్‌ల్లో ఉన్న వీడియోకాన్ గ్రూపు కార్యాలయాలు, నూపవర్ కార్యాలయాల్లో గురువారం సోదాలు జరిగాయి. ఐసీఐసీఐ బ్యాంకు ఇంతవరకు వీడియోకాన్‌కు రూ.3,250 కోట్ల రుణం మంజూరు చేసింది. అందులో చందా హయాంలో రూ.1,875 కోట్ల మేర ఆరు రుణాలు మంజూరయ్యాయి. వీటిని కేటాయించిన ఐసీఐసీఐ బ్యాంకు కమిటీలో సభ్యులుగా ప్రస్తుత సీఈవో సందీప్ బక్షి, సంజోయ్ ఛటర్జీ(గోల్డ్‌మ్యాన్‌షాస్ ఛైర్మన్), జరిన్ దారువాలా (స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంకు సీఈఓ), రాజీవ్ సభర్వాల్ (టాటా కేపిటల్ సీఈఓ), కె.వి.కామత్ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఛైర్మన్), హోమీ కుర్సీఖాన్ (టాటా కేపిటల్ సీనియర్ సలహాదారు)లు వ్యవహరించారు. వారిని కూడా విచారించే అవకాశం ఉంది. చందా కొచ్చర్ అధ్యక్షతనగల కమిటీ వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్‌కు 2009లో రూ.300 కోట్లు, 2011లో రూ.750 కోట్లు రుణంగా మంజూరు చేసిందని, ఈ విషయంలో నిబంధనలు పాటించలేదని పేర్కొంది. ఇచ్చిన రుణాల్లో చాలావరకు తిరిగి వసూలుకాకపోవడంతో బ్యాంకుకు రూ.1,730 కోట్లు నష్టం వచ్చినట్టు ఆరోపించింది. రుణాలు మంజూరుకు ప్రతిఫలంగా వీడియోకాన్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్ ధూత్...సూపర్ ఎనర్జీ పేరుతో చందా కొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్‌కు చెందిన నూపవర్ కంపెనీలో రూ.64 కోట్లు పెట్టుబడి పెట్టారని తెలిపింది. 2009 సెప్టెంబరు ఏడో తేదీన రూ.300 కోట్ల రుణం మంజూరు కాగా, మరుసటి రోజునే ఆ సొమ్మును బదిలీ చేశారని పేర్కొంది. ఈ పెట్టుబడి అవినీతి కిందికే వస్తుందని ఆరోపిస్తూ కేసు నమోదు చేసింది.



ఆరంభించరు..

సాధారణంగా మనమేదైనా పనిని సంపూర్ణంగా పూర్తి చెయ్యలేమని అనుకుంటున్నప్పుడు.. అసలా పనిని మొదలుపెట్టేందుకే సందేహిస్తుంటాం. కానీ వాస్తవానికి ఇటువంటి మానసిక స్థితే మన పురోగమనానికి పెద్ద అవరోధం!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

25–1–2019 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
పంచమి: రా. 12.28 తదుపరి షష్ఠి
ఉత్తర నక్షత్రం: రా. 10.25 తదుపరి హస్త
అమృత ఘడియలు: మ. 3.38 నుంచి 5.08 వరకు
వర్జ్యం: ఉ. శేషం 8.06 వరకు తిరిగి తె. 6.24 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 8.52 నుంచి 9.36 తిరిగి మ. 12.35 నుంచి 1.19 వరకు
రాహుకాలం: ఉ. 10.30 నుంచి 12.00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-47

పీఎస్ఎల్వీ విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. కలాంశాట్ కమ్యూనికేషన్ ఉపగ్రహం. మైక్రోశాట్-ఆర్ దేశ రక్షణ రంగ అవసరాల కోసం(డీఆర్‌డీవో) పంపారు. దీనికి డీఆర్‌డీఏ వారు పెలోడ్లను సమకూర్చారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి రాకెట్ బయలుదేరాక 13 నిమిషాల అనంతరం 274 కిలోమీటర్ల ఎత్తులో మైక్రోశాట్ ఉపగ్రహాన్ని విడిచిపెట్టింది.

పీఎస్ఎల్వీలో కొత్త సాంకేతికత

పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో ఇది 46వ వాహకనౌక. దీనిని పీఎస్ఎల్వీ-డీఎల్‌గా పిలుస్తున్నారు. సాధారణంగా పీఎస్ఎల్వీ వాహకనౌకకు ఆరు స్ట్రాపాన్ బూస్టర్లు ఉంటాయి. పీఎస్ఎల్వీ-సీ44లో మాత్రం రెండు స్ట్రాపాన్ బూస్టర్లను అమర్చారు. దాంతోనే ప్రయోగం చేపట్టారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వాహకనౌకకు పీఎస్ఎల్వీ-డీఎల్‌గా నామకరణం చేశారు. వాహకనౌకలోని పీఎస్4 దశను కక్ష్యలో ఆర్బిటాల్ ప్లాట్‌ఫాంలా ఉపయోగపడేందుకు అంతరిక్షంలోనే ఉంచనున్నారు. వాహకనౌకలో బరువును తగ్గించి పరిమాణాన్ని పెంచేందుకు తొలిసారి నాలుగో దశలో అల్యూమినియం ట్యాంకును వినియోగించారు.

ఇస్రోకు వచ్చి ప్రయోగాలు చేయవచ్చు


ప్రయోగం అనంతరం ఇస్రో ఛైర్మన్ శివన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపగ్రహాలు తయారు చేసుకుని, వాటిని ఇస్రోకు తీసుకువచ్చి ప్రయోగించవచ్చని సూచించారు. ప్రస్తుతం తమిళనాడు విద్యార్థులు తయారుచేసిన కలాంశాట్ నిర్ణీత కక్ష్యలోకి చేర్చామంటూ విద్యార్థులను అభినందించారు.

నాగావళి మురిసేలా వంశధార

- త్వరలో పూర్తికానున్న అనుసంధాన పనులు
- వేగంగా సాగుతున్న కాలువ పనులు
- లక్షన్నర ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం

వంశధార – నాగావళి నదుల అనుసంధానం పనులు వేగంగా జరుగుతున్నాయి. మార్చి నెలాఖరుకు వీటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో చేస్తున్నారు. వంశధార నది నుంచి ఇప్పటికే హిరమండలం జలాశయానికి నీరు చేరింది. ఇక్కడ నుంచి గ్రావిటీ కాలువ తవ్వి నారాయణపురం ఆనకట్టకు అనుసంధానిస్తారు. దీంతో వంశధార వరద జలాలు నాగావళి నదిపై నిర్మించిన నారాయణపురం ఆనకట్టకు తరలి దాదాపు లక్షన్నర ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రయోజనం కలుగుతుంది. ఇది పూర్తయితే రాష్ట్రంలో గోదావరి–కృష్ణా నదుల అనుసంధానం తర్వాత మరో రెండు నదుల అనుసంధానం చేసినట్లవుతుంది.

నారాయణపురానికి నీటి రాక గగనమే



నాగావళి నదిపై చివర్లో నిర్మించింది నారాయణపురం ఆనకట్ట. దీనికి నీరు రావాలంటే ఎగువన ఉన్న తోటపల్లి ప్రాజెక్టు లేదా మడ్డువలస ప్రాజెక్టుల నుంచే రావాల్సి ఉంటుంది. అయితే తోటపల్లి ఆ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2.5టీఎంసీలే. ఎనిమిదిసార్లు దాన్ని నింపి 2.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. మరో 60 వేల ఎకరాలు కొత్తగా తోడవుతోంది. ఈ అవసరాలు తీరిన తర్వాత నారాయణపురం ఆనకట్టకు నీళ్లు సరఫరా చేయాలి. మరో ప్రాజెక్టైన మడ్డువలసకు ఎగువన ఉన్న ప్రాజెక్టులు, అవసరాలు అన్నీ ఇన్నీ కావు. నాగావళి ఉపనదుల నుంచి ఈ నీరు రావాల్సి ఉంటుంది. వాటిపైనా ఎగువన ప్రాజెక్టులున్నాయి. గోముఖి జలాశయం, వెంగళరాయసాగర ప్రాజెక్టు, సీతానగరం ఆనకట్ట, పెద అంకలం ఆనకట్ట, పాచిపెంట ఆనకట్ట పారాది ఆనకట్టలు ఆయా ఉపనదులపై ఉన్నాయి. వీటి నీటి అవసరాలు తీరితేనే దిగువకు నీళ్లొస్తాయి. ఈ క్రమంలో భారీ వరదలు వచ్చినప్పుడు మినహా నారాయణపురం ఆనకట్టకు నీరు రావడం గగమనవుతోంది. ఈ సమస్య పరిష్కారానికే వంశధార -నాగావళి అనుసంధానానికి తెరతీశారు. రూ.69.78 కోట్ల అంచనా వ్యయంతో గ్రావిటీ కాలువ తవ్వి హిరమండలం జలాశయం నుంచి నారాయణపురం ఆనకట్టకు నీటిని తరలిస్తారు.

1. తోటపల్లి బ్యారేజ్

సామర్థ్యం 2.5 టీఎంసీలు. ఎనిమిదిసార్లు నింపి.. 2.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు.. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వెయ్యి చెరువులను నింపడంతో పాటు.. తాగునీటిని అందించాల్సి ఉంది. భారీ వరదలు వస్తే తప్ప దిగువకు నీరు ఇవ్వలేరు.



2. మడ్డువలస ప్రాజెక్టు

సువర్ణముఖి, వేగావతి నదులు కలిసి ఉంది. సామర్థ్యం 3.373 టీఎంసీలు. ఎగువ అవసరాలు తీరితేనే ఇక్కడకు నీళ్లొస్తాయి. ఈ గేట్లు ఎత్తితేనే నారాయణపురం ఆనకట్టకు చేరతాయి. ఆ పరిస్థితి చాలా అరుదు.

3. హిరమండలం (వంశధార) జలాశయం

ఈ జలాశయం నుంచే నారాయణపురం ఆనకట్టకు అనుసంధాన కాలువ తవ్వుతున్నారు. (సామర్థ్యం 19.5 టీఎంసీలు)

4. అనుసంధానం కాలువ

వంశధార - నాగావళి నదులను ప్రత్యక్షంగా అనుసంధానించే కాలువ.

5. నారాయణపురం ఆనకట్ట

తోటపల్లి బ్యారేజి దిగువన నాగావళి నదిపై నిర్మించారు.

అనుసంధానం ఇలా..

హిరమండలం జలాశయం గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 33.58 కిలోమీటర్ల మేర కాలువ నారాయణపురం ఆనకట్ట వరకు తవ్వుతున్నారు. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో ఉండగా...నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసే చోట 29.09 మీటర్లు. దీంతో ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. వంశధార నుంచి గరిష్ఠంగా ఏటా 300 టీఎంసీలు సముద్రం పాలవుతోంది. అనుసంధాన కాలువ నిర్మాణం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కాలువ పొడవునా 108 నిర్మాణాలకు గాను.. మూడోవంతులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తూముల నిర్మాణాలు పూర్తి కావడంతో.. గేట్లు అమర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

-ఈనాడు, శ్రీకాకుళం

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	14.8	31.6
విశాఖపట్నం	15.6	30.6
మెదక్	15.7	34.8
శ్రీకాకుళం	16.0	27.0
నల్గొండ	17.0	30.0
కరీంనగర్	17.0	31.0
గుంటూరు	17.9	30.9
రాజమహేంద్రవరం	18.0	33.0
కడప	18.0	33.0
హైదరాబాద్	18.3	29.7
తిరుపతి	18.5	32.5
విజయవాడ	19.5	30.1
అనంతపురం	19.7	33.1
నరసాపురం	19.9	29.9
తాడేపల్లిగూడెం	20.2	29.1
కర్నూలు	20.2	32.7
నెల్లూరు	21.0	31.0
ఖమ్మం	21.0	32.0
ఒంగోలు	21.5	32.2

డీఎస్సీ ఫలితాల విడుదలలో జాప్యం

- కొన్నింటికి వెల్లడికాని తుది 'కీ'
- ఫలితాల కోసం 2.62లక్షల మంది అభ్యర్థులు నిరీక్షణ



ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్న పాఠశాల విద్యాశాఖ. . ఫలితాలు విడుదల చేయడంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఎంపిక ప్రక్రియను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. మొదటిసారిగా ఆన్‌లైన్‌లోనే డీఎస్సీ నిర్వహిస్తున్నందున ఫలితాలు వెంటనే విడుదల చేస్తామని ఇటీవల ప్రకటించిన అధికారులు ఇప్పుడు దీన్ని పట్టించుకోవడం లేదు. పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక 'కీ' విడుదలకే చాలా రోజులు తీసుకుంటున్నారు. దీంతో అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. స్కూల్ అసిస్టెంట్లు(భాషేతర, భాషలు), పోస్టుగ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ(టీజీటీ), ప్రిన్సిపాళ్లు, వ్యాయామ, మ్యూజిక్, క్రాఫ్ట్, ఆర్ట్, డ్రాయింగ్, భాషా పండితుల పోస్టులకు డీఎస్సీ పరీక్షలు ముగిశాయి. వీటిల్లో స్కూల్ అసిస్టెంట్లు, పీజీటీ, టీజీటీ పోస్టులకు మాత్రమే ప్రాథమిక, తుది 'కీ'లను విడుదల చేశారు. మిగతా వాటికి ఇంతవరకు ప్రాథమిక 'కీ'నే విడుదల చేయలేదు.

2.62 లక్షల మంది ఎదురుచూపు

డీఎస్సీ ఫలితాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2.62లక్షల మంది ఎదురుచూస్తున్నారు. డీఎస్సీకి మొత్తం 6,08,157మంది దరఖాస్తు చేయగా ఇందులో ఎస్జీటీలు 3,45,734మంది ఉన్నారు. ప్రస్తుతం ఎస్జీటీలకు పరీక్షలు జరుగుతుండగా.. మిగతా అన్ని పోస్టులకు పరీక్షలు పూర్తయ్యాయి. దీంతో ఫలితాల కోసం నిరుద్యోగులు నిరీక్షిస్తున్నారు.

★ స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు సంబంధించి తుది 'కీ' విడుదల చేసినప్పటికీ ఇంతవరకు దీనిపై పూర్తి సమాచారాన్ని ప్రకటించలేదు. ప్రాథమిక 'కీ'పై వచ్చిన అభ్యంతరాల్లో ఎన్నింటిని పరిగణలోకి తీసుకున్నది? ఎన్నింటికి అదనంగా మార్కులు కలుపుతున్న విషయాన్ని అధికారికంగా ఎక్కడా విడుదల చేయలేదు. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం స్కూల్ అసిస్టెంట్ల ఫలితాలు ఈనెల 10న, మెరిట్ జాబితా 13న, 17న ఎంపిక జాబితాను ప్రకటించాలి. కానీ ఇంతవరకు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

★ ప్రిన్సిపాళ్లు, పీఈటీ, మ్యూజిక్, క్రాఫ్ట్, ఆర్ట్, డ్రాయింగ్ పోస్టులకు ఈనెల 2న, భాషా పండితులకు ఈనెల 3న ప్రాథమిక 'కీ' విడుదల చేయాల్సి ఉండగా.. ఇంతవరకు దీన్ని విడుదల చేయలేదు. పీజీటీ, టీజీటీ పోస్టులకు తుది 'కీ' ఈనెల 9, 13న ప్రకటించాల్సి ఉండగా.. అభ్యంతరాల పరిశీలనే పూర్తికాలేదు. ఈ పోస్టులకు సంబంధించి ఎంపిక జాబితాను ఈనెల 19, 23, 24 తేదీల్లో ఇవ్వాల్సి ఉండగా.. ప్రాథమిక, తుది 'కీ' ప్రక్రియనే పూర్తికాలేదు. ఉపాధ్యాయ ఖాళీల భర్తీని ఫిబ్రవరి ఆఖరు లోపు పూర్తి చేస్తామని ఇటీవల అధికారులు సుప్రీం కోర్టుకు సైతం విన్నవించారు. కానీ, అధికారులు షెడ్యూల్ ప్రకారం ఫలితాలు ఇవ్వడం లేదు.

తిరుపతిలో శిల్పారామం పనులకు రూ.10కోట్ల మంజూరు

ఈనాడు, అమరావతి: తిరుపతిలో శిల్పారామం నిర్మాణ పనులను రూ.10కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ప్రవేశద్వారం, స్వాగత తోరణం, సందర్శకుల కేంద్రం, వాటర్ ఫౌంటైన్, హస్తకళల గ్రామాలు, స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, విద్యుదీకరణ తదితర పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలని గురువారం పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

సినీనటి భానుప్రియపై ఫిర్యాదు

- తన కుమార్తెను పనికి పెట్టుకుని వేధిస్తున్నారని ఆరోపణ
- నాపై తప్పుడు కేసు పెట్టారు: భానుప్రియ ఆవేదన

సామర్లకోట గ్రామీణం, కోడంబాక్కం, న్యూస్‌టుడే: ఏడాదిన్నరగా పని చేస్తున్న తన కుమార్తెకు జీతం ఇవ్వకుండా సినీనటి భానుప్రియ కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేస్తున్నారంటూ తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట మండలం పండ్రవాడకు చెందిన పెనుపాకల ప్రభావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలిసిన భానుప్రియ బాలిక తల్లి ఫిర్యాదులో చేసిన ఆరోపణలను ఖండించారు. బాలిక తల్లి, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... ప్రభావతి చిన్నకుమార్తె (14)ను మధ్యవర్తుల ద్వారా చెన్నైలోని సినీనటి భానుప్రియ ఇంట్లో ఏడాదిన్నర కిందట నెలకు రూ.10వేల జీతానికి పనికి పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సక్రమంగా జీతం ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని, భానుప్రియ సోదరుడు తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాలిక.. తన తల్లి ప్రభావతికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆమె చెన్నై వెళ్లింది. కూతురిని పంపాలని అడిగితే.. తన కుమార్తెపై దొంగతనం నేరం మోపి జైలులో పెట్టిస్తామని బెదిరించి, తనను కొట్టి పంపేశారని.. ఇంటికి పంపాలంటే రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ప్రభావతి ఫిర్యాదులో పేర్కొంది. ఇంట్లో దొంగిలించిన వస్తువులను అడిగినందుకే తమపై ఫిర్యాదు చేశారని భానుప్రియ వివరణ ఇచ్చారు. మరోవైపు భానుప్రియపై తన తల్లి చేసిన ఫిర్యాదుపై బాలిక స్పందించింది. డబ్బు, నగలు తీసుకెళ్లి తన తల్లికే ఇచ్చానని, వాటిని తిరిగి తీసుకొచ్చి ఇస్తానని, తనకు ఎలాంటి వేధింపులు లేవని వెల్లడించింది.

ఉద్యోగులకు గృహ యోగం

- జిల్లాల్లో సొసైటీ/ బృందం ద్వారా కేటాయింపు
- 15 ఏళ్ల వరకు విక్రయాలు జరపకూడదు
- గృహ విధానాన్ని ప్రకటించిన ప్రభుత్వం

ఈనాడు – అమరావతి

ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'గృహ విధానాన్ని' ప్రకటించింది. సచివాలయంలో సోమవారం జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఆమోదించిన మేరకు గురువారం రెవెన్యూ శాఖ దానిని వెల్లడించింది. జిల్లాల్లో పనిచేసే ఉద్యోగులు సొసైటీ లేదా బృందంగా ఏర్పడిన వారికి ఇళ్ల స్థలాలను కేటాయిస్తారు. భార్యాభర్తలు ఉద్యోగులై ఉంటే..ఒకరికి మాత్రమే ఈ అవకాశాన్ని కల్పిస్తారు. వ్యక్తిగతంగా స్థలాన్ని కేటాయించరు. ప్రభుత్వ స్థలం లేకుంటే...ప్రైవేట్ స్థలాన్ని సేకరించి బహుళ అంతస్తులను నిర్మించి ఫ్లాట్స్ రూపంలో కేటాయిస్తారు. ఇంటి నిర్మాణాలను సొసైటీ లేదా బృందాలు సొంతంగా చేపట్టొచ్చు. లేదంటే ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ బోర్డు లేదా ఏపీ టిడ్కో వంటి సంస్థల సహాయాన్ని కూడా తీసుకోవచ్చని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాల్లో ఈ ప్రక్రియ అంతటికీ కలెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.

అమరావతి నగరంలో గృహ విధానమిలా..

అమరావతి నగరంలో ప్రభుత్వ ఉద్యోగులు, పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయింపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గురువారం గృహ విధానాన్ని ప్రకటించింది. ఏపీ క్యాడర్‌కు చెందిన, డెప్యుటేషన్‌పై ఏపీలో పనిచేస్తున్న అఖిల భారత సర్వీసు అధికారులకు 500 గజాల స్థలాన్ని ఇవ్వనున్నారు. రాజధానిలో పనిచేసే గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, స్వతంత్ర (అటానమస్), ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ప్లాటు లేదా ఫ్లాట్లు ఇవ్వనున్నారు. ఇళ్ల స్థలాల్ని వ్యక్తిగతంగా కాకుండా సహకార సంఘానికి లేదా బృందానికి కేటాయిస్తారు.

అపార్ట్‌మెంట్లు నిర్మించుకోవాలనుకొనే వారు సీఆర్‌డీఏ, హౌసింగ్‌బోర్డు, టిడ్కో నుంచి సహకారం తీసుకోవొచ్చు. స్థలాన్ని ఎంత ధరకు కేటాయించాలనేది మంత్రివర్గ ఉపసంఘం సూచనల మేరకు సీఆర్‌డీఏ నిర్ణయిస్తుంది. ఈ మేరకు సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ నిబంధనలు, అర్హతలు తదితర అంశాలను ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

'గృహ విధానం' నిబంధనలిలా..

★ సొసైటీ లేదా బృందంలో కనీసం 12 మంది సభ్యులు ఉండాలి. ఇందులో ఉద్యోగి తప్పనిసరిగా సభ్యుడై ఉండాలి.

★ దరఖాస్తు చేసిన వారికి సంబంధిత పట్టణంలో ఇల్లు లేదా స్థలం లేదని స్వీయ ప్రమాణపత్రం సమర్పించాలి. భార్య లేదా పిల్లల పేరుమీద కూడా ఇవి ఉండకూడదు.

★ సొసైటీలు లేదా బృందాలు సభ్యత్వం పొందిన వారి దరఖాస్తులను స్వీయ ప్రమాణపత్రాలతో జిల్లా కలెక్టరుకు సమర్పించాలి. వాటిని కలెక్టర్ వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు బహిర్గతం చేయాలి.

★ తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే సంబంధిత సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా..జిల్లా కలెక్టర్ తీసుకునే సివిల్, క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

★ దరఖాస్తుల స్వీకరణ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ స్థలం లేదా ఫ్లాట్స్ అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. ఏపీ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ నిర్ధరించిన మేరకు స్థలానికి నామమాత్ర ధర ఖరారు చేస్తారు. సొసైటీ ద్వారా ఉద్యోగులకు ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేస్తారు.

★ ఒకవేళ కొందరు ఉద్యోగులకు స్థలాల కేటాయింపు జరగలేని పరిస్థితులు తలెత్తితే మలి విడతలో కేటాయిస్తారు.

★ స్థలాన్ని కేటాయించిన అనంతరం మూడు సంవత్సరాల్లోగా నిర్మాణం పూర్తిచేయాలి. 15 సంవత్సరాల వరకు విక్రయించకూడదు.

★ ఇంటి స్థలం లేదా ఫ్లాట్‌ను లాటరీ ద్వారా కేటాయిస్తారు.

★ కేటాయింపు వివరాలను ఉద్యోగుల సర్వీసు రికార్డుల్లో నమోదుచేస్తారు.

ఈనాడు

జాతిపై సాంక్రామిక దాడి

చలిపులి పంజా విసరుతున్న వేళ దేశంలోని పలు ప్రాంతాల్లో స్వైన్ ఫ్లూ జూలు విదిలిస్తోంది. ఈ కొత్త సంవత్సరం తొలి రెండు వారాల్లోనే వివిధ రాష్ట్రాల్లో దాదాపు 17 వందల కేసులు నమోదయ్యాయని, యాభై దాకా మరణాలు సంభవించాయని సమీకృత వ్యాధి నిఘా కార్యక్రమం (ఐడీఎస్‌పీ) గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. రాజస్థాన్‌లోని 31 జిల్లాలను హడలెత్తిస్తున్న స్వైన్ ఫ్లూ ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు దిల్లీ, గుజరాత్, హరియాణా, తమిళనాడు, పంజాబ్, మహారాష్ట్రల్లోనూ కోర చాస్తోంది. 2018లో దేశవ్యాప్తంగా రమారమి 15వేల మందికి సోకినట్లు నిర్ధారణ అయిన స్వైన్ ఫ్లూ 1,103 నిండు ప్రాణాల్ని కబళించింది. దేశ రాజధాని దిల్లీ నగరంలో నిరుడు ఏడాది కాలానికి 205గా నమోదైన కేసుల సంఖ్య ఈ జనవరి తొలి రెండు వారాల్లోనే 168కి చేరడం, గుజరాత్‌లో అంతకన్నా మించిపోవడం- స్వైన్ ఫ్లూ ధాటిని కళ్లకు కడుతోంది. మూడు నెలలక్రితం కేవలం 10 రోజుల వ్యవధిలోనే కొత్తగా 180 హెచ్1ఎన్1 కేసుల నిర్ధారణకు, ఇరవై మరణాలకు నెలవైన రాజస్థాన్‌లో మహమ్మారి వైరస్ నేడు అక్షరాలా జడలు విరబోసుకుంటోంది. గడచిన 13 నెలల్లో అక్కడ స్వైన్ ఫ్లూ మృతుల సంఖ్య రెండు వందలకు పైబడటం- పాలక, ప్రతిపక్షాల మధ్య రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల చిచ్చు రగిలించింది. రైల్వేస్టేషన్లు, పాఠశాలల వద్ద వ్యాధి ప్రబలత కనుగొనే ఏర్పాట్లు కొరవడ్డాయని భాజపా దుమ్మెత్తిపోస్తుండగా, మునుపటి రాజె జమానా అలసత్వం కారణంగానే ఇప్పుడీ దుస్థితి దాపురించిందని అశోక్ గహ్లోత్ సర్కారు తిప్పికొడుతోంది. రాజస్థాన్‌లోనే కాదు, తక్కిన రాష్ట్రాల్లోనూ ప్రాథమిక దశలోనే యంత్రాంగం అప్రమత్తమై, బాధితుల కుటుంబ సభ్యులతోపాటు చుట్టుపక్కలవారికీ ముందస్తు చికిత్స అందించి ఉంటే హెచ్1ఎన్1 ఇంతగా రెచ్చిపోయేదే కాదు.

పదేళ్లక్రితం మెక్సికోలో తొలి కేసు వెలుగు చూశాక, అనతికాలంలోనే ఊహాతీత వేగంతో విస్తరించి ప్రపంచ దేశాలను స్వైన్ ఫ్లూ కారక హెచ్1ఎన్1 గజగజ వణికించింది. ఆ ఏడాది భారత్‌లో దాదాపు 50 వేలమందికి సోకిన మహమ్మారి వైరస్ 2,700 నిండు ప్రాణాల్ని కర్కశంగా తోడేసింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం 2010-17 సంవత్సరాల మధ్య లక్షా 14 వేల మందికి సోకిన స్వైన్ ఫ్లూ ఎనిమిదిన్నర వేల మందిని విగతజీవులు చేసింది. 2017 నాటి మృతుల సంఖ్య 2,270 నిరుడు పదకొండు వందలకు తగ్గినా, ఈ సంవత్సరారంభం నుంచే పాత రికార్డులు బద్దలుకొట్టే వేగంతో స్వైన్ ఫ్లూ భీకర విజృంభణ- సత్వర సమష్టి కార్యాచరణ ఆవశ్యకతను ఉద్బోధిస్తోంది! గత ఏడాది తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్‌లలోనే ఇంచుమించు 10వేల మందికి హెచ్1ఎన్1 సంక్రమించిందని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నేడా నాలుగు రాష్ట్రాల్లోనూ కొత్త కేసుల ఉద్ధృతి ప్రస్ఫుటమవుతోంది. పోయిన ఏడాది 14 వందలకు పైగా స్వైన్ ఫ్లూ కేసులు నమోదైన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ సంవత్సరం ఇప్పటికే ఆ సంఖ్య 130కి పైబడింది. వైరస్ సోకిన వ్యక్తి దగ్గినా తుమ్మినా ఇతరులకు వ్యాపించే స్వైన్ ఫ్లూ లక్షణం దృష్ట్యా వ్యాధి నియంత్రణను లక్షించి జాతీయ వ్యూహాన్ని పకడ్బందీగా అమలుపరచాల్సిన అవసరం విస్మరించరానిది. గర్భిణులు, అయిదేళ్లలోపు పిల్లలు, అరవై అయిదేళ్లకు పైబడిన పెద్దవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నారు. వాటిని గాలికి వదిలేయడం, వ్యాధి నిర్ధారణలో చికిత్సలో తీవ్రజాప్యం విషాదాగ్నుల్ని ప్రజ్వరిల్లజేస్తున్నాయి. సిక్కిం, లక్షద్వీప్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్‌లలో హెచ్1ఎన్1 ఎందుకు ప్రబలం కావడం లేదన్న అంశంపై ప్రభుత్వాలు లోతుగా అధ్యయనం చేపట్టాల్సి ఉంది. ఆ అనుభవాల నుంచి పాఠాలు స్వీకరించి దేశవ్యాప్తంగా విస్తృత కార్యాచరణను చురుగ్గా పట్టాలకు ఎక్కించాలి.

జనసమ్మర్ద ప్రాంతాల్లో స్వైన్ ఫ్లూ పట్టపగ్గాలు లేకుండా విజృంభిస్తుందని గతంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ పెను ప్రమాద ఘంటికలు మోగించినప్పుడు, చైనా వెనువెంటనే అప్రమత్తమైంది. అప్పట్లో వేలసంఖ్యలో కేసులు నమోదైనా, ప్రాణనష్టం పెచ్చుమీరకుండా అది ఎన్నో జాగ్రత్తలు తీసుకుంది. అటువంటి జన చైనాకిప్పుడు 22 ప్రావిన్సుల్లో ఏఎస్ఎఫ్ (ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్) వేగంగా విస్తరిస్తుండటం- కంటికి కునుకు లేకుండా చేస్తోంది. రష్యా, రొమేనియా, ఐవరీకోస్ట్ సహా 19 దేశాల్లో ఏఎస్ఎఫ్ కేసులు మూడు లక్షల 60 వేలకు పైబడటం- పాతవాటితోపాటు కొత్త వైరస్‌ల ముప్పును చాటుతోంది. ప్రాణాంతకంగా పరిణమిస్తున్న వివిధ వ్యాధులకు అందిస్తున్న వైద్య చికిత్సల ప్రాతిపదికన 195 దేశాల సూచీని 'లాన్సెట్' రూపొందించగా, అందులో 145వ స్థానానికి ఇండియా పరిమితమైంది. సాంక్రామిక వ్యాధులపై పోరాటానికి కాలూచేయీ కూడదీసుకుంటేనే- ప్రజారోగ్య పరిరక్షణలో, వైద్యసేవల నాణ్యతలో భారత్ పైమెట్టు ఎక్కగలుగుతుంది. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థల్లోనూ స్వైన్ ఫ్లూ నిర్ధారణ పరీక్షలకు అనుమతించడం అక్కడ వైరస్ వ్యాప్తి కట్టడిలో నిర్ణాయకాంశమైంది. దేశవ్యాప్తంగా జిల్లా ప్రాంతీయ దవాఖానాల్లో ప్రైవేటు వైద్య సంస్థల్లో వ్యాధి నిర్ధారణ కేంద్రాలు నెలకొల్పి, స్వైన్ ఫ్లూ మందులు అందుబాటులో ఉంచేలా చూస్తే- కిరాతక వైరస్ నియంత్రణలో అదో మేలుమలుపవుతుంది. హెచ్1ఎన్1 కట్టడికి భిన్న మంత్రిత్వశాఖల నడుమ సమన్వయం ఎంత కీలకమో తెలియజెబుతూ జాతీయ విపత్తుల నిభాయక సంస్థ జారీచేసిన మార్గదర్శకాల్ని రాష్ట్రాలన్నీ ఔదలదాలిస్తేనే- ఈ యుద్ధంలో జాతి గెలుపొందుతుంది!



వీబీఎస్ఎస్ కోటేశ్వరరావు

నేడు ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తున్న భారత్ మున్ముందు ఇంకా పైఅంచెలకు ఎగబాకనుంది. ఏటా 7.5 శాతం చొప్పున పెరుగుతున్న భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) రానున్న పదేళ్లపాటు ఇదే వృద్ధిరేటును కొనసాగిస్తుందని అంచనా. చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలు ఎగుమతుల మీద అభివృద్ధి సౌధాన్ని నిర్మించుకోగా, భారత్ స్వదేశంలో వస్తుసేవల వినియోగాన్ని పెంచుకోవడం ద్వారా అధిక వృద్ధిరేటును అందుకోవాలని లక్షిస్తోంది. అమెరికాదీ ఇదే పంథా. భారత్ జీడీపీలో 60 శాతానికి అంతర్గత వినియోగమే ఆలంబన.



మిగతా రెండు లక్షల కోట్ల డాలర్లను ఖరీదైన వస్తువుల మీద ఖర్చు పెడతారు. ఆ మేరకు వస్తూత్పత్తి, వినియోగాలు విజృంభిస్తాయి. దేశంలో 40 అగ్ర నగరాల్లో లక్షన్నర కోట్ల డాలర్ల వినియోగం జరుగుతుందని, వేలాది చిన్న పట్టణాల్లోనూ అంతే స్థాయిలో వినియోగం నమోదు కావచ్చని నివేదిక చెబుతోంది. దీనికితోడు గ్రామాల్లో మౌలిక వసతులను, చిల్లర వ్యాపారాన్ని విస్తరిస్తే మరో 1.20 లక్షల కోట్ల డాలర్ల మేరకు వినియోగం ఇనుమడిస్తుంది. 2030కల్లా యువ భారతీయుల వల్ల వస్తుసేవల వినియోగం ఇంతలంతలు కానుంది. అప్పటికి సహస్రాబ్ది తరం (1981-96) ఇంటిపెద్దగా ఉండే మిలీనియల్ (1999-2000 తరవాత పుట్టినవారు) కుటుంబాల సంఖ్య తొమ్మిది కోట్లకు చేరుతుంది. 1997-2018 మధ్య పుట్టిన ఆధునిక తరం 'జనరేషన్ జడ్' వారు 37 కోట్లకు చేరతారు. వీరి మూలంగా రకరకాల ఆహార పదార్థాలు, పానీయాలు, వ్యక్తిగత అలంకరణ

ఆదాయ సృష్టి - వినియోగ వృద్ధి

2030నాటికల్లా మన వస్తుసేవల వినియోగం ఆరు లక్షల కోట్ల డాలర్లకు చేరనుందని ప్రపంచ ఆర్థిక వేదిక అనుబంధ సంఘం రూపొందించిన ఓ నివేదిక చెబుతోంది. ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాల వల్ల భారతదేశ వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుందని అంచనా. నేడు దేశంలో ప్రతి నాలుగు కుటుంబాల్లో ఒకటి ఈ రెండు వర్గాల్లో దేనికో ఒకదానికి చెందినదై ఉంటోంది. అదే 2030 వచ్చేసరికి దేశంలో సగం కుటుంబాలు ఎగువ మధ్యతరగతిలోనో, సంపన్నవర్గంలోనో ఉంటాయి. అదే సమయంలో భారత జనాభాలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 15 శాతంనుంచి అయిదు శాతానికి తగ్గుతుందంటున్నారు. పెరిగే అంతర్జాల (ఇంటర్నెట్) వినియోగదారులకు వస్తువులు అందించడానికి చిల్లర, టోకు వర్తకులతో అంతర్జాల ఈ-కామర్స్ సంస్థలు పోటీపడతాయి. ఇప్పటికే అవి ప్రపంచం నలుమూలల నుంచి వైవిధ్యభరితమైన సరకులను అందిస్తున్నాయి. మారుమూల విక్రేతలనూ అంతర్జాలం సాయంతో వినియోగదారులతో అనుసంధానిస్తున్నాయి. ఫలితంగా వినూత్న వస్తుసేవలు, వ్యాపార నమూనాలూ రంగప్రవేశం చేస్తున్నాయి. సాంకేతికత, నవీకరణ, పట్టణీకరణ, పెరిగే ఆదాయాలు, మారుతున్న వినియోగదారుల అభిరుచులు, జనాభాలో యువత శాతం ఎక్కువగా ఉండటం వంటివి భారత్‌లో వినియోగాన్ని, తద్వారా జీడీపీని పెంచబోతున్నాయని పై నివేదిక స్పష్టీకరించింది.

అందివస్తున్న అవకాశం

ప్రస్తుతం దేశంలో లక్షన్నర కోట్ల డాలర్లుగా ఉన్న వస్తుసేవల వినియోగం- పెరుగుతున్న ఆదాయాల మూలంగా 2030కల్లా ఆరు లక్షల కోట్ల డాలర్లకు చేరనుంది. అప్పటికి ఎగువ మధ్యతరగతి కుటుంబాలు 14 కోట్లకు, సంపన్న కుటుంబాల సంఖ్య 2.1 కోట్లకూ చేరి భారత్ నిజమైన మధ్యాదాయ దేశంగా అవతరిస్తుంది. అప్పటికి మొత్తం వినియోగంలో ఎగువ మధ్యతరగతి కుటుంబాల వాటా 47 శాతం (2.8 లక్షల కోట్ల డాలర్ల)కు, సంపన్న కుటుంబాల వాటా 14 శాతం (0.8 లక్షల కోట్ల డాలర్ల)కు పెరుగుతుంది. ఇప్పుడు వినియోగంలో ఈ రెండు వర్గాల వాటాలు 30, ఏడు శాతాలుగా ఉన్నాయి. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, దిల్లీ, హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర, గుజరాత్‌లు వినియోగ విజృంభణకు మూలకారకాలవుతాయి. 2030కల్లా 40 శాతం భారతీయులు పట్టణాల్లో నివసించబోతున్నారు. తొమ్మిది మహానగరాలు, 31 పెద్ద పట్టణాల్లోని జనం వస్తుసేవలను పెద్దయెత్తున వినియోగిస్తారు. ఇంకా 50 వేల నుంచి లక్ష జనాభా నివసించే 5,000 మధ్యస్థ పట్టణాలు, అయిదు వేల నుంచి పది వేల జనాభా నివసించే చిన్న పట్టణాల్లోనూ అధికాదాయ వర్గాలున్నాయి. 2030కల్లా పట్టణాలు, నగరాల్లో వినియోగం మూడున్నర రెట్లు పెరిగితే, గ్రామాల్లో నాలుగున్నర రెట్లు హెచ్చుతుంది. 2030లో అత్యధిక పాశ్చాత్య దేశాలకు వయసు మీరిపోతే, భారత్‌లో సగటు వయసు 31 సంవత్సరాలుగానే ఉంటుంది. అప్పటికి చైనా పౌరుల సగటు వయసు 42, అమెరికాలో 40 ఏళ్లుగా ఉంటుంది. పనిచేసే యువ జనాభా భారత్‌లో ఎక్కువ కాబట్టి, వారి మూలంగా వస్తు

దేశార్థికానికి సరికొత్త ఆలంబన

సేవల వినియోగమూ విజృంభించనుంది. 2030 కల్లా దేశంలో 110 కోట్ల మంది అంతర్జాలాన్ని వాడతారు. పదిహేనేళ్ల పైబడిన ప్రతి 10మంది భారతీయుల్లో తొమ్మిదిమంది అంతర్జాల వినియోగదారులై ఉంటారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వినియోగదారుల సంఖ్య ప్రస్తుతం 60 శాతం ఉంటే, 2030కల్లా 80 శాతానికి ఎగబాకుతుంది. గ్రామీణ అంతర్జాల వినియోగదారుల సంఖ్య ప్రస్తుత 40 శాతం నుంచి 50 శాతానికి చేరుతుంది. ప్రస్తుతం 80 శాతం పౌరులు చరవాణి ద్వారా అంతర్జాలాన్ని వినియోగిస్తుంటే మున్ముందు 90 శాతం వినియోగించనున్నారు. అదే అమెరికా, బ్రిటన్, చైనాల్లో నేటికీ సగంమంది డెస్క్‌టాప్ కంప్యూటర్లతో అంతర్జాలాన్ని ఉపయోగిస్తున్నారు. వయసు, విద్య, వృత్తి, అంతర్జాల సౌకర్యం కలిసి భారత్‌లో రేపటి వినియోగ ధోరణులను శాసించనున్నాయి!

పెరుగుతున్న ఆదాయాలు, ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాల సంఖ్యాబలం వినియోగ విజృంభణకు దోహదం చేస్తాయి. ఈ రెండు వర్గాలు కలిసి 2030కల్లా నాలుగు లక్షల కోట్ల డాలర్ల వస్తుసేవలను వినియోగిస్తాయి. వీటిలో రెండు లక్షల కోట్ల డాలర్లను మధ్యస్థ ధరకు దొరికే వస్తువుల మీద,

గ్రామాల్లోనూ వినిమయ సంస్కృతి



గ్రామాలు, చిన్న పట్టణాల్లో నివసిస్తున్న ప్రజలూ నగర వాసుల మాదిరిగా జీవించాలనుకొంటున్నారు. వారికి లభించే వస్తుసేవలు, సౌకర్యాలు తమకూ లభించాలనుకొంటున్నారు. కానీ, 250మందికన్నా ఎక్కువమంది నివసించే 30 శాతం గ్రామాలకు ఇప్పటికీ పక్కా రోడ్లు లేవు. మొత్తం ఎనిమిది శాతం గ్రామాలకు మాత్రమే నికరంగా విద్యుత్ సరఫరా అవుతోంది. 65 శాతం పట్టణ ప్రజలకు అంతర్జాల సౌకర్యం ఉంటే 18 శాతం గ్రామీణులకే ఆ వసతి అందుతోంది. దేశంలోని ఆరున్నర లక్షల గ్రామాల్లో 10 శాతానికి మాత్రమే వాణిజ్య బ్యాంకుల శాఖలు ఉన్నాయి. బ్యాంకు ఖాతాల్లో డబ్బు పొదుపు చేసుకునే గ్రామీణులు 40 శాతానికి లోపే. ప్రభుత్వం, వ్యాపార సంస్థలు కలిసి ఈ లోపాలను తొలగిస్తే గ్రామీణ భారతంలో వస్తుసేవల విపణి ఊపందుకుని ఉపాధి, వ్యాపార అవకాశాలు విస్తరిస్తాయి.

సామగ్రికి, ఈ-కామర్స్ సైట్లకు, సరసమైన ధరలకు లభించే బ్రాండ్లు, డిజిటల్ వినోదానికీ గిరాకీ ఇబ్బడిముబ్బడి కానుంది. వినియోగం పెరగడంతో వ్యాపారాలు విస్తరిస్తాయి. వస్తుసేవలను పంచుకోవడం, కిరాయికి తీసుకోవడం ఎక్కువ అవుతుంది. వీటిని షేరింగ్, రెంటల్ సేవలంటారు. సేవల సంచయం(సర్వీస్ ఎగ్రిగేటర్), చందా నమూనాలు, ఆరోగ్య రక్షణకు డిజిటల్ సేవలు- భవిష్యత్తులో కొత్త వ్యాపార నమూనాలుగా విస్తరిస్తాయి.

కీలక సవాళ్లు

విధానకర్తలు, వ్యాపార సంస్థలు సమాజంలో అన్ని వర్గాలకు ఫలాలు అందించే సమ్మిళిత అభివృద్ధి నమూనాను అనుసరించి భారత్‌ను ప్రగతి పథంలో పరుగులు తీయించాలి. ఉపాధి కల్పన, గ్రామీణాభ్యుదయాలకు సంబంధించిన అనిశ్చితత్వాలను తొలగించడానికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలిసికట్టుగా సమ్మిళిత అభివృద్ధికి కృషి చేయాలి. చైనాలో 40 శాతం నిపుణ కార్మికులైతే భారత్‌లో వారి సంఖ్య 2.3 శాతంలోపే. భవిష్యత్తులో సాంకేతికత ఆధారంగా పనిచేసే సేవాసంస్థలదే రాజ్యం కాబట్టి నిపుణ కార్మికుల అవసరం పెరిగిపోనుంది. స్కిల్ ఇండియా పథకం కింద నైపుణ్యాల వృద్ధికి ప్రభుత్వం పాటుపడుతున్నా, ప్రైవేటు రంగమూ ఈ యజ్ఞంలో పాలుపంచుకోవాలి. ఇప్పటికే లెనొవా, మోటరోలా, ఐబీఎం వంటి సంస్థలు గ్రామీణులకు మరమ్మతు, నిర్వహణలో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాయి. ఇతర పరిశ్రమలూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలి. 2030 కల్లా ఉద్యోగార్థుల సంఖ్య మూడు నుంచి మూడున్నర కోట్లకు చేరనుండగా, ప్రస్తుతం ఏటా వస్తున్న కొత్త ఉద్యోగాలు 60-70 లక్షలకు మించవు. అధునాతన సాంకేతికతలతో పనిచేసే సేవాసంస్థలు లక్షల్లో ఉద్యోగాలు సృష్టిస్తే కానీ, నిరుద్యోగాన్ని అరికట్టలేం. కాబట్టి 2022కల్లా 40 కోట్ల నిపుణుల తయారీకి ఉద్దేశించిన నైపుణ్య భారత్‌ను వేగంగా అమలు చేసి ఉద్యోగార్థులను సిద్ధంచేయాలి. మన విద్యావ్యవస్థ పాఠ్య పుస్తకాల మీదనే దృష్టి పెట్టడానికి బదులు పని చేస్తూ నేర్చుకునే విధానాన్ని చేపట్టాలి.

దేశ జనాభాలో సగానికిపైగా పల్లెల్లో నివసిస్తుండగా, మనకున్న వైద్యుల్లో 80 శాతం పట్టణాలకు అంటిపెట్టుకుని ఉన్నారు. భారత్‌లో ప్రతి పదివేల మంది ప్రజలకు ఏడుగురు వైద్యులున్నారు, ఆస్పత్రి పడకలు ఏడు మాత్రమే ఉన్నాయి. ప్రతి ముగ్గురు భారతీయుల్లో ఒక్కరికి మాత్రమే ఏదో ఒక ఆరోగ్య బీమా పాలసీ ఉంది. ఏదైనా అనారోగ్యం వస్తే చికిత్స వ్యయంలో సొంత జేబు నుంచి పెట్టే ఖర్చు భారత్‌లో ఎక్కువ. అమెరికాలో ఈ తరహా ఖర్చు 12 శాతం, చైనాలో 35 శాతం ఉంటే భారత్‌లో రోగులు 60 శాతం దాకా ఖర్చును తామే భరించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మారాలి! అందుకు వ్యక్తులు, వ్యవస్థలు, ప్రభుత్వం, ప్రైవేటు రంగం చేయీచేయీ కలిపి కృషిచేయాలి. ఈ లక్ష్యాల వైపు చిత్తశుద్ధితో పాటుపడితే రెండు తెలుగు రాష్ట్రాలూ సర్వతోముఖ ప్రగతి వైపు వడివడిగా అడుగులు వేయగలుగుతాయి!

(రచయిత- ఎగుమతి దిగుమతి రంగ నిపుణులు)

కుదరని సయోధ్య

కొత్త సంవత్సరంలో చైనా, తైవాన్‌ల ఏకీకరణ సమస్య మళ్ళీ ప్రముఖంగా వెలుగులోకి వచ్చింది. 1949లో చైనా, తైవాన్‌లు వేర్వేరు దేశాలుగా ఏర్పడినప్పటి నుంచి చైనా ఏకీకరణ రాగాన్ని ఆలపిస్తూనే ఉంది. తెర వెనక, తెర వెలుపల ఒత్తిళ్లు తెస్తూనే ఉంది. తైవాన్ వెనక అమెరికా గట్టిగా నిలబడబట్టి కాని, లేదంటే చైనా ఎప్పుడో బలప్రయోగానికి దిగి ఉండేదని విశ్లేషకులు అంటారు. షీ జిన్‌పింగ్ చైనా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి బాణీ మార్చారు. 2015 నవంబరు ఏడున జిన్‌పింగ్ తైవాన్ అధ్యక్షుడు మా యింగ్ జియోతో సింగపూర్‌లో శిఖరాగ్ర సభ జరిపారు. తైవాన్ అధినేతతో ఇలా సమావేశమైన మొట్టమొదటి చైనా అధినాయకుడు జిన్‌పింగే. సంఘర్షణ వాతావరణానికి స్వస్తి చెప్పి సంభాషణలతో సమస్య పరిష్కరించుకుందామని ఆ సభలో జిన్‌పింగ్ ప్రతిపాదించారు. ఉభయ చైనాల ఏకీకరణకు కట్టుబడి ఉన్నానని, తమను ఏ శక్తీ విడదీయలేదని ఉద్ఘాటించారు. కొత్త సంవత్సరం జనవరి రెండున బీజింగ్ గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సైనిక, పౌర ఉన్నతాధికారులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలోనూ ఏకీకరణ గురించి ఘోషించారు. 1979లో జనవరి రెండునాడే చైనా సాధికారంగా ఏకీకరణ ఆకాంక్షను వ్యక్తీకరించింది. అదే రోజు అమెరికాతో లాంఛనంగా దౌత్య సంబంధాలు నెలకొల్పుకుంది. అప్పటికీ ఇప్పటికీ 40 ఏళ్లు గడిచాయి. ఈ సందర్భంగా చైనా ఏకీకరణ గురించి పునరుద్ఘాటించడం కాకతాళీయం కాదు. ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రకటన అది. అందులో చైనా కమ్యూనిస్టు పార్టీ విధానం సహజంగానే ప్రతిబింబించింది. కానీ ఏకీకరణకు తైవాన్‌లో ఎదురవుతున్న వ్యతిరేకతను జిన్‌పింగ్ ప్రకటన తగ్గించగలదా అంటే అనుమానమే.

చైనా, తైవాన్ ఏకీకరణ గురించి తరాలుగా చర్చోపచర్చలు జరుగుతున్నాయి. దీన్ని ఇలానే కొనసాగనివ్వకుండా లక్ష్యసాధన కోసం గట్టిగా కృషి చేయాలని జిన్‌పింగ్ ఉద్ఘాటించినా, ఏకీకరణను ఎప్పటిలోగా సాధించాలనేదాని మీద స్పష్టత ఇవ్వలేదు. ఆయనకు ముందు చైనాకు నాయకత్వం వహించినవారూ ఏకీకరణ గడువును ఎన్నడూ పేర్కొనలేదు. ఈ సందిగ్ధత చైనా కమ్యూనిస్టు పార్టీలోని అతివాదులకు నచ్చడం లేదు. వారిలో కొందరు బలప్రయోగంతోనైనా తైవాన్‌ను కలిపేసుకోవాలంటున్నారు. జిన్‌పింగ్ మాత్రం శాంతియుత ఏకీకరణకే కట్టుబడి ఉంటానన్నారు. కానీ, తైవాన్ అధ్యక్షురాలు త్సాయ్ ఇంగ్ వెన్ చైనాలో విలీనం కావడానికి ససేమిరా అంటున్నారు. తన వైఖరికి అంతర్జాతీయ మద్దతు కూడగడుతున్నారు. ఈ ఏడాది జనవరి రెండున జిన్‌పింగ్ ఏకీకరణకు పిలుపు ఇవ్వబోతున్నారని తైవాన్ దౌత్య బలగం ఎంతో ముందుగానే లోకానికి చాటింపు వేసింది. అంతటితో ఆగకుండా జనవరి ఒకటినే అధ్యక్షురాలు ఇంగ్ వెన్ తైవాన్ ప్రజలకు తన విధానాన్ని వెల్లడించారు. ఆమె మొదటి నుంచీ చైనాతో ఏకీకరణను వ్యతిరేకిస్తున్నారు. ఆమె వైఖరి నచ్చక తైవాన్‌తో చైనా మాటామంతీకి స్వస్తి చెప్పింది. రెండు దేశాల మధ్య సంభాషణల పునరుద్ధరణకు కృషి చేస్తానని జనవరి ఒకటినాటి ప్రసంగంలో ఇంగ్ వెన్ హామీ ఇచ్చి, అందుకు కొత్త సూత్రం ప్రతిపాదించారు. నాలుగు షరతులూ విధించారు.



చైనా - తైవాన్ ఏకీకరణ

చైనాతో సయోధ్యకు ప్రయత్నిస్తూనే తైవాన్ ప్రజల జీవన ప్రమాణాలను, జీవన శైలిని కాపాడుకోవడం, రక్షణ సామర్థ్యాన్ని ఇనుమడింపజేయడం ఇంగ్ వెన్ వ్యూహంలోని ముఖ్యాంశాలు. ఇంగ్ వెన్ పార్టీ అయిన డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డీపీపీ) 2018 పార్లమెంటు ఎన్నికల్లో గెలవడం బీజింగ్‌కు పెద్ద దెబ్బ. తైవాన్ పూర్తిస్థాయి ప్రజాస్వామ్య దేశంగా మారిన తరవాత డీపీపీ పార్లమెంటులో సంపూర్ణ ఆధిక్యం సంపాదించడం ఇదే మొదటిసారి. ఈ పరిణామం చైనా కమ్యూనిస్టు పార్టీలోని అతివాదులకు ఏమాత్రం మింగుడు పడలేదు. తైవాన్‌ను పూర్తి స్వతంత్ర దేశంగా మార్చడం, చైనాతో ఏ విధమైన సంబంధాలు లేకుండా చూడటం డీపీపీ లక్ష్యాలని చైనా కమ్యూనిస్టు అగ్ర నాయకత్వం భావిస్తోంది. ఏకీకరణకు విముఖం కాని తైవాన్ ప్రతిపక్షం కొమింటాంగ్ పార్టీ (కేఎంటీ)ని చైనా అభిమానిస్తోంది. తైవాన్ ప్రజాస్వామ్య సమాజాన్ని అడ్డుపెట్టుకుని చైనా అక్కడి రాజకీయాల్లో, సామాజిక అభివృద్ధిలో తరచూ జోక్యం చేసుకొంటోంది. డబ్బు, పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాలను ఉపయోగించి ఏకీకరణకు అనువైన భావజాలాన్ని ప్రచారం చేస్తోంది. తైవాన్ రాజకీయ వ్యవస్థలోకి చొచ్చుకుపోయింది.

నిరుడు నవంబరు 24న జరిగిన తైవాన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో చైనాకు అభిమానపాత్రమైన కేఎంటీ 13 జిల్లాలను గెలుచుకోగా, డీపీపీ ఆరు జిల్లాలతో సరిపెట్టుకుంది. రాజధాని తైపే నగర మేయరుగా ఒక స్వతంత్ర అభ్యర్థి ఎన్నికయ్యారు. అదే 2014 స్థానిక ఎన్నికల్లోనైతే డీపీపీ 13 జిల్లాలను చేజిక్కించుకోగా కేఎంటీ ఆరు జిల్లాల్లో నెగ్గింది. తైపే నగరం స్వతంత్ర అభ్యర్థిని ఎన్నుకుంది. నాలుగేళ్లలో పరిస్థితి ఇలా తారుమారు కావడం పాలక డీపీపీకి ఏ మాత్రం మంచిది కాదు. 2016 పార్లమెంటు ఎన్నికల్లో డీపీపీ నేత ఇంగ్ వెన్‌కు 70 లక్షలమంది ఓటు వేయగా, 2018 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమె పార్టీకి పడిన ఓట్లు 50 లక్షలకు తగ్గిపోయాయి. దీన్నిబట్టి ఇంగ్ వెన్ పట్ల ప్రజాదరణ తగ్గిపోతోందని రుజువైంది. ఈ లెక్కన 2020 జనవరిలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ఆమె భవితవ్యం అనిశ్చితంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను పురస్కరించుకుని జాతీయవాద కేఎంటీ తైవాన్, చైనా స్థానిక సంస్థల మధ్య ఇచ్చిపుచ్చుకోవడాలు పెరగాలని పిలుపిచ్చింది. ఒకే చైనా విధానానికి పట్టం కట్టిన 1992 ఏకాభిప్రాయ ప్రకటన ఆధారంగా సంబంధాలు బలపడాలంటోంది. కానీ, ఈ ప్రకటనను పాలక డీపీపీ తోసిపుచ్చింది. స్థానిక ఎన్నికల ఫలితాలు తమ ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత పెరిగిందనడానికి నిదర్శనమనే వాదనను పాలక పార్టీ తోసిపుచ్చింది. చైనా మాత్రం స్థానిక ఫలితాలు ఏకీకరణ పట్ల తైవాన్ యువతరంలో పెరుగుతున్న మద్దతును సూచిస్తున్నాయని భావిస్తోంది. కానీ, ఈ భావన నిజమో కాదో 2020 పార్లమెంటు ఎన్నికల్లో కానీ తేలదు. అప్పటివరకు ఏకీకరణ పట్ల తొందరపడకపోవడమే ఉభయులకూ మంచిది!

- వీరేశ్ కందూరి

(రచయిత- అంతర్జాతీయ వ్యవహారాల రంగంలో పరిశోధకులు)

ఈనాడు లేఖలు

పేదలకు దక్కని ఫలం

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మోదీ ప్రభుత్వం అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనకబడిన తరగతులకు కల్పించిన పది శాతం రిజర్వేషన్ల వల్ల పేదలకు ఒరిగేదేమీ ఉండదు. సంవత్సరాదాయం ఎనిమిది లక్షల లోపు ఉన్నవారందరికీ రిజర్వేషన్లు వర్తింపజేయడం వల్ల అగ్రవర్ణాల్లోని 90 శాతం ప్రజలు అర్హులవుతారు. దాంతో నిరుపేద కుటుంబాలకు ఆశించిన ప్రయోజనం అందదు. పైపెచ్చు ఇప్పటికే ఉన్న మెరిట్ కోటా 50 శాతం నుంచి పది శాతం తగ్గించడం వల్ల అగ్రవర్ణాల పేదలకు అవకాశాలు తగ్గుతాయి. కోట్లకు పడగలెత్తిన వారు కూడా తరతరాలు ఓబీసీ కోటాతో ప్రయోజనం పొందుతున్నప్పుడు అగ్రవర్ణాల పేదలను ఆ విభాగంలో చేర్చడానికి మోదీ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అప్పుడే అగ్రవర్ణాల పేదల సంక్షేమం పట్ల మోదీ సర్కారు చిత్తశుద్ధి బయటపడుతుంది.

- జి.శివశంకర్, అనపర్తి, తూర్పుగోదావరిజిల్లా

స్థానికంగానే పరిష్కారాలు

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలు దీనావస్థలో ఉంటున్నాయన్నది చేదు నిజం. ఏళ్ల తరబడి ఫిర్యాదులు వస్తున్నా పరిస్థితులు బాగుపడటం లేదు. క్షేత్రస్థాయిలో స్థితిగతుల గురించి సమగ్ర అధ్యయనం చేయడం ద్వారా అసలు వాస్తవాలను తెలుసుకోవాలి. పిల్లలు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, వసతి గృహ సిబ్బంది, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే హాస్టళ్లు మెరుగైన స్థాయికి చేరుకోగలవు. పాఠశాలల్లో మాదిరిగా సంక్షేమ హాస్టళ్లకూ పూర్వ విద్యార్థుల చేయూత అందివస్తే అక్కడ అనేక సౌకర్యాలు నెలకొల్పడానికి వీలవుతుంది. అదే సమయంలో సిబ్బంది అవినీతికి పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అవినీతికి మూలాలు తెలుసుకుని వాటిని పరిహరించాలి. సిబ్బందిపై ఒత్తిళ్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. హాస్టళ్లవారీగా సమస్యలు తెలుసుకుని స్థానికంగానే పరిష్కారాల మార్గాలు అక్కడి పౌరసమాజం అన్వేషించగలిగితే వసతి గృహాల సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

- ఎస్.సాయిరాజ్, హైదరాబాద్

స్వప్రయత్నం

'సరైన ప్రయత్నం ద్వారా సాధ్యంకాని వస్తువు ఈ ప్రపంచంలో ఏదీ లేదు. ఎవరైనా ఆశించిన వస్తువును అందుకునేందుకు ప్రయత్నిస్తే వారు తప్పక దాన్ని సాధిస్తారు. చేపట్టిన పనిని మాత్రం దృఢచిత్తంతో కొనసాగించాలి' అని బోధించింది సుప్రసిద్ధ తాత్వికగ్రంథం యోగవాసిష్ఠం.

స్వప్రయత్నం ద్వారా జీవనాధారం సాధించి మానవ జన్మను సార్థకం చేసుకొమ్మని మన సంస్కృతి హితవు పలుకుతోంది. శ్రమపడకుండా ఫలం లభించాలని కోరుకోవద్దని వేదం చెబుతోంది. ప్రతి వ్యక్తీ ఇతరుల తోడ్పాటు కోసం ఎదురుచూడక ప్రయత్నశీలుడు కావాలి.

కార్యసాధనకు కావలసినవి ముఖ్యంగా రెండు. ఒకటి స్వప్రయత్నం. రెండోది దైవానుగ్రహం. పురుష ప్రయత్నానికి దైవానుగ్రహం ఎప్పుడూ లభిస్తుంది. దైవకృప, పురుష ప్రయత్నం రెండూ అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. మనం చేపట్టిన పని చిన్నదైనా పెద్దదైనా కావచ్చు. దాన్ని మనసుపెట్టి చేయడానికి ప్రయత్నించాలి. ఎంత గొప్పవాళ్లకైనా ప్రయత్నం వల్లే కార్యసిద్ధి లభిస్తుంది.

దేవేంద్రుడైనా ప్రయత్నంచేస్తే తప్ప అమృతాన్ని సాధించలేకపోయాడు. ఇంద్ర పదవిని చేపట్టడానికి అసుర సంహారం చేయడం అంత సులభమైన పని కాదు. ప్రయత్నం చేస్తేనే తప్ప ఇంద్రుడు ఆ దశకు చేరుకోలేకపోయాడు. అంటే నిరంతర ప్రయత్నంవల్లే ఎవరైనా విజయాన్ని సాధిస్తారు.

చీమ చిన్నదైనప్పటికీ మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వెయ్యి యోజనాల దూరం సైతం చేరుకోగలుగుతుంది. కదలకుండా, ప్రయత్నం చేయకుండా ఒక్కచోటే కూర్చుని ఉంటే గరుత్మంతుడు అంతటివాడూ ముందుకు వెళ్లలేడు. అందుకే ఆరొంతులు మన ప్రయత్నం ఏడోవంతు దైవకృప అన్నారు పెద్దలు. సాధన చేయకుండా, నిరంతర పరిశ్రమ లేకుండా ఉన్నత పథం చేరుకున్నవారెవరూ లేరు.

మన ప్రగతికి మనమే శిల్పులు కావాలనుకుంటే సింహావలోకనం చేయాలి. అరణ్యంలో సంచరించే సింహం ఒక్కోమారు తన ముఖాన్ని వెనక్కి తిప్పి తాను నడిచివచ్చిన దారిని చూస్తుంది. దీన్నే సింహావలోకనం అంటారు. ఆ విధంగానే మనమూ మన మనసును శోధించాలి. ఆత్మ విమర్శ చేసుకోవాలి. లక్ష్యం చేరడానికి శ్రద్ధాభక్తులతో పనిచేయాలి. కార్యసిద్ధి కోసం నిరంతర సాధనచేస్తూ ప్రతి అవకాశాన్నీ జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి.



అంతర్యామి

ఏ మనిషైనా ప్రయత్నం సిద్ధిస్తే అది తన విజయంగా భావిస్తాడు. విఫలమైతే దాన్ని ఇతరుల పైకి నెడతాడు. జయాపజయాలు రెండింటినీ సమభావంతో స్వీకరిస్తేనే మనిషి ఎలాంటి కార్యాన్నయినా సాధించగలడు.

శివుడి ఆజ్ఞలేనిదే పూచిక పుల్లయినా కదలదని కొందరంటారు. మనిషి పరిస్థితులకు దాసుడని కొందరి అభిప్రాయం. తలరాత, గ్రహగతులు, కర్మఫలం... ఇవన్నీ మనిషి ఓటమిపాలైనప్పుడు చెప్పే మాటలు.

ఇలాంటి మూఢనమ్మకాలను జీర్ణించుకుని, సోమరిగా జీవితం గడిపే వ్యక్తులు ఏ కార్యాలనూ సాధించలేరు. అటువంటి మనస్తత్వం, వ్యక్తులను పిరికివాళ్లుగా మారుస్తుంది. అందుకే మనిషి స్వప్రయత్నాన్నే నమ్ముకోవాలి.

ధైర్యశాలురు, సాహసవీరులు, జ్ఞానులు అదృష్టం కోసం వేచి ఉండరు. స్వప్రయత్నంతో, సాహసంతో ముందంజ వేస్తారు. ప్రతిబంధకాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో తమ లక్ష్యాలను సాధించుకుంటారు. ప్రతి మనిషీ విభిన్నంగా ఆలోచించాలి. కొత్తదారుల్లో ప్రయాణించే ధైర్యం కలిగి ఉండాలి. సమయాన్ని సద్వినియోగం చేసుకుని మన స్ఫూర్తిగా పనిచేయాలి. ఇవన్నీ లక్ష్యానికి చేరువగా తీసుకువెళ్ళే గొప్ప గుణాలు!

- విశ్వనాథ రమ



గుమ్మడి.. భలేగుందండి

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: వంటకాల్లో వినియోగించే గుమ్మడికాయలు సాధారణంగా గుండ్రంగా ఉంటాయి. కానీ, సొరకాయల్లా ఇలా పొడవుగా పెరగడం మాత్రం విశేషమే..! కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామానికి చెందిన రైతు, భాజపా మండల అధ్యక్షుడు వడ్లమూడి రవీంద్రబాబు నివాసంలో గుమ్మడిపాదుకు కాసిన కాయలన్నీ ప్రస్తుతం ఇలా పొడవుగా పెరుగుతున్నాయి. ఒక్కో గుమ్మడికాయ సుమారు మూడడుగులు పైనే ఉండి చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పక్వానికి ముందు లేతాకుపచ్చ వర్ణంలో కనువిందు చేస్తూ.. పక్వానికి వచ్చిన అనంతరం లేతగోధుమ రంగులోకి ఇవి మారుతున్నాయి. సాధారణ గుమ్మడిగింజలను కొనుగోలు చేసి తమ నివాసంలోని పెరటిలో విత్తామని, ప్రత్యేకంగా ఎరువులేం వేయలేదని రవీంద్రబాబు తెలిపారు. దీనిపై వ్యవసాయశాఖ గుడివాడ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి మాట్లాడుతూ.. జన్యుపరమైన మార్పులు, సేంద్రియ పోషణతో కాయలన్నీ ఇలా అసాధారణంగా పెరిగిఉండవచ్చని అభిప్రాయపడ్డారు.

మూడు అడుగులు పెరిగిన గుమ్మడికాయను చూపుతున్న పద్మజ



జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గురువారం తమిళనాడులోని సేలంలో 23 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రంగులతో ఇలా భారీ చిత్రాన్ని గీసి కళాశాల విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికులను ఇది విశేషంగా ఆకట్టుకుంది.
- సేలం, న్యూస్‌టుడే

సిమెంట్ రోడ్లిక చాలు!

- కొత్తగా మంజూరుపై ఆంక్షలు
- గ్రామీణాభివృద్ధిశాఖ ఆదేశాలు

ఈనాడు-అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(నరేగా) పరిధిలో కొత్తగా సిమెంట్ రహదారుల నిర్మాణం తాత్కాలికంగా ఆగిపోనుంది. ఈ పనులకు అంచనాలు(ఎస్టిమేషన్స్) వేసే కార్యక్రమానికి ప్రస్తుతానికి స్వస్తి పలికారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ భాగస్వాములైన అన్ని ఇంజినీరింగ్‌శాఖలకు తాజాగా సూచనలు చేసింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు రహదారుల నిర్మాణ ప్రతిపాదనల జోలికి పోవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది 6,472 కిలోమీటర్ల సిమెంట్ రహదారుల నిర్మాణానికి నరేగా 'మెటీరియల్ కాంపోనెంట్' బడ్జెట్‌లో ప్రతిపాదించారు. గత ఏడాది నాటికే రాష్ట్రంలో సుమారు 17వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లను గ్రామాల్లో నిర్మించారు. ఎన్నికలు సమీపించడంతో అన్నిచోట్లా కంకర, మట్టి రోడ్ల స్థానంలో సిమెంట్ రహదారుల కోసం ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది లక్ష్యానికి మించి 29,473 కిలోమీటర్ల నిర్మాణానికి ఇంజినీర్లు అంచనాలు రూపొందించి ఆమోదించారు. 11 నెలల వ్యవధిలో లక్ష్యానికి మించి 7,601 కిలోమీటర్లకు పైగా సిమెంట్ రహదారుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మంజూరైన పనుల్లో కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి, ఇంకొన్ని ప్రారంభించాలి. 'మెటీరియల్ కాంపోనెంట్'లో ఇప్పటికే పూర్తిచేసిన అన్ని పనులకు కలిపి రూ.1,087.22కోట్లు చెల్లించాలి. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం పూర్తవుతున్నందున అప్పటివరకు కొత్త పనులకు మళ్లీ అంచనాలు రూపొందించవద్దని ఇంజినీర్లకు గ్రామీణాభివృద్ధిశాఖ సూచించింది.

ఒకేసారి రెండు డిగ్రీలు

నన్నయ-లింకన్ వర్సిటీల మధ్య ఎంవోయూ

రాజానగరం, న్యూస్‌టుడే: మలేసియాకు చెందిన లింకన్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవడం ద్వారా.. ఒకే సమయంలో రెండు డిగ్రీలు పూర్తి చేసి పట్టాలు పొందే అవకాశం ఏర్పడిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య ఎస్.రామకృష్ణారావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో లింకన్ వర్సిటీతో నన్నయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.టేకి, లింకన్ విశ్వవిద్యాలయం వీసీ అమియాబౌమిక్‌లు అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆచార్య రామకృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఒకే సమయంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుంచి, లింకన్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీలు పూర్తి చేయవచ్చన్నారు. లింకన్ వర్సిటీ వీసీ అమియాబౌమిక్ మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆలోచనలతో సమాజంలోకి రావాలని కోరారు. అప్పుడే నూతన ఆవిష్కరణలు వెలుగు చూస్తాయన్నారు.

నెల్లూరు, కరీంనగర్ జిల్లాలకు బీబీబీపీ అవార్డులు

ఈనాడు, దిల్లీ: బాలికల విద్య, సంరక్షణ అంశాల్లో మెరుగైన పనితీరు కనపరిచినందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి నెల్లూరు, కరీంనగర్ జిల్లాలకు కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అవార్డులను అందజేసింది. 'బేటీ బచావో.. బేటీ పడావో' (బీబీబీపీ) కార్యక్రమం ఆరంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బాలిక జననాల పెంపు... బాలికల ప్రాధాన్యం పెరిగే వాతావరణ కల్పన అంశాలకు సంబంధించి దేశవ్యాప్తంగా 25 జిల్లాలను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. దిల్లీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, నెల్లూరు ఐసీడీఎస్ పథక సంచాలకురాలు సరోజిని, ఆయా జిల్లాల ఐసీడీఎస్ అధికారులకు ఈ అవార్డులు అందజేశారు.

ఏపీకి పీఎంజీఎస్‌వై నిధులు రూ.97.75 కోట్లు విడుదల

ఈనాడు, దిల్లీ: ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద 2018-19 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు రెండో విడతగా రూ.97.75 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను మూడు పని దినాల్లోగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, రహదారుల విభాగానికి బదిలీ చేయాలని సూచించింది. అలా చేయని పక్షంలో మరో విడత నిధుల విడుదలను నిలిపే అవకాశమున్నట్లు పేర్కొంది.

యోగా శిక్షకుల నియామకం

ఈనాడు, అమరావతి: ప్రతి జిల్లాలోని గిరిజన విద్యార్థుల వసతిగృహంలో యోగా శిక్షకులను నియమించేందుకు వీలుగా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 'నేషనల్ ఆయుష్ మిషన్'లో భాగంగా రూ.7వేలతో పొరుగుసేవల విధానంలో యోగా శిక్షకులను గిరిజన వసతి గృహంలో నియమిస్తారు.

ఆరోగ్యంపై అవగాహన అంతంతే!

- క్యాన్సర్ బారిన పడుతున్న పేద మహిళలు
- రాష్ట్ర వ్యాప్తంగా 971 మందికి తదుపరి పరీక్షలకు సిఫార్సు
- లక్ష మందికిపైగా మహిళలకు మెప్మా ఆధ్వర్యంలో అవగాహన

శ్రీకాకుళం జిల్లాకు చెందిన మహాలక్ష్మి స్వయం సహాయక సంఘ నాయకురాలిగా రాష్ట్రస్థాయి గుర్తింపు పొందారు. సభ్యులతో క్రమం తప్పక పొదుపు చేయించడం, రుణాలిప్పించి తిరిగి చెల్లించేలా చూడటం, సంఘాల ఆర్థిక బలోపేతానికి పలు స్వయం ఉపాధి కార్యక్రమాల ఏర్పాటులో ఆమె క్రియాశీలకంగా నిలిచారు. కానీ వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన లేక రెండేళ్ల క్రితం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో మహాలక్ష్మి మృతి చెందారు.

కర్నూలుకు చెందిన దమయంతి సంఘంలో చాలా చురుగ్గా వ్యవహరించే సభ్యుల్లో ఒకరు. దమయంతి చొరవను గుర్తించిన అధికారులు ఇతర ప్రాంతాలకు కూడా పంపి ఆమెతో అక్కడి ప్రజలకు అవగాహన కల్పించేవారు. ఎందరికో పొదుపు పాఠాలు నేర్పిన ఆమె రొమ్ము క్యాన్సర్‌తో అనారోగ్యానికి గురయ్యారు.

ఈనాడు - అమరావతి

పేద మహిళలను పొదుపు బాట పట్టించడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కొరవడింది. దీంతో చాలా మంది మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల బారిన పడుతున్నారు. సకాలంలో చికిత్స చేయించుకోక కొందరు మంచాన పండుతుంటే.. మరికొందరైతే వ్యాధి తీవ్రమై ప్రాణాలు కూడా వదిలిన సంఘటనలు ఉన్నాయి. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 110 పట్టణాల్లో 2 లక్షల స్వయం సహాయక సంఘాల్లో 20 లక్షల మందికిపైగా సభ్యులున్నారు. వీరికి వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు రెండేళ్ల క్రితం ప్రత్యేక కార్యక్రమానికి మెప్మా శ్రీకారం చుట్టింది. ప్రధానంగా గర్భాశయ ముఖ, రొమ్ము క్యాన్సర్లపై అవగాహన కల్పించడం, సమస్యలతో బాధపడుతున్న వారందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించి వైద్యం అందించేందుకు ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. పొదుపు సంఘాల్లో చురుకైన 300 మందిని ఎంపిక చేసి వీరందరికీ వైద్యులతో శిక్షణ ఇప్పించారు. రొమ్ము, గర్భాశయ ముఖ క్యాన్సర్లను గుర్తించడం ఎలా? తీసుకోవలసిన జాగ్రత్తలు? వంటి విషయాలపై అవగాహన కల్పించారు. వీరంతా జిల్లాల్లో సంఘాల సభ్యులతో వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి లక్షణాలు ఉన్న మహిళలను గుర్తించి సమీప ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయిస్తున్నారు. వ్యాధి నిర్ధరణ అయితే ప్రభుత్వం తరపున మెరుగైన వైద్యం అందించే దిశగా కూడా మెప్మా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని పట్టణ ప్రాంత మహిళల్లో వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన తక్కువగా ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ జిల్లాల్లోనే 500 మందికిపైగా మహిళలు క్యాన్సర్ బారిన పడినట్లు ప్రాథమికంగా గుర్తించి తదుపరి పరీక్షలకు పంపారు. ఆరోగ్య సేవకులు, వైద్యులతో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశాక మహిళల్లో మార్పు కనిపిస్తోందని, వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటున్నారని మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ చినతాతయ్య తెలిపారు.

- ★ కార్యక్రమం: పొదుపు సంఘాల సభ్యులకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన
- ★ ఆరోగ్య సేవకులు: 300
- ★ ఇప్పటివరకు అవగాహన పొందిన సభ్యులు: 1,02,688
- ★ స్వీయ పరీక్షలు చేయించుకున్న మహిళలు: 10,070
- ★ తదుపరి పరీక్షలకు సిఫార్సు చేసింది: 971

నగదు రహిత వైద్య సేవలపై ప్రతిష్టంభన

ఈనాడు, అమరావతి: నగదు రహిత వైద్య సేవలపై ప్రతిష్టంభన ఇంకా వీడలేదు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు తరపున సకాలంలో చెల్లింపులు జరగకపోవడంతో నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు కొన్ని కార్పొరేట్, ప్రధాన ప్రయివేటు ఆస్పత్రులు ఆసక్తి కనబరచడంలేదు. రాష్ట్రవ్యాప్తంగా 50 ప్రధాన ఆస్పత్రుల్లో ఈ సేవలు నిలిచిపోయినట్లు ఉద్యోగ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో ఉద్యోగులు, పెన్షనర్లు అవస్థలు పడుతున్నారు.

జనవరి 1నుంచి ఏపీ స్పెషాల్టీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) సభ్యత్వం కలిగిన ఆస్పత్రులకు సంబంధించి వందల కోట్ల రూపాయల బిల్లులు పేరుకుపోవడంతో పలు ఆసుపత్రులు నగదు రహిత వైద్య సేవలు నిలిపివేశాయి. ప్రభుత్వం నుంచి బకాయిల చెల్లింపులు మొదలవడంతో.. కొన్ని ఆస్పత్రులు నగదు రహిత వైద్యసేవలను క్రమేణా ప్రారంభిస్తున్నాయి. కొన్నిచోట్ల ఈ సేవలు ఇంకా ప్రారంభంకాలేదు.

సున్నపురాయి తవ్వకాలపై దర్యాప్తు కొనసాగించండి

- పురోగతి నివేదిక దాఖలు చేయండి
- సీఐడీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లాలోని కేశనపల్లి నడికుడి, కోనంకి, పిడుగురాళ్ల గ్రామాల్లో సున్నపురాయి అక్రమ తవ్వకాలపై దర్యాప్తును కొనసాగించాలని సీఐడీకి హైకోర్టు స్పష్టం చేసింది. పురోగతిపై సీల్డ్‌కవర్‌లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఆదేశించింది. తెదేపా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఆయన అనుచరులు సున్నపురాయి అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారంటూ మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశారు. గనుల తవ్వకాలపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన సీఐడీ దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తు పురోగతిని తాజాగా హైకోర్టు తెలుసుకుంది.

నా పేరు తొలగించండి: ఎమ్మెల్యే

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తరపున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. గనుల అక్రమ తవ్వకాలకు పాల్పడింది ఎవరనేది దర్యాప్తులో తేలాల్సి ఉందని అన్నారు. రాజకీయ వైరంతో ఎమ్మెల్యే పేరును వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చారని, ఆయన్ను జాబితా నుంచి తొలగించాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) రమేశ్ వాదనలు వినిపిస్తూ.. గనుల అక్రమ తవ్వకాలపై ఇప్పటికే 612 మంది సాక్షులను విచారించామని అన్నారు. రెవెన్యూ, గనులు, రవాణా, విద్యుత్ తదితర శాఖలకు చెందిన అధికారుల పాత్ర ఉందని, దర్యాప్తు పూర్తికి కొంత సమయం పడుతుందని వివరించారు. వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. బాధ్యులను గుర్తించడంలో జాప్యమెందుకని ప్రశ్నించింది. అక్రమంగా గనులను తరలిస్తున్న వాహనాలను చెక్‌పోస్టుల వద్ద గుర్తించడం సులభమని పేర్కొంది.

సువిధ ఛార్జీల మోతకిక చెల్లు!

ఈనాడు-హైదరాబాద్: సువిధ రైళ్లు...ఈ పేరు వింటేనే ప్రయాణికుల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. వాటిల్లో ప్రయాణించాలని ప్రయత్నిస్తే జేబులు గుల్లవుతాయి. సీట్లు అయిపోయే కొద్ది విమాన టికెట్లలా ఛార్జీలు నిమిష నిమిషానికీ అమాంతం పెరిగిపోయే (డైనమిక్) విధానం అమలయ్యే ఈ రైళ్లపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయెల్ సూత్రప్రాయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. సువిధ విధానానికి స్వస్తిపలికి వాటి స్థానంలో సాధారణ ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే ఉన్నతాధికారులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇటీవల సంక్రాంతి పండగ సమయంలో రద్దీ పేరుతో దక్షిణమధ్య రైల్వే తెలుగురాష్ట్రాల మధ్య సువిధ ప్రత్యేక రైళ్లు ప్రకటించి నడిపించింది. సాధారణం కంటే గరిష్ఠంగా 3-4 రెట్ల వరకు అదనపు ఛార్జీలు వసూలుచేయడంతో ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. 'పండగవేళ ఛార్జీల మోత' శీర్షికన డిసెంబరు 30న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించి రైల్వేశాఖ మంత్రి పీయూష్‌గోయెల్‌తో మాట్లాడారు. ఉపరాష్ట్రపతి స్పందించడంతో పాటు ప్రయాణికుల నుంచి సువిధ ఛార్జీల భారంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండటంతో ఇక కొత్తగా సువిధ రైళ్లను ప్రకటించొద్దన్న నిర్ణయానికి రైల్వేశాఖ వచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే ప్రకటించిన సువిధ రైళ్లలో ఆన్‌లైన్ బుకింగ్ మొదలైన దృష్ట్యా ఆ ప్రయాణ తేదీవరకు ఈ రైళ్లు డైనమిక్ ఛార్జీలవిధానంతో కొనసాగుతాయి. అవిపూర్తయ్యాక కొత్త నిర్ణయాన్ని అమల్లోకి తీసుకురావాలని గోయెల్ నిర్ణయించినట్లు తెలిసింది.



అమ్మా జాగ్రత్త..!

అనంతపురం జిల్లా వెంకటాపురం గ్రామంలో గురువారం మాజీ మంత్రి పరిటాల రవి 14వ వర్ధంతి నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వేదికపైకి జనం పోటెత్తడంతో వృద్ధురాలు కిందకు పడబోగా.. మంత్రి సునీత, శ్రీరామ్‌లు అప్రమత్తమై ఆమెను ఇలా చేతులతో పట్టుకున్నారు.
- ఈనాడు, అనంతపురం

పరిటాల రవీంద్రకు ఘన నివాళి

రామగిరి, న్యూస్‌టుడే: తన భర్త, తెదేపా దివంగత నేత పరిటాల రవీంద్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. పరిటాల రవీంద్ర 14వ వర్ధంతి సందర్భంగా గురువారం అనంతపురం జిల్లా రామగిరి మండలం వెంకటాపురంలోని ఆయన ఘాట్ వద్ద మంత్రి పరిటాల సునీత, ఆమె తనయుడు శ్రీరామ్.. కుటుంబ సభ్యులతో కలసి నివాళులర్పించారు. అనంతరం రవీంద్ర జీవిత చరిత్ర ఆధారంగా అభిమానులు రూపొందించిన పాటల సీడీని చీఫ్ విప్ పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన భర్త పేదల కోసం ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టారన్నారు. వాటిని పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నేటికీ కొనసాగిస్తున్నామన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్‌ను ప్రజలు ఎలా గుర్తుపెట్టుకున్నారో, అదేవిధంగా పరిటాల రవిని కూడా గుర్తుంచుకున్నారని చెప్పారు. పేరూరు ప్రాజెక్టుకు నీటిని తేవడం రవి కల అనీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఆ కల త్వరలో నెరవేరుతోందన్నారు. తన కుమారుడు శ్రీరామ్ రాజకీయాల్లోకి రావాలని యువత కోరుతున్నారని ఆమె చెప్పారు. అయితే, శ్రీరామ్ రాజకీయాల్లోకి ఎప్పుడు రావాలనేది తమ పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయిస్తారని తెలిపారు.

తుది జాబితాలోనూ తప్పిదాలే

- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- క్షేత్రస్థాయి పరిశీలన చేయించనున్న ఎన్నికల సంఘం

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో ఇటీవల ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలోనూ తప్పులున్నాయంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా 18 ఏళ్లు నిండని వారికి ఓటు హక్కు కల్పించారని, ఒకే వ్యక్తి పేరు రెండు, మూడు సార్లు జాబితాలో ఉందని, చనిపోయిన వారినీ ఓటర్లుగా చేర్చారని ఫిర్యాదులు వస్తున్నాయి. వీటన్నింటిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. అందులో తేలిన అంశాల ఆధారంగా జాబితాను సవరించడమెలా? అనే దానిపై ప్రస్తుతం సమాలోచనలు చేస్తోంది. ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తిచేసి తుది ఓటర్ల జాబితా ప్రచురించిన తర్వాత, దానిలో మార్పులు, చేర్పులు చేయాలంటే కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి. గతేడాది చివర్లో ప్రత్యేక సమగ్ర సవరణ-2019 చేపట్టిన ఎన్నికల సంఘం అభ్యంతరాలు, ఫిర్యాదులు, దరఖాస్తులను స్వీకరించి.. వాటన్నింటినీ సరిచేసి ఈ నెల 11న తుది ఓటర్ల జాబితాను ప్రచురించింది. రాష్ట్ర వ్యాప్తంగా 3,69,33,091 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొంది. ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం 17,37,831మంది ఓటర్లు పెరిగినట్లు వెల్లడించింది. అయితే అందులోనూ తప్పులున్నాయని ఫిర్యాదులు రావడంతో ఇలాంటి ఓటర్ల జాబితాతో ఎన్నికలకు వెళ్లడం సరికాదని ఈసీ భావిస్తోంది. క్షేత్ర పరిశీలన అనంతరం అందులో తేలిన అంశాల ఆధారంగా సవరణ చేపట్టే అంశంపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరాలని నిర్ణయించింది.

15 రోజుల్లో బదిలీలు పూర్తిచేయాలి

ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారుల బదిలీలన్నీ మరో 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ పూర్తయితే... ఎన్నికల నిర్వహణ ప్రక్రియను మరింత వేగవంతం చేయవచ్చని ఎన్నికల సంఘం భావిస్తోంది. మరోవైపు ఇప్పటికే జిల్లాల్లోని ఈవీఎంల తనిఖీలు చేపడుతోంది. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లకు ఫిబ్రవరి 5 నుంచి బూత్ స్థాయిలో ఓటరు గుర్తింపు కార్డులను అందజేయనుంది.

ఓటరు చైతన్యం

ఓటరు చైతన్యంపై పెద్ద ఎత్తున అవగాహన, చైతన్యం తీసుకొచ్చేలా విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఓటు హక్కు వినియోగించేలా ప్రోత్సహించటం, చైతన్యం తేవటంతో పాటు ప్రలోభాలకు గురికాకుండా ఉండాలని చెప్పేలా ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టనుంది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో చేపట్టే కార్యక్రమానికి గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.


రెండు చోట్ల ఓటు హక్కు ఉండటం నేరమే

ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉండటం నేరమేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతు కాకుండా, తప్పిదాలు దొర్లకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో చోటు చేసుకున్న పొరపాట్లు.. ఏపీలో జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఓపీ రావత్, రజత్ కుమార్ నాంపల్లి ఓటర్లా?

- ఓటర్ల జాబితాలో అక్రమాలకు ఇదే నిదర్శనం: కాంగ్రెస్

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓ.పి.రావత్, తెలంగాణ సీఈవో రజత్‌కుమార్‌ల పేర్లు నాంపల్లి నియోజవర్గంలోని బీసీ, వడ్డెర బస్తీ కమ్యూనిటీ హాల్ పోలింగ్ కేంద్రం ఓటర్ల జాబితాలో ఉండటం, వీరి నివాసం ఒవైసీ పురా అని పేర్కొనడం ఓటర్ల జాబితాలో అక్రమాలకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. గురువారం ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నాంపల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలను విడుదల చేశారు. ఇందులో ఓపీ రావత్, రజత్ కుమార్‌లు కూడా ఓటర్లుగా ఉన్నట్లు తెలిపారు. దిల్లీలో ఉండే మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓటు ఇక్కడ ఎలా నమోదు చేశారని ప్రశ్నించారు.



కాంగ్రెస్ నాయకులు విడుదల చేసిన ఓటర్ల జాబితాలో కేంద్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓ.పి.రావత్, తెలంగాణ సీఈవో రజత్‌కుమార్‌ల ఓట్లు ఒవైసీ పురాలో ఉన్నట్లు ముద్రించిన పత్రాలు



విశాఖకు ఏడు నక్షత్రాల విహార నౌక

అత్యంత విలాసవంతమైన, ఏడు నక్షత్రాల స్థాయి అంతర్జాతీయ విహార నౌక 'సిల్వర్ డిస్కవరెర్' గురువారం విశాఖ నౌకాశ్రయానికి చేరుకుంది. శ్రీలంకలోని ట్రింకోమలి పోర్టు నుంచి వంద మంది విదేశీ పర్యాటకులతో వచ్చిన ఆ నౌకకు విశాఖ నౌకాశ్రయ అధికారులు స్వాగతం పలికారు. నౌకాశ్రయ జెట్టీ వద్ద ఏర్పాటుచేసిన స్టాళ్లలోని ఏటికొప్పాక బొమ్మలు, అరకు కాఫీ, గిరిజన సహకార సంస్థకు చెందిన పలు ఉత్పత్తుల విశిష్టతను విదేశీయులకు వివరించారు. అనంతరం విశాఖలోని వివిధ పర్యాటక ప్రదేశాలను చూపించారు. ఈ సందర్భంగా నౌకాశ్రయ ఛైర్మన్ ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ విశాఖ నగరానికి అంతర్జాతీయ విహార నౌక రావడం ఇదే తొలిసారని తెలిపారు. - ఈనాడు, విశాఖపట్నం

చేనేత విక్రయ కేంద్రం ఏర్పాటుకు పదెకరాలు ఇవ్వండి

ఈనాడు, అమరావతి: రాజధాని ప్రాంతంలో ఎన్టీఆర్ పేరిట జాతీయ స్థాయి చేనేత ప్రదర్శన, విక్రయకేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెదేపా మహిళ అధ్యక్షురాలు పోతుల సునీత కోరారు. రాజధాని ప్రాంతంలో 10 ఎకరాలు కేటాయించాలని సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించారు. చేనేత రంగంపై విధించిన జీఎస్టీ ఎత్తివేసేందుకు కేంద్రం సిద్ధంగా లేనందున రాష్ట్రమే రాయితీగా ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు.

ప్లాస్టిక్‌తో విప్లవాత్మక మార్పు

- నష్ట నివారణకు మరిన్ని పరిశోధనలు జరగాలి
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు డిజిటల్, చెన్నై: పలు రంగాల్లో ప్లాస్టిక్ విప్లవాత్మక మార్పులు తెచ్చిందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. లాభం, నష్టం రెండూ ఉన్న దీనిపై మరిన్ని పరిశోధనలు జరగాలని పేర్కొన్నారు. గురువారం చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) స్వర్ణోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ''అన్నింటిలోకి చొచ్చుకొచ్చిన ప్లాస్టిక్.. మూలాధారమైన వనరులను నాశనం చేసేలా తయారై ఒక గందరగోళాన్ని సృష్టించింది. ఇదే సమయంలో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పు తెచ్చింది. డిస్పోజబుల్ సిరంజ్‌లు, ఇతర ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చాయి. ఏరోనాటికల్, ఎలక్ట్రానిక్స్, రవాణా, నిర్మాణ, ఇతర రంగాల్లోనూ గణనీయమైన మార్పు చూపింది'' అని ఉపరాష్ట్రపతి తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి తిరిగి వినియోగించే ప్రక్రియలో సీఐపీఈటీ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.

2.3 కోట్ల టన్నులకు ప్లాస్టిక్ ఉత్పత్తులు

దేశంలో ప్లాస్టిక్ ప్రాసెసింగ్ పరిశ్రమ పది శాతం వృద్ధి సాధించిందని కేంద్ర మంత్రి డీవీ సదానందగౌడ చెప్పారు. 2020కి దేశంలో ప్లాస్టిక్ ఉత్పత్తులు 2.3 కోట్ల టన్నులకు చేరుకుంటాయని వెల్లడించారు. ఇతర దేశాల్లో ప్లాస్టిక్ కిలో ధర రూ.28 ఉంటే మన దేశంలో రూ.11గా ఉందని, ఈ కారణంగా అపార అవకాశాలు, వృద్ధి ఉంటాయని పేర్కొన్నారు. సదస్సులో తమిళనాడు గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ పాల్గొన్నారు.



ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి

కాంగ్రెస్‌పై వైకాపా నిరాధార ఆరోపణలు

జగన్, సాక్షి దినపత్రిక క్షమాపణ చెప్పాలి: రఘువీరా



విజయవాడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ఆరోపణలు, అసంబద్ధ రాతలు రాసిన జగన్, సాక్షి దినపత్రిక బేషరతు క్షమాపణ చెప్పాలని పీసీసీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని నిర్ణయిస్తే.. అదంతా కాంగ్రెస్‌తో చంద్రబాబు పరోక్ష పొత్తు ఎత్తుగడ అని ఆ పత్రిక రాసింది. రాయలసీమ, దక్షిణ కోస్తాలో వైకాపా ఓట్లు చీల్చటమే లక్ష్యంగా కాంగ్రెస్, తెదేపా మధ్య రహస్య అవగాహన ఉన్నట్లు, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక చంద్రబాబే నిర్ణయిస్తారని, సొమ్ము కూడా ఆయన ఇస్తారంటూ' ఇష్టానుసారంగా వార్తను ప్రచురించిందన్నారు. వైకాపా ఓటమి భయంతో కాంగ్రెస్ పార్టీపై అర్థం లేని ఆరోపణలు చేస్తోందన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వకుండా భాజపా మోసం చేసిందని ద్రోహం చేసిన భాజపాతో జగన్ పార్టీ దోస్తీ చేస్తోందన్నారు.

షర్మిలపై అసభ్య ప్రచారం ఆగింది

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాల వేదికగా వై.ఎస్.షర్మిలపై అసభ్య వ్యాఖ్యలు, అభ్యంతరకర ప్రచారం ఆగిపోయినట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. యూట్యూబ్ ఛానెళ్ల నిర్వాహకులు, ప్రతినిధులను పోలీసులు విచారించడం, ఐదుగురిపై కేసులు నమోదు చేసిన నేపథ్యంలో ఇంకా ఇలాంటి వీడియోలు అప్‌లోడ్ చేస్తే అరెస్ట్ చేస్తారన్న భావనతో వారంతటవారే వీడియోలను తీసేస్తున్నారు. తాము యూట్యూబ్ ప్రతినిధులకు తాఖీదులు పంపిన విషయం తెలుసుకున్న నేరస్థులు అశ్లీల, అసభ్య వీడియోల లింకులు తొలగించారని పోలీస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించిన సమాచారం, వార్తలు మినహా ఇతర వీడియోలు లేవని ధ్రువీకరించారు.

జగన్ ఆరోపణలు విడ్డూరం: యామిని శర్మ

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ప్రభుత్వం, సీఎం చంద్రబాబుపైనా ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ అన్నారు. విజయవాడలో గురువారం ఆమె మాట్లాడారు. వైకాపా ప్రకటించిన నవరత్నాలను అధికార పార్టీ కాపీ కొడుతుందని ఆరోపిస్తున్న జగన్.. సంక్షేమ పథకాలకు ఆద్యుడు చంద్రబాబే అనే విషయాన్ని తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు.

క్రమబద్ధీకరణకు ఆన్‌లైన్ అవస్థలు

ఈనాడు, అమరావతి: పట్టణాల్లో అక్రమ భవనాల క్రమబద్ధీకరణకు జీవో విడుదల చేసి పది రోజులైనా ఇప్పటికీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోడానికి ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. కొత్త భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకోడానికి ఇప్పటికే అమలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ పర్మిషన్ సిస్టం (ఏపీడీపీఎంఎస్) వెబ్‌సైట్‌లోనే దరఖాస్తులు అప్‌లోడ్ చేయొచ్చని పట్టణ స్థానిక సంస్థల్లోని ప్రభుత్వ గుర్తింపు పొందిన లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ నుంచి సమాచారం అందింది. అయితే, సాంకేతిక సమస్యలతో ఇప్పటికీ ఒక దరఖాస్తు కూడా సక్రమంగా అప్‌లోడై అప్లికేషన్ నంబరు బయటకొచ్చిన సందర్భం లేదు. జీవో వెలువడిన 90 రోజుల్లోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని, తరువాత వెబ్‌సైట్ అనుమతించదని పురపాలక శాఖ ప్రకటించింది. అయితే..పది రోజులైనా సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంతో టెక్నికల్ పర్సన్లతోపాటు ప్రజలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత అధికారి వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నామన్నారు.

50 ప్రభుత్వ కళాశాలల ఏర్పాటు

- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి
- ఘనంగా ముగిసిన ఇంటర్ విద్య స్వర్ణోత్సవం

విశాఖపట్నం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొత్తగా 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్ విద్య స్వర్ణోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని విశాఖ ఏయూ సమావేశ మందిరంలో గురువారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విశాఖలో ఆర్జేడీ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. గుంటూరు జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు కమిషనర్ ఉదయలక్ష్మి, చెంగవల్లి వెంకట్, సైయెంట్ వ్యవస్థాపకుడు బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఏయూ వీసీ జి.నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, వందేమాతరం శ్రీనివాస్, అనంత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు, సైయెంట్ వ్యవస్థాపకుడు బీవీఆర్ మోహన్‌రెడ్డి. వేదికపై వందేమాతరం శ్రీనివాస్, చెంగవల్లి వెంకట్, ఉదయలక్ష్మి, ఏయూ వీసీ నాగేశ్వరరావు, అనంతశ్రీరామ్

31న పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడి

ఈనాడు, అమరావతి: భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయల స్థాయి పెంపులో జాప్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం (ఎస్ఎల్‌టీఏ) ఆధ్వర్యంలో గురువారం పలు జిల్లా విద్యాధికారి కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. పోస్టులను ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నెలదాటినా అమలు చేయడం లేదని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య పేర్కొన్నారు. త్వరగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టకపోతే ఈ నెల 31న పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌ను ముట్టడిస్తామన్నారు.

అంకుర సంస్థల కోసం గేమింగ్ గ్యారేజ్

ఈనాడు, అమరావతి: అంకుర సంస్థలను ప్రోత్సాహించేందుకు గేమింగ్ గ్యారేజ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో ఆర్ఎస్ విన్నిపాత్రో ప్రకటనలో తెలిపారు. గేమింగ్ ప్రపంచంలో వివిధ కంపెనీలను ఆకర్షించి, ఏపీని గేమింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఔత్సాహికులు గ్యారేజ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

(మొదటి పేజీ తరువాయి)

యూనిఫామ్ ఉద్యోగాల వయోపరిమితి

రెండేళ్లకు పెంపు

నియామక సంస్థలు నేరుగా చేపట్టే నియామకాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని కూడా పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రూపు-1, గ్రూపు-2 ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పెంచింది. ఈ మేరకు ఓ ప్రకటన జారీచేసింది. గ్రూపు-2 దరఖాస్తులను వచ్చేనెల 10వ తేదీ, గ్రూపు-1 ఉద్యోగాల దరఖాస్తులను వచ్చేనెల 7వ తేదీ వరకు స్వీకరిస్తామని తెలిపింది. ఈ తేదీలకు ఒకరోజు ముందు రుసుము చెల్లించాలని అభ్యర్థులకు కార్యదర్శి సూచించారు.

★ గ్రూపు-1 పోస్టు కోడ్ 3, 4 డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ ఉద్యోగాలకు ప్రస్తుతం గరిష్ఠ వయోపరిమితి 28 సంవత్సరాలు ఉంది. తాజా ఉత్తర్వుల ప్రకారం 30 సంవత్సరాలకు పొడిగించారు.

★ గ్రూపు-1 పోస్టు కోడ్ 5, 6 డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి 26 సంవత్సరాలు ఉండగా దీనిని 28 సంవత్సరాలకు పొడిగించారు.

★ గ్రూపు-2 పోస్టు కోడ్ 7 సబ్ ఇన్‌స్పెక్టర్ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి 26 సంవత్సరాల ఉండగా మరో రెండేళ్లకు పొడిగించారు.

సకాలంలో నిర్ణయాన్ని తీసుకోనందున...!

వయో పరిమితి పెంపు విషయంలో ప్రభుత్వం సకాలంలో నిర్ణయాలు తీసుకోనందున అభ్యర్థులు యూనిఫామ్డ్ ఉద్యోగమైన ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ ప్రకటన పరంగా ప్రయోజనం పొందలేకపోతున్నారు. ఈ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిన తరువాత వయో పరిమితిని అదనంగా రెండేళ్లకు పెంచారు. ఏపీపీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ముగిసిన అనంతరం వయోపరిమితిని పెంచలేమని, ముగిసేలోగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తేనే పరిగణనలోకి తీసుకుంటామని చెబుతోంది. దీనివల్ల గరిష్ఠ వయోపరిమితి 28 సంవత్సరాలుగా ఉన్న ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ల ఉద్యోగాలకు గురువారం ఇచ్చిన వెసులుబాటువల్ల వచ్చే అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు కోల్పోయారు.

వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచండి

యూనిఫామ్ ఉద్యోగాలకు మాదిరిగానే గ్రూపు-1, గ్రూపు-2, ఇతర ఉద్యోగాల వయో పరిమితిని కూడా పొడిగించాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం 42 సంవత్సరాలుగా ఉన్న వయోపరిమితిని కనీసం మరో రెండేళ్లకు పొడిగించాలని అభ్యర్థిస్తున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లుగా ఉందని, అదేవిధంగా తెలంగాణలో ప్రభుత్వోద్యోగాలకూ వయోపరిమితి 44 సంవత్సరాలుగా ఉందని ప్రస్తావిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వయోపరిమితిని వెంటనే పెంచాలని కోరుతున్నారు.

గ్రూపు-1 ప్రిలిమ్స్ తేదీ మార్చాలి

ఏపీపీఎస్సీ ప్రకటించిన గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్ష తేదీని కనీసం నెలరోజులైనా వాయిదా వేయాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతనెల 31వ తేదీన గ్రూపు-1 ఉద్యోగ ఏపీపీఎస్సీ నుంచి ప్రకటన వెలువడింది. అందులో ప్రిలిమ్స్‌ను మార్చి 10, ప్రధాన పరీక్షలను జూన్ 10 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తామని ఏపీపీఎస్సీ ప్రకటించింది. ముఖ్యంగా ప్రిలిమ్స్ నిర్వహణ తేదీ అభ్యర్థులకు మింగుడుపడడంలేదు. సిలబస్‌లో మార్పులు జరిగినందున సన్నద్ధతపరంగా తగిన సమయం అవసరమని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఏపీపీఎస్సీ పునఃపరిశీలన చేసే అవకాశాలు ఉండొచ్చునని తెలియవచ్చింది.

నిపుణుల పరిశీలనలో రైల్వే జోన్ అంశం

- రైల్వేశాఖ సహాయ మంత్రి రాజెన్ గోహెన్ వెల్లడి

గుంతకల్లు, న్యూస్‌టుడే: నవ్యాంధ్రతో పాటు దేశంలో ఎక్కడైనా సరే అవసరమైతేనే కొత్త జోన్లు ఏర్పాటు చేస్తామని రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహెన్ తెలిపారు. నవ్యాంధ్రలో రైల్వే జోన్ ఏర్పాటు అవసరం ఉందా? లేదా అనే విషయాన్ని నిపుణులు పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. నిపుణుల నివేదిక ఆధారంగా కొత్త జోన్ ఏర్పాటుపై కేంద్రం నిర్ణయం తీసుకొంటుందని తెలిపారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన రిమోట్ ద్వారా ప్రారంభించారు. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోనల్‌లో అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో రూ.3,670 కోట్లను కేటాయించామని పేర్కొన్నారు. కొత్తలైన్లు,డబ్లింగ్, విద్యుదీకరణ పనులను పూర్తి చేశామని వివరించారు. రాయలసీమ ప్రాంతంలో రైల్వేకు సంబంధించి రూ.6,300 కోట్లతో పథకాలను ప్రారంభించామని చెప్పారు. ఇందులో భాగంగా కడప-బెంగళూరు మధ్య కొత్త రైలుమార్గాన్ని, గుంతకల్లు-గుంటూరు, పెండేకల్లు-గుత్తి, గుత్తి-ధర్మవరం మధ్య డబుల్‌లైన్, గుంతకల్లు-బళ్లారి మధ్య విద్యుదీకరణ అమలు చేస్తున్నామని చెప్పారు. కర్నూలులో కోచ్ ఫ్యాక్టరీ కోసం రూ.300 కోట్లను కేటాయించామనీ.. గుంతకల్లు, కర్నూలు, తిరుపతి రైల్వే స్టేషన్లను రూ.500 కోట్లతో విస్తరిస్తామని చెప్పారు. గుంతకల్లు-నల్లపాడు, గుత్తి-పెండేకల్లు మధ్య 426 కి.మీ. విద్యుదీకరణ కోసం రూ.432 కోట్లను ఖర్చు పెడుతున్నామని స్పష్టం చేశారు.



ప్రసంగిస్తున్న రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహెన్

Sl. No.	Name of Work	Estimate amount Rs. in Lakhs
1.	Community hall, retaining wall, BT Road (3 Works)	175.20

IFB సం.	STEP ట్రాకింగ్ సం.					
		2	3	4	5	6
04/AP SDMA	93410	[illegible]	[illegible]	282.00	[illegible]	[illegible]

మరోసారి తెదేపా గెలుపు ఖాయం

- వైకాపా, భాజపా, తెరాసవి కుమ్మక్కు రాజకీయాలు
- వారి మాటలను ప్రజలు విశ్వసించరు
- 'ఇండియాటుడే' న్యూస్ ఛానల్ ఇంటర్వ్యూలో మంత్రి లోకేశ్

ఈనాడు - అమరావతి

రాష్ట్రానికి సహకరించని ప్రధాని మోదీపై పాదయాత్రలో పల్లెత్తు మాటానని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర విభజనే లక్ష్యంగా ఏర్పాటై పలు విభజనాంశాలపై ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు సహకరించని తెరాస మాటలను ఏపీ ప్రజలు విశ్వసించబోరని ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి లోకేశ్ అన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాలకు హాజరైన ఆయన 'ఇండియాటుడే' ఆంగ్ల న్యూస్‌ఛానల్‌కు గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రధాని మోదీ, భాజపా నేతలు, కేసీఆర్‌తో కలిసి జగన్ చేస్తున్న కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు ఇప్పటికే గుర్తించారని తెలిపారు. విభజన తరువాత తెలంగాణలోని తెరాస ప్రభుత్వం అనేక అంశాలపై ఆంధ్రప్రదేశ్‌కు సహకరించడం లేదని.. నీటివనరులు, ఆస్తుల పంపకాలపై ఇప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా మరోసారి ఘన విజయం సాధిస్తుందని, నాలుగున్నరేళ్లలో చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలే తమను గెలిపిస్తాయని అన్నారు. లోటు బడ్జెట్‌లోనూ కష్టపడి పనిచేస్తూ గ్రామీణాభివృద్ధి, సులభతర వాణిజ్యంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామని వివరించారు. విదేశీ పెట్టుబడులను అత్యధికంగా సాధించిన రాష్ట్రాల్లోనూ ముందున్నామని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని తెలిపారు.

చంద్రబాబు సేవలు ఇంకా అవసరం

'కొత్త రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సేవలు ఇంకా అవసరం. ఆయన ప్రధానిగా వెళ్లాలని నేను కోరుకోవడం లేదు. రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉంది. ఎన్డీయేయేతర పార్టీల కూటమికి ప్రధాని అభ్యర్థి ఎవరనే దానికంటే.. ప్రజాస్వామ్యాన్ని, వ్యవస్థలను తప్పుదారి పట్టిస్తున్న భాజపాను వచ్చే ఎన్నికల్లో ఓడించాలన్నదే లక్ష్యం. కోల్‌కతా బహిరంగ సభతో ప్రజలంతా భాజపాకు వ్యతిరేకంగా ఉన్నారని స్పష్టమవుతోంది' అని మంత్రి వివరించారు. 'గవర్నర్లను కేంద్రం చెప్పుచేతుల్లో పెట్టుకొని ముఖ్యమంత్రులను తొలగిస్తున్న తీరుకు వ్యతిరేకంగానే తెదేపా పుట్టింది. ఇప్పుడు కూడా రాష్ట్రపతి పాలన విధించాలని కుట్రలు పన్నుతున్నారు. రాష్ట్రంలోని పార్లమెంటు సీట్లకు కాంగ్రెస్, తెదేపా వేర్వేరుగా పోటీ చేసి కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కలిసి పని చేస్తాయా? అనే అంశంపై ఇప్పుడే మాట్లాడటం సరికాదు. తగిన సమయంలో సరైన నిర్ణయాన్ని తీసుకుంటాం' అని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రపంచ ఆర్థిక వేదికపై వివరించి పెట్టుబడులను ఆహ్వానించామని మంత్రి లోకేశ్ వివరించారు. కొన్ని సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కూడా చేసుకున్నాయని తెలిపారు.

ముగిసిన దావోస్ పర్యటన

'రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపడుతున్నాం. నైపుణ్యంగల యువత ఇక్కడ ఉంది. డీటీపీ, క్లౌడ్ హబ్ విధానాలు తీసుకొచ్చి రాయితీలు ఇవ్వడంతో అనేక కంపెనీలు ఏపీకి వస్తున్నాయి. మీరు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే విషయాన్ని పరిశీలించాలి' అని హ్యూలెట్ ప్యాకార్డ్ ఎంటర్‌ప్రైజ్(హెచ్‌పీఈ) స్ట్రాటజీ ఆఫీసర్ విశాల్‌లాల్‌ని మంత్రి లోకేశ్ కోరారు. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల్లో భాగంగా గురువారం ఆయన దావోస్‌లో విశాల్‌లాల్‌తో భేటీ అయ్యారు. ఎలక్ట్రానిక్ తయారీ రంగంలో రాష్ట్రం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదాని రాకతో డేటా సెంటర్ హబ్‌గా మారబోతుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టే అంశంపై కంపెనీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని విశాల్ హామీ ఇచ్చారు.



హెచ్‌పీఈ స్ట్రాటజీ ఆఫీసర్ విశాల్‌లాల్‌తో సమావేశమైన లోకేశ్

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఆర్థిక వేదికపై 'స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. గ్రామాలకు స్టార్ రేటింగ్‌తో పాటు ప్రతి కుటుంబానికి నెలకు రూ.10వేల ఆదాయం లభించేలా కార్యక్రమాలు అమలుచేస్తున్నామని ఆయన వివరించారు. లోకేశ్ ఆధ్వర్యంలోని అధికారుల ప్రత్యేక బృందం గురువారం సాయంత్రం స్వదేశానికి తిరుగు ప్రయాణమైంది.

విదేశంలో తెలుగు వంటకాలు

దావోస్‌లో దేశ, విదేశీయులకు రాష్ట్ర పర్యాటకశాఖ తెలుగు వంటకాలు రుచి చూపించింది. మ్యారియట్ హోటల్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ లాంజ్‌లో ప్రత్యేక స్టాల్‌ని ఏర్పాటుచేశారు. దేశ, విదేశీ ప్రతినిధులు కూడా ఆంధ్ర భోజనం తిని సంతృప్తి ప్రకటించారని పర్యాటక సాధికార సంస్థ సీఈవో హిమాన్షు శుక్లా తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఆర్టీసీ నాయకులతో మంత్రి అచ్చెన్నాయుడు
- సమ్మె డిమాండ్లతో వినతిపత్రమిచ్చిన ఐకాస


అచ్చెన్నాయుడికి వినతిపత్రమిస్తున్న ఐకాస నాయకులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సమ్మె జరగకుండానే కార్మికుల డిమాండ్లు పరిష్కరించేందుకు కృషిచేస్తానని రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు. ఆర్టీసీ కార్మిక సంఘాల ఐకాస నాయకులతో అన్నారు. ఈ నెల 30, 31వ తేదీల్లో ముఖ్యమంత్రి, ఆర్టీసీ ఛైర్మన్, ఎండీతో చర్చలు జరిపి డిమాండ్ల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఐకాస నాయకులు గురువారం అచ్చెన్నాయుడిని కలిశారు. ఈ సందర్భంగా సమ్మె డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. 50 శాతం ఫిట్‌మెంటు ఇవ్వాలని, డిమాండ్లు పరిష్కరించాలని వారు కోరారు. ఆర్టీసీ ఎండీ ఎన్.వి.సురేంద్రబాబు ప్రభుత్వానికి నివేదించిన విధంగా రూ.3,720 కోట్లను ఆర్టీసీకి కేటాయించాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఐకాస కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, సభ్యులు వై.వి.రావు, జిలానీ, శ్రీనివాసరావు, కొండారెడ్డి తదితరులున్నారు. కాగా, కార్మికుల పనితీరుతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేటు బాగా పెరిగిందని.. అయితే, ఇప్పటికీ సంస్థ నష్టాల్లోనే కొనసాగుతుందనే విషయాన్ని గుర్తించుకోవాలని ఐకాస నాయకులకు మంత్రి సూచించారు. ఇలాంటి పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లాలనుకోవడం అటు కార్మికులకు, ఇటు సంస్థకు మేలు చేయదన్నారు. ఆర్టీసీ నష్టాలకు కారణాలు, వాటి వివరాలను ప్రభుత్వం తప్పకుండా పరిశీలిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

■ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి వారు తలపెట్టిన సమ్మెను నివారించాలని జనసేన డిమాండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రగతిపై కార్యాచరణకు సలహాలివ్వండి

జగనన్న పిలుపు పేరుతో వైకాపా అధ్యక్షుడి లేఖలు

ఈనాడు, అమరావతి: 'జగనన్న పిలుపు' పేరుతో వైకాపా అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి పలువురికి లేఖలు రాస్తున్నారు. సేవా కార్యక్రమాలు, పాఠశాలల అభివృద్ధి తదితర సామాజిక ఉపయోగానికి పనిచేస్తున్న పలువురిని గుర్తించి వారికి లేఖలు పంపుతున్నారు. 'మీరు చేస్తున్న సేవా కార్యక్రమాలపై ప్రజలు ఎంతో గౌరవంగా మాట్లాడుకోవడం సంతోషదాయకం. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఉన్నతమైన ఆలోచనలు కలిగి, లక్ష్యసిద్ధి కోసం శ్రమించే మీ లాంటివారి అనుభవాలు, ఆలోచనలు, నవ్యాంధ్ర నిర్మాణానికి పునాదులవుతాయని నా దృఢ నమ్మకం. 429 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నేను చేసిన పాదయాత్రలో మీలాంటి ఎంతో మంది స్ఫూర్తిదాయక వ్యక్తులను కలుసుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా. రాష్ట్ర ప్రగతి కోసం నేను రూపొందిస్తున్న కార్యాచరణ కోసం మీ విలువైన సలహాలు తీసుకోవాలనుకుంటున్నాను. మీ ఆలోచనలను officeofysjagan@gmail.comకు మెయిల్ చేయండి లేదా 9199691996 నంబరుకు ఫోన్ చేసి చెప్పవచ్చు. నన్ను కలిసేందుకు కూడా ఫోన్ చేయవచ్చు' అని లేఖలో పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్‌దీ బాల్య వివాహమే

తెలంగాణ హోం మంత్రి ఆసక్తికర వ్యాఖ్య

నారాయణగూడ, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రజలూ చైతన్యవంతులు కావాలని తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. గతంతో పోలిస్తే బాల్య వివాహాలు చాలా వరకు తగ్గాయని చెప్పారు. మన ముఖ్యమంత్రి కేసీఆర్ వివాహం కూడా పిన్న వయసులోనే జరిగిందని, కానీ ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రవేశపెట్టిన తరువాత నిరుపేదలు కూడా 18ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేస్తున్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

నేడు కడపకు ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, కడప: ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం కడప జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.40 గంటలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో కడపకు వచ్చి.. 2.40 గంటల వరకు జరిగే డ్వాక్రా సదస్సులో పాల్గొననున్నారు. ఇందుకోసం కడప మున్సిపల్ మైదానంలో సభా వేదికతో పాటు భారీ ప్రాంగణాన్ని నిర్మించారు. రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లా నుంచి సుమారు 40 వేల మంది మహిళలు సభకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇక్కడి సభ అనంతరం విశాఖకు బయలుదేరి వెళ్తారు. కడప, గుంటూరు, విశాఖలో డ్వాక్రా సదస్సులే నిర్వహిస్తుండగా.. ఒక్కోచోట ఒక్కో పాలసీని ప్రకటించే అవకాశం ఉంది. ఈ సదస్సులో సుమారు రూ.13 వేల కోట్లకు సంబంధించిన వరాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాల సమాచారం. ప్రస్తుతం శాసనసభ టిక్కెట్లపై చర్చలు సాగుతుండటంతో స్థానిక నేతలతోనూ సీఎం భేటీ అయ్యే అవకాశం ఉంది.

రాజధానికి లక్ష విరాళమిచ్చిన అంధురాలు



ఈనాడు-అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణానికి నేను సైతం.. అంటూ గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన అంధురాలు గూడూరు నాగేంద్రమ్మ రూ.లక్ష విరాళం ఇచ్చారు. రెండు కళ్లూ కనిపించని ఆమె, కుటుంబ సభ్యులతో వచ్చి ఉండవల్లి ప్రజావేదికలో సీఎంను కలిసి చెక్కు అందించారు. రాజధాని నిర్మాణంపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరి తనను బాధించిందని నాగేంద్రమ్మ పేర్కొన్నారు. నాలుగెకరాల భూమిపై వచ్చే ఆదాయం నుంచి రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు వివరించారు. మూడేళ్ల వయసులోనే ప్రపంచ జ్ఞాపకశక్తి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన తన మనుమరాలు ధన్విని ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. సీఎం వారిని అభినందించారు.

బాక్సైట్ తవ్వకాలను ఆపింది చంద్రబాబే

- పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా
- మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, న్యూస్‌టుడే: రాష్ట్ర విభజన అనంతరం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు విశాఖ మన్యంలో బాక్సైట్ తవ్వకాలను నిలిపివేశారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ చెప్పారు. విశాఖపట్నం నుంచి గురువారం ఫోన్లో 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. అరకులోయ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు హత్యకు సీఎం చంద్రబాబు బాధ్యత వహించాలన్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా సర్వేశ్వరరావు పోరాడారని గుర్తు చేశారు. కిడారి, సోమ కుటుంబాలను పరామర్శించాల్సిన బాధ్యత మీపై లేదా అని జనసేన అధినేతను ప్రశ్నించారు. గతంలో పాడేరులో పర్యటించిన పవన్‌కల్యాణ్ ప్రశాంతంగా ఉన్న మన్యంలో ఆజ్యం పోసి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల హత్యకు కారకులయ్యారని ఆరోపించారు. గిరిజన యువతకు జాబ్ మేళా, నిరుద్యోగ భృతి, ట్రైకార్ రుణాలు అందిస్తూ వారంతా పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.

జగన్, పవన్ కాంగ్రెస్‌తో కలిసిరావాలి

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: జగన్మోహన్‌రెడ్డి, పవన్‌కల్యాణ్‌లు కాంగ్రెస్‌తో పొత్తుకు ముందుకు వస్తే స్వీకరించడానికి సిద్ధమని, ఇందుకు అవసరమైతే తాను పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పిస్తానని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతామోహన్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరిగే ఎన్నికల్లో తెదేపాతో పొత్తు పెట్టుకోవద్దని తమ పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ ఎన్నికల్లో పొత్తుపెట్టుకోవడంతో అక్కడ కాంగ్రెస్‌కు కనీస సీట్లు కూడా రాకపోవడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వైకాపా, జనసేనతో పొత్తు విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదనేది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు.

నేడు జనసేన, వామపక్షాల సమావేశం

ఈనాడు, అమరావతి: విశాఖ వేదికగా జనసేన, కమ్యూనిస్టు పార్టీల అగ్రనాయకులు శుక్రవారం సమావేశం కాబోతున్నట్లు జనసేన ప్రకటించింది. రుషికొండలో ఉన్న సాయి ప్రియా రిసార్ట్‌లో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ఉంటుందని పేర్కొంది. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు తొలిసారిగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో భేటీ కానున్నారు. ఈ సమావేశంలో పవన్‌తోపాటు నాదెండ్ల మనోహర్ ఇతర నాయకులు పాల్గొంటారు.

జలీల్‌ఖాన్ ప్రకటన తెదేపా సిద్ధాంతానికి వ్యతిరేకం

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధ్యక్షుడు నాగుల్‌మీరా

ఈనాడు, అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీటును తన కుమార్తె షబానా ఖాతూన్‌కు ఇచ్చారని ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ ప్రకటించడంపై రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా అసంతృప్తి వెలిబుచ్చారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఒక శాసనసభ్యుడిగా ముఖ్యమంత్రిని కలవడంలో తప్పులేదు. చంద్రబాబు ఏం మాట్లాడారో తెలియదు. బయటకొచ్చి సీటు ఇచ్చారని పత్రికా ముఖంగా చెప్పడం తెదేపా సిద్ధాంతానికి వ్యతిరేకం.." అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. తాను నియోజకవర్గంలో 20 ఏళ్లుగా వివిధ సమస్యలపై పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ముస్లిం పెద్దలతో కలిసి ముఖ్యమంత్రిని కలుస్తానని చెప్పారు.

జగన్ పదే పదే అవమానించారు

- రంగా హత్యను తెదేపాకు ఆపాదించడం సరికాదు
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో గౌరవమిచ్చారు
- వంగవీటి రాధా వ్యాఖ్యలు



ఈనాడు, విజయవాడ: వైకాపాలో తానే సర్వస్వం, తాను చెప్పిందే వేదం, ఎవరైనా నా కిందోడే అనేలా జగన్ తీరు ఉంటోందని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ఆరోపించారు. ఆ పార్టీలో తనకు ఎన్నో అవమానాలు జరిగాయని, వాటన్నింటినీ భరించినా ఇంకా అనేక రకాలుగా వేధింపులకు గురిచేస్తూ, అల్లరి పెట్టాలని చూడడం వల్లే వైకాపాకు రాజీనామా చేసి బయటకు వచ్చానని స్పష్టం చేశారు. తనను చంపుతామంటూ, అంతు చూస్తామంటూ సామాజిక మాధ్యమాల ద్వారా వైకాపాకు చెందిన వాళ్లు బెదిరింపులకు సైతం దిగారన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం విలేకరులతో రాధా మాట్లాడారు. కేవలం తండ్రి లేని వాడివనే జాలితోనే వైకాపాలో ఉండనిస్తున్నానని, వదిలేస్తే గాలికి కొట్టుకుపోతావంటూ జగన్ తనను పదే పదే అవమానిస్తూ వచ్చారన్నారు. తన తండ్రిపై అభిమానంతో కొందరు విగ్రహం పెడుతుంటే.. ఆ కార్యక్రమానికి తాను వెళ్లడం తప్పని, ఎవరికి చెప్పి వెళ్లావంటూ తనను జగన్ నిలదీయడంతోపాటు అవమానకరంగా మాట్లాడారన్నారు. పార్టీలో చేరినప్పుడు తనను తమ్ముడంటూ స్వాగతించిన జగన్, ఇంత జరుగుతున్నా కనీసం ఒక్క ఫోనూ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సీటు ఇవ్వకపోయినా తాను బాధపడలేదని, కానీ.. సూటిపోటి మాటలతో వేధించి బయటకు వెళ్లేలా చేశారన్నారు.

ప్రజలు మాపై చూపేది జాలి కాదు

ఇప్పటికైనా జగన్‌రెడ్డి తన పద్ధతులను మార్చుకుని రంగా అభిమానులను గౌరవిస్తే మంచిదని రాధా సూచించారు. ప్రజలు తమపై చూపించేది జాలి కాదని, తన తండ్రి చనిపోయి.. 30ఏళ్లయినా అదే అభిమానం నేటికీ ఉందంటే.. అది ఆయన గొప్పతనమన్నారు. ఆయన ఆశయాల సాధనే తన ఏకైక లక్ష్యమని, తన వాళ్లను కాపాడుకోవడమే ధ్యేయమని రాధా స్పష్టం చేశారు.

అది కొందరు వ్యక్తులు చేసిన పని

ఒక ఎమ్మెల్యే ఏం చేయగలుగుతాడంటూ మీరు ప్రకటించినప్పుడు.. మీ పార్టీలో ఎందుకుండాలని రాధా ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 11 నుంచి తను పార్టీలో ఉన్నా.. లేనట్టే తీసి పక్కన పడేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రంగాను చంపిన పార్టీలోకి ఎలా వెళ్తావంటూ కొందరు ప్రశ్నిస్తున్నారని.. అయితే కొందరు వ్యక్తులు చేసిన పనిని.. తెదేపాకు ఆపాదించడం సరికాదన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద మనసుతో తనను పార్టీలోకి ఆహ్వానించారని రాధా వెల్లడించారు. తన కుటుంబానికి ఎంతో గౌరవం ఇచ్చారన్నారు. తాను ఏ పార్టీలో చేరుతున్నాననే విషయంపై మాత్రం రాధా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. తన వాళ్ల కోసం ప్రజాజీవితంలో కొనసాగుతానని మాత్రమే స్పష్టం చేశారు.

రాధాకు సముచిత స్థానం కల్పించాం: పేర్ని నాని

విజయవాడ సిటీ, హైదరాబాద్, న్యూస్‌టుడే: వైకాపాలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను నియమించి సముచిత స్థానం కల్పించామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. గురువారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ వంగవీటి రంగా ఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేరుస్తారని ఆయన నమ్మడం భ్రమే అని పేర్కొన్నారు.

తెదేపా కబంధ హస్తాల్లో రాధా

వంగవీటి రంగా హత్య వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, సభాపతి కోడెల శివప్రసాద్ కుట్ర ఉందని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ వైకాపా బాధ్యుడు సామినేని ఉదయ భాను ఆరోపించారు. హైదరాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాధా తెదేపా కబంధ హస్తాల్లో చిక్కుకుని వాళ్లిచ్చిన స్క్రిప్టును మాట్లాడారని ఎద్దేవా చేశారు.

పథకాలు కాపీ కొట్టాల్సిన ఖర్మ పట్టలేదు

- కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన కొనకళ్ల, అనిత

తాడేపల్లి, కృష్ణలంక, న్యూస్‌టుడే, ఈనాడు-అమరావతి: తెలంగాణ రాష్ట్ర పథకాలను కాపీ కొట్టాల్సిన అవసరం తెదేపా ప్రభుత్వానికి లేదని మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణ అన్నారు. అమరావతిలోని ఉండవల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ పథకాలను చంద్రబాబు కాపీ కొట్టి అమలు చేస్తున్నారంటూ తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని చెప్పారు. బీసీలకు ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.40 వేల కోట్లు కేటాయించగా, తెలంగాణలో రూ.10 వేల కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ఖాళీలను ఏపీ రెండుసార్లు భర్తీ చేస్తే, తెలంగాణలో ఒక్కసారి కూడా చేయలేకపోయారని తెలిపారు.

రాజకీయానికి ఏపీ కావాలి.. వార్తలు అక్కర్లేదా?

'రాజకీయం చేయడానికి ఆంధ్రప్రదేశ్ కావాలి.. అక్కడి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని తెలియజేసే వార్తలు మాత్రం అక్కర్లేదా?' అని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను తెదేపా ఎమ్మెల్యే వంగలపూడి అనిత ప్రశ్నించారు. తమ పథకాలు కాపీ కొట్టారని, ఆంధ్రప్రదేశ్ వార్తలు, సమస్యలు తమకు అక్కర్లేదంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. సంక్షేమానికి చిరునామాగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. తెరాస పథకాలు కాపీ కొట్టారనడం కేటీఆర్ అవగాహన లేమికి నిదర్శనమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గతంలోనూ మీడియాపై ఆంక్షలు విధించి కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగే అభివృద్ధి చూసి తెలంగాణ ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయంతోనే వార్తలు కనిపించనీయకుండా అడ్డుకుంటున్నారా? అని అనిత నిలదీశారు. ప్రతిపక్ష నాయకుడి ఆస్తులను ఆసరాగా తీసుకుని తెరాస నాయకులు ఏపీలో అడుగు పెడితే తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ బినామీ ఆస్తుల గుర్తింపు

- జప్తు కోసం ప్రతిపాదనలు

ఈనాడు, అమరావతి: అగ్రిగోల్డ్‌కు సంబంధించిన మరిన్ని బినామీ ఆస్తుల గుట్టును సీఐడీ రట్టు చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అగ్రిగోల్డ్ సంస్థ ప్రతినిధుల బినామీల పేరిట రూ.26.53 కోట్లు (పుస్తక విలువ) విలువైన 151 ఆస్తులున్నట్లు గుర్తించింది. ఇవి గుంటూరు, ప్రకాశం, అనంతపురం, నెల్లూరు, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఉన్నాయి. వీటిని జప్తు చేయాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు సీఐడీ విభాగాధిపతి అమిత్‌గార్గ్ తెలిపారు.

ఎయిమ్స్ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన త్రిపాఠి

ఈనాడు-అమరావతి: మంగళగిరి ఎయిమ్స్ సంచాలకులుగా ముఖేశ్ త్రిపాఠి గురువారం బాధ్యతలు స్వీకరించారు. రుషికేశ్ ఎయిమ్స్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. త్వరలోనే ఓపీ సేవలు ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆధునాతన వైద్యసేవలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

ఎన్నికల ప్రణాళిక రూపకల్పనలో తెదేపా

ఈనాడు, అమరావతి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం ఎన్నికల ప్రణాళిక రూపకల్పనపై దృష్టి పెట్టింది. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు తదితర అన్నివర్గాలను ఆకట్టుకునేలా ఎన్నికల ప్రణాళికను సిద్ధం చేస్తోంది. త్వరలోనే పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయనుంది. ఎన్నికల్లోగా కీలక నిర్ణయాలు ప్రకటించడమే కాకుండా.. ప్రజాకర్షక విధానాలతో ఎన్నికల ప్రణాళిక రూపకల్పన బాధ్యతను ఈ కమిటీకి అప్పగించనున్నారు.

బీసీ సంఘానికి గుర్తింపు ఇవ్వండి

ఈనాడు, అమరావతి: విద్యుత్తుశాఖలో ఉన్నతాధికారుల వేధింపుల నుంచి బీసీ ఉద్యోగులను కాపాడాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మెజార్టీ సభ్యుల ఆమోదం పొందిన 'బీసీ' సంఘానికి గుర్తింపు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన గురువారం లేఖ రాశారు.

కాపుల అభ్యున్నతికి చంద్రబాబు కృషి: వేదవ్యాస్

కాపుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారని మచిలీపట్నం నగరాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. కాపు సామాజిక వర్గానికి 5 శాతం రిజర్వేషన్ కేటాయించడం మంచి నిర్ణయమని కొనియాడారు.

నేను ఏపీ గవర్నర్‌గానా? అన్నీ వదంతులే



చెన్నై, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా తనను నియమిస్తారంటూ జరుగుతున్న ప్రచారాన్ని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ ఖండించారు. అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు. ఏడాది కాలంగా ఇలాంటి వార్తలు వస్తున్నాయని, అవన్నీ వదంతులేనని గురువారం పేర్కొన్నారు.

సెన్సెక్స్ ▲ 87	నిఫ్టీ ▲ 18	డోజోన్స్ 24492 ▼83	నాస్‌డాక్ 7047 ▲ 22	రూపాయి 71.07 ▲ 26 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	ముడి చమురు 61.20 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)
36195	10850				

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)


నిఫ్టీ	24న	మార్పు%
YES BANK	215.40	9.20
RELIANCE INDUS	1247.45	1.72
TCS	1901.55	1.38
JSW STEEL	283.65	0.98
TECH MAHINDRA	727.75	0.98
DR. REDDYS LAB	2668.45	0.82
TITAN COMPANY	969.65	0.78

గ్రహణం (-)

నిఫ్టీ	24న	మార్పు%
BHARTI INFRATEL	263.00	-5.05
TATA MOTORS	175.40	-2.69
UPL	747.35	-2.03
SUN PHARMA	423.00	-1.86
CIPLA	500.70	-1.69
ULTRATECH CEM	3790.70	-1.56
BAJAJ FINSERV	6407.30	-1.32


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.79	75.13	బ్రెయిన్ దీనార్	175.36	200.64
పౌండ్ స్టెర్లింగ్	84.72	98.24	కువైట్ దీనార్	194.05	241.56
యూరో	73.79	85.57	ఒమన్ రియాల్	171.60	196.57
జపనీస్ యెన్/100	59.17	68.62	సౌదీ రియాల్	17.23	20.42
ఆస్ట్రేలియా డాలరు	46.15	53.40	యూఏఈ దిర్హమ్	17.63	20.61
సింగపూర్ డాలరు	47.67	56.48	మలేషియా రింగిట్	15.34	18.86
థాయ్ బాత్/100	204.26	244.22	చైనీస్ యువాన్	7.42	12.05

గురువారం నిఫ్టీ కదలికలు



బీమా రంగ వృద్ధికి అపార అవకాశాలు

ఏటా 16శాతం వృద్ధి సాధిస్తోంది ● ఆంధ్రా బ్యాంక్ నిష్క్రమణ ప్రభావం సంస్థపై ఉండదు

ఈనాడు ఇంటర్వ్యూ

ఇండియాఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ ఆర్.ఎం.విశాఖ

'మూడేళ్ల క్రితం వరకు కొంత స్తబ్దుగా ఉన్న జీవిత బీమా రంగం ఇప్పుడు మళ్లీ వృద్ధి బాటలో పయనిస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకూ బీమా అందుబాటులోకి తెచ్చేందుకు బీమా సంస్థలు కృషి చేస్తున్నాయ'ని ఇండియాఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఆర్.ఎం. విశాఖ అంటున్నారు. మార్కెట్ పనితీరు బాగుండటం, ఖర్చులు తగ్గడంతో ఇప్పుడు యూనిట్ ఆధారిత పాలసీ (యులిప్)లకూ మంచి ఆదరణ లభిస్తోందంటున్న ఆమెతో 'ఈనాడు' ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు..



? దేశంలో బీమా రంగం పరిస్థితి ఎలా ఉంది? భవిష్యత్తులో ఎలా ఉండబోతోంది?

ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థలో బీమా రంగం గణనీయమైన పాత్ర పోషిస్తోంది. వ్యక్తిగత బీమా ప్రీమియం విషయంలో గత మూడేళ్లుగా దాదాపు 16 శాతం వరకూ వృద్ధి కనిపిస్తోంది. భారతీయ బీమా రంగం రాబోయే రోజుల్లో మరింత వృద్ధి దిశగా సాగుతుందని చెప్పొచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో బీమా పాలసీల విస్తృతి ఇంకా అంతగా లేకపోవడం, దేశంలో పనిచేసే యువత అధికంగా ఉండటం, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) వంటి పథకాలతో ప్రభుత్వ ప్రోత్సాహం.. ఇలా బీమా రంగానికి మేలు చేసే అంశాలు, అవకాశాలు అనేకం ఉన్నాయి. దేశంలో తలసరి పొదుపు రేటు పెరగడం, ఆ డబ్బు బీమా పాలసీల్లోకి వస్తుండటం సానుకూల అంశంగా చెప్పుకోవచ్చు.

? ఇటీవల కాలంలో యూనిట్ ఆధారిత బీమా పాలసీలపై (యులిప్) బీమా సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఇవి నిజంగా ఆకర్షణీయంగా మారాయా?

జీవిత బీమా, స్టాక్ మార్కెట్లో పెట్టుబడికి అవకాశం కల్పించేవి యులిప్‌లు. నియంత్రణ సంస్థ వీటి విషయంలో పలు కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. దీనివల్ల గతంతో పోలిస్తే ఇవి ఇప్పుడు మరింత మెరుగయ్యాయి. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్లు, టర్మ్ పాలసీలతో వచ్చే ప్రయోజనాలను యులిప్‌లు అందిస్తున్నాయి. బీమా సంస్థలు కూడా ఈ కొత్త తరం యులిప్‌లకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పలు కొత్త పాలసీలను తీసుకొస్తున్నాయి. మా సంస్థ నుంచి కూడా పలు యులిప్‌లను అందుబాటులోకి తెచ్చాం.

? ఇండియాఫస్ట్ ప్రధాన ప్రమోటర్లలో ఆంధ్రాబ్యాంక్ ఒకటి. ఇప్పుడు తన వాటాను విక్రయించేందుకు సిద్ధమయ్యింది. దీని ప్రభావం ఎలా ఉండబోతోంది?

ఆంధ్రా బ్యాంక్ ఇండియా ఫస్ట్ ప్రమోటరే కాకుండా.. అతి పెద్ద వాటాదారు, పంపిణీదారు కూడా. ఒక వాటాదారుగా తమ పెట్టుబడులకు విలువ వచ్చినప్పుడు, దాన్ని సొమ్ము చేసుకునేందుకు అవకాశం ఉంది. అయితే, వాటాదారు కాకపోయినా ఆంధ్రాబ్యాంక్‌తో ఇప్పుడున్న పాలసీ పంపిణీ, పాలసీదారులకు సేవలందించడంలాంటి వ్యవహారాలన్నీ ఇప్పటిలాగే కొనసాగుతాయి. కాబట్టి, మా సంస్థపై పెద్దగా ప్రభావం ఏమీ ఉండదు.

? జీవిత బీమా సంస్థలు ఐపీఓకి వచ్చాయి. ఇండియాఫస్ట్ మార్కెట్లో నమోదయ్యే అవకాశం ఉందా?

ప్రస్తుతం మా సంస్థ తన వాటాదార్ల పెట్టుబడికి మంచి విలువను సమకూర్చిపెడుతోంది. ఐపీఓకి రావాలా వద్దా అనేది వాటాదార్ల నిర్ణయాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది.

? ఇప్పటి వరకూ ఎన్ని పాలసీలు ఉన్నాయి. ఏదైనా కొత్త పాలసీలతో ముందుకు వస్తున్నారా?

మా సంస్థ నుంచి మొత్తం 32 పాలసీలు అందుబాటులో ఉన్నాయి. పాలసీదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని, వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త పాలసీలను తీసుకొస్తూనే ఉన్నాం. పాలసీదారులను చేరడానికి కూడా విభిన్న పంపిణీ మార్గాలను ఎంచుకుంటున్నాం. ఆన్‌లైన్‌లోనూ పాలసీలను అందుబాటులోకి తెచ్చాం. అన్ని విభాగాల్లోని పాలసీదారులను దృష్టిలో పెట్టుకొని పూర్తి రక్షణకు పరిమితమైన పాలసీలను తీసుకొస్తున్నాం. ఇప్పటికే నెలనెలా ఆదాయం కోరుకునే వారిని లక్ష్యంగా చేసుకొని కొన్ని పాలసీలను తీసుకొచ్చాం.

? ఇండియాఫస్ట్ లైఫ్ పని తీరు గురించి చెప్పండి? మొదటి ఏడాది ప్రీమియం వసూళ్లు, పాలసీ పునరుద్ధరణ ఎలా ఉంది?

2015-18 మధ్య కాలంలో వ్యక్తిగత బీమా విభాగంలో ఈ రంగంలో 16 శాతం వృద్ధి నమోదు చేయగా.. మా సంస్థ సగటున 53 శాతం వార్షిక వృద్ధిని సాధించింది. పాలసీదారులు మాపై పూర్తి విశ్వాసంతో ఉన్నారు. దాదాపు 76 శాతం మంది తమ పాలసీలను 13వ నెలలోనూ కొనసాగిస్తున్నారు. భవిష్యత్తులోనూ ఈ వృద్ధి కొనసాగుతుందని మేము నమ్ముతున్నాం. పాలసీదారుల అవసరాలకు తగ్గట్టుగా పాలసీలను తీసుకురావడమే దీనికి కారణం. ఇండియాఫస్ట్ లైఫ్ వెల్త్ మ్యాగ్జిమైజర్, మనీ బ్యాలెన్స్ ప్లాన్, క్యాష్ బ్యాక్ ప్లాన్, గ్యారంటీడ్ రిటైర్‌మెంట్‌ప్లాన్, మహా జీవన్ ప్లాన్‌లాంటివి ఎక్కువ మంది పాలసీదారులు తీసుకుంటున్నారు.

? గ్రామీణ ప్రాంతాల్లో బీమాను విస్తృతం చేయడానికి ఎలాంటి ప్రణాళికలు వేస్తున్నారు? తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సేవలు ఎలా ఉన్నాయి?

జీవిత బీమా అనేది ప్రతి ఒక్కరికీ అవసరం అనే సిద్ధాంతాన్ని మేము నమ్ముతాం. అందుకే, గ్రామీణ, పట్టణ ప్రాంతం అని తేడా లేకుండా మా సేవలను అందించేందుకు ఉన్న అన్ని అవకాశాలూ పరిశీలిస్తున్నాం. ఇండియాఫస్ట్ లైఫ్ కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా 1,50,000 కేంద్రాల నుంచి సేవలను అందిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో గ్రామీణ బ్యాంకులతో ఒప్పందాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన 2,000 శాఖల ద్వారా పాలసీల అమ్మకాలు, ఇతర సేవలను అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి సరిపోయే మైక్రో ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకొచ్చాం. తెలుగు రాష్ట్రాల్లో 1,500 ఆంధ్రాబ్యాంక్ శాఖలు, 200 బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలు, 198 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బీ) శాఖలతో పాటు, 4 ఇండియాఫస్ట్ లైఫ్ శాఖలు ఇక్కడ ఉన్నాయి.

– ఈనాడు, హైదరాబాద్

అల్ట్రాటెక్ సిమెంట్ లాభం తగ్గింది



దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అల్ట్రాటెక్ సిమెంట్ రూ.390.43 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ నమోదు చేసిన రూ.456.66 కోట్లతో పోలిస్తే ఇది 14.5 శాతం తక్కువ. మొత్తం ఆదాయం రూ.8,056.54 కోట్ల నుంచి రూ.9,492.94 కోట్లకు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో దేశీయ విక్రయాలు 15 శాతానికి పైగా పెరిగాయని కంపెనీ పేర్కొంది. ఇంధన, విద్యుత్తు ఖర్చులు బాగా పెరగడంతోపాటు రూపాయి మారకపు విలువలో క్షీణత ప్రభావం కంపెనీపై 11 శాతం అదనపు భారాన్ని మోపిందని, ఇతర కంపెనీల కొనుగోలు కోసం చేసిన రుణాలకు వడ్డీ చెల్లింపులు కూడా దీనికి తోడయ్యాయని కంపెనీ తెలిపింది. మొత్తం వ్యయాలు రూ.8,916.44 కోట్లుగా నమోదయ్యాయి. జైప్రకాశ్ అసోసియేట్స్, జేపీ సిమెంట్ కార్ప్ సిమెంటు ప్లాంట్లతో కలిపి తాజా ఫలితాలు విడుదల చేశామని, 9 నెలల కాలానికి వీటిని పోల్చి చూడొద్దని వెల్లడించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం మౌలిక, గృహ నిర్మాణ పథకాలకు అధిక మొత్తంలో కేటాయింపులు చేసే అవకాశం ఉండటంతో సిమెంటుకు గిరాకీ బాగా పెరిగే అవకాశం ఉందని కంపెనీ అభిప్రాయపడింది.

బీఎస్ఈలో షేరు 1.54 శాతం నష్టంతో రూ.3,790.25 వద్ద ముగిసింది.

ఆర్‌పవర్ లాభంలో 32% క్షీణత

దిల్లీ: డిసెంబరు 2018తో ముగిసిన త్రైమాసికంలో రిలయన్స్ పవర్ ఏకీకృత నికర లాభం 32.47 శాతం క్షీణించి రూ.189.30 కోట్లకు చేరింది. తక్కువ ఆదాయాలు ఇందుకు నేపథ్యం. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.280.34 కోట్లుగా ఉంది. కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ.2,589.28 కోట్ల నుంచి రూ.2,151.39 కోట్లకు తగ్గింది.

2018-19 ఏప్రిల్-డిసెంబరులో ఏకీకృత నికర లాభం క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే రూ.784.34 కోట్ల నుంచి రూ.679.55 కోట్లకు పరిమితమైంది. ఈ తొమ్మిది నెలల్లో మొత్తం ఆదాయం కూడా రూ.7718.53 కోట్ల నుంచి రూ.6,898.97 కోట్లకు తగ్గింది. 2017-18 మొత్తం ఆర్థిక సంవత్సరంలో ఈ రిలయన్స్ గ్రూప్ కంపెనీ రూ.10,118.09 కోట్ల ఆదాయంపై రూ.103 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

బీఎస్ఈలో కంపెనీ స్క్రిప్ ధర 2.66% లాభంతో రూ.28.90 వద్ద స్థిరపడింది.

బయోకాన్ లాభం రెండింతలకు పైగా

దిల్లీ: బయోటెక్నాలజీ దిగ్గజం బయోకాన్ ఫలితాల్లో రాణించింది. బయోలాజిక్స్ వ్యాపారం బాగా రాణించడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం రెట్టింపై(136% వృద్ధితో) రూ.217.2 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది ఇదే మూడు నెలల కాలంలో సంస్థ లాభం రూ.91.9 కోట్లుగా ఉంది. ఇక ఏకీకృత ఆదాయం కూడా రూ.1057.9 కోట్ల నుంచి రూ.1540.8 కోట్లకు చేరింది. కంపెనీ వడ్డీ, పన్నులు, తరుగుదల, తనఖాలకు ముందు ఆర్జన(ఎబిటా) కూడా 59% పెరిగి రూ.406 కోట్లకు చేరింది. బలమైన ఫలితాలను వెలువరచిన నేపథ్యంలో కంపెనీ ఛైర్మన్ కిరణ్ మజుందార్ షా ట్విటర్‌లో ఆనందం వ్యక్తం చేశారు.

బీఎస్ఈలో బయోకాన్ షేరు ధర 0.04% పెరిగి రూ.670.55 వద్ద ముగిసింది.

సాగర్‌సాఫ్ట్ ఇండియా లాభం రూ.1.64 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ సాగర్‌సాఫ్ట్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి రూ.10.59 కోట్ల మొత్తం ఆదాయాన్ని ఆర్జించింది. త్రైమాసిక నికరలాభం రూ.1.64 కోట్లు, ఈపీఎస్ రూ.2.95 నమోదయ్యాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.11.52 కోట్లు, నికరలాభం రూ.1.31 కోట్లు, ఈపీఎస్ రూ.2.37 ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలల కాలానికి కంపెనీ మొత్తం ఆదాయం రూ.31.53 కోట్లు ఉండగా, దీనిపై రూ.4.71 కోట్ల నికరలాభాన్ని రూ.8.48 ఈపీఎస్‌ను నమోదు చేసింది. వాటాదార్లకు 10% (రూ.1) చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని సాగర్‌సాఫ్ట్ ఇండియా డైరెక్టర్ల బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీనికి వచ్చే నెల 8వ తేదీని రికార్డు తేదీగా నిర్ణయించారు.

ఆర్ఐఎల్, యెస్ బ్యాంక్ దన్ను

మళ్లీ లాభాల్లోకి సూచీలు ● 87 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

సమీక్ష

రెండు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో.. ఆర్ఐఎల్, ఐటీసీ, యెస్ బ్యాంక్ వంటి పెద్ద షేర్లు దన్నుగా నిలవడంతో సూచీలు లాభాలతో ముగిశాయి. ఐటీ షేర్లూ రాణించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 260 పాయింట్ల మేర ఊగిసలాడింది. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. ఐరోపా షేర్లు నష్టాల్లో కదలాడాయి. సెన్సెక్స్ ఉదయం 36,146.55 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. అయితే కొద్దిసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. 36000 పాయింట్ల దిగువకు చేరింది. ఇంట్రాడేలో 35,996.68 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. కొనుగోళ్ల మద్దతుతో చివర్లో మళ్లీ పుంజుకుంది. 36,258.28 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకి.. చివరకు 86.63 పాయింట్ల లాభంతో 36,195.10 వద్ద ముగిసింది. గత రెండు సెషన్లలో సూచీ 470 పాయింట్లు కోల్పోయింది. ఇక నిఫ్టీ సైతం 18.30 పాయింట్లు పెరిగి 10,849.80 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,798.65- 10,866.35 పాయింట్ల మధ్య కదలాడింది.

ఇండిగో పరుగులు: విమానయాన సంస్థ ఇండిగోను నిర్వహించే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు రాణించాయి. త్రైమాసికం లాభం తగ్గినప్పటికీ.. ఒక మైలుపై ప్రయాణికుడికి సగటు ఛార్జీ పెరగడమే ఇందుకు నేపథ్యం. ఒకానొకదశలో 6.86 శాతం పెరిగిన షేరు.. చివరకు 6 శాతం లాభంతో రూ.1,174.40 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,554.74 కోట్లు పెరిగి రూ.45,144.74 కోట్లకు చేరింది.

■ ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈఓ, ఎండీ చందాకొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ ఎండీ వేణుగోపాల్ ధూత్‌లపై సీబీఐ కేసు నమోదు చేయడంతో వీడియోకాన్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు డీలాపడ్డాయి. వీడియోకాన్ ఇండస్ట్రీస్ 2.73 శాతం నష్టంతో రూ.2.85 వద్ద, ఐసీఐసీఐ బ్యాంక్ షేరు 0.72 శాతం తగ్గి రూ.365 వద్ద ముగిశాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 13 లాభాలతో ముగిశాయి. యెస్ బ్యాంక్ 8.39%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.61%, టీసీఎస్ 1.17%, హెచ్‌డీఎఫ్‌సీ 0.58%, ఎస్‌బీఐ 0.51% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. టాటా మోటార్స్ 2.72%, సన్‌ఫార్మా 1.92%, బజాజ్ ఆటో 1.11%, కోల్ ఇండియా 0.95%, ఓఎన్‌జీసీ 0.84%, భారతీ ఎయిర్‌టెల్ 0.81% మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి, ఐటీ, పీఎస్‌యూ, చమురు- గ్యాస్ షేర్లు రాణించాయి. యంత్ర పరికరాలు, వాహన, లోహ స్క్రిప్‌లు డీలాపడ్డాయి.

క్రీడాంకురంలో 'యాంట్‌హిల్ వెంచర్స్' పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: స్టార్టప్ సంస్థల్లో పెట్టుబడి పెట్టే సంస్థ అయిన యాంట్‌హిల్ వెంచర్స్... క్రీడలు, మీడియా- వినోద రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న రూటెర్స్ స్పోర్ట్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 10 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.70 కోట్లు) పెట్టుబడిగా పెట్టింది. కేవలం నిధులు సమకూర్చటమే కాకుండా పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలతో కలిసి పనిచేసే అవకాశాన్ని రూటెర్స్ స్పోర్ట్స్ టెక్నాలజీస్‌కు కల్పిస్తామని యాంట్‌హిల్ వెంచర్స్ వ్యవస్థాపకుడు- సీఈఓ అయిన ప్రసాద్ వంగ పేర్కొన్నారు. యాంట్‌హిల్ వెంచర్స్ ప్రధానంగా ఫైనాన్స్, ఆరోగ్యం, జీవశాస్త్రాలు, మీడియా- వినోద రంగాల్లో టెక్నాలజీ ఆధారిత సేవలను ఆవిష్కరించటానికి ప్రయత్నిస్తున్న స్టార్టప్ సంస్థల్లో పెట్టుబడి పెడుతోంది. రూటెర్స్ స్పోర్ట్స్ టెక్నాలజీస్, క్రీడా విభాగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరిస్తోందని, అంతేగాక అంతర్జాతీయ మార్కెట్లో అడుగుపెట్టనుందని ప్రసాద్ వంగ వివరించారు. కొత్త వినియోగదార్లను సంపాదించేందుకు, కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ నిధులు వెచ్చిస్తామని రూటెర్స్ స్పోర్ట్స్ టెక్నాలజీస్ సీఈఓ పియూష్ తెలిపారు.

ఎంఎస్ఆర్ ఇండియాకు అవార్డు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఆర్ ఇండియాకు చెందిన 'డాక్టర్ కాపర్' బ్రాండు 'ఆసియాస్ గ్రేటెస్ట్ బ్రాండ్స్ అండ్ లీడర్స్' అవార్డుకు ఎంపికైంది. సింగపూర్‌లో జరిగిన ఆసియన్ బిజినెస్ అండ్ సోషల్ ఫోరమ్ సమావేశంలో ఈ అవార్డులు ఇచ్చారు. ఎంఎస్ఆర్ ఇండియా సీఈఓ డాక్టర్ ఎం.మల్లారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై అవార్డు అందుకున్నారు.

యూఎస్‌లో డాక్టర్ రెడ్డీస్ మరో ఔషధం

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ ప్రొపోఫోల్ ఇంజక్షన్‌ను యూఎస్ మార్కెట్లో విడుదల చేసింది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో (ఐసీయూ) ఉన్న రోగులకు అనస్థీషియా ఇవ్వదలచినప్పుడు ఈ ఇంజక్షన్‌ను ఇస్తారు. 'డిప్రివ్యాన్' అనే బ్రాండుతో ఈ ఔషధాన్ని యూఎస్‌లో ఫ్రీసెనైస్ కబీ యూఎస్ఏ అనే సంస్థ విక్రయిస్తోంది. దానికి జనరిక్ ఔషధంగా ప్రొపోఫోల్ ఇంజక్షన్‌ను డాక్టర్ రెడ్డీస్ రూపొందించింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు


(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2018–19	నికర లాభం/(నష్టం) 2017–18	మొత్తం ఆదాయం 2018–19	మొత్తం ఆదాయం 2017–18
జ్యోతి ల్యాబ్స్	48.41	37.28	441.27	413.54
కోల్గేట్ పామోలివ్	192.10	170.65	1107.26	1041.88
ఎన్ఐఐటీ	19.40	19.70	227.8	209.40
ఎడెల్‌వైజ్ ఫైనాన్షియల్	258.35	218.64	2790.69	2224.23
పీవీఆర్	55.38	29.16	857.37	560.46
పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్	303.00	229.50	2078.46	1416.21
స్టెరిలైట్ టెక్	145.60	90.09	1345.30	841.91
ఎంఫసిస్	277.90	214.90	1970.90	1660.60
కామధేను	5.42	4.12	242.00	305.00

నేటి బోర్డు సమావేశాలు: మారుతీ సుజుకీ, ఎల్అండ్‌టీ, డీహెచ్ఎఫ్ఎల్, గృహ ఫైనాన్స్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఎంఅండ్ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్, వండర్‌లా హాలీడేస్

24న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు			
హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా (ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	417
బెంగళూరు	415	చెన్నై	430
25వ తేదీకి...		చిత్తూరు	423
విజయవాడ/గోదావరి	417	నమక్కల్	420

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 380.95 (385.20) 3633336
ASIAN PAINTS 1401.85 (1396.55) 1562800
AXIS BANK LT 663.65 (661.60) 7013582
BAJAJ AUTO L 2651.65 (2674.10) 183566
BAJAJ FINANC 2635.65 (2634.35) 753856
BAJAJ FINSER 6407.30 (6493.15) 108993
BHARTI AIRTE 301.65 (303.70) 9363696
BHARTI INFRA 263.00 (277.00) 11122963
BPCL 353.95 (357.15) 1647059
CIPLA 500.70 (509.30) 1620195
COAL INDIA L 223.85 (225.55) 2838220
DR. REDDYS 2668.45 (2646.75) 611565
EICHER MOTOR 20115.60 (20089.15) 45723
GAIL 333.60 (334.20) 3384646
GRASIM IND 785.80 (782.15) 1009447
HCL TECH 946.45 (944.45) 1477391
HDFC 1971.10 (1958.25) 2194496
HDFC BANK 2102.25 (2105.40) 2527893
HERO MOTOCOR 2790.20 (2795.95) 240737
HINDALCO IND 205.05 (205.45) 3917176
HINDUSTAN UN 1759.50 (1767.20) 1350870
HPCL 243.10 (241.85) 4653823
ICICI BANK 364.80 (367.40) 17521254
INDIABULLS H 773.50 (778.70) 3186834
INDIAN OIL 136.80 (136.10) 6161313
INDUSINDBANK 1490.30 (1495.00) 1088512
INFOSYS LTD 732.00 (731.65) 7429783
ITC 278.90 (277.30) 28026449
JSW STEEL LT 283.65 (280.90) 3705336
KOTAK MAHIND 1267.75 (1276.50) 1459776
LARSEN & TOU 1295.35 (1301.45) 1654706
M&M 697.30 (695.85) 3891245
MARUTI SUZIK 7040.60 (7045.40) 520703
NTPC LTD 140.05 (140.75) 3541981
ONGC 141.70 (143.30) 3820645
POWER GRID C 186.75 (186.30) 3463363
RELIANCE IND 1247.45 (1226.30) 13155185
SBI 288.05 (286.65) 11532528
SUN PHARMA 423.00 (431.00) 18446490
TATA CONSULT 1901.55 (1875.60) 1962927
TATA MOTORS 175.40 (180.25) 13461254
TATA STEEL L 460.75 (464.60) 4790846
TECH MAHINDR 727.75 (720.70) 1849102
TITAN IND 969.65 (962.15) 1246903
ULTRATECH 3790.70 (3850.65) 808713
UPL LIMITED 747.35 (762.85) 2109205
VEDANTA LIMI 193.50 (192.80) 6195845
WIPRO 351.75 (351.55) 4230546
YES BANK LTD 215.40 (197.25) 127603904
ZEE ENTERTAI 433.85 (432.85) 6954715

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1258.35 (1293.20) 144809
ACC 1419.70 (1429.85) 343178
ADITYA BIRLA 89.45 (87.40) 1293180
AMBUJA CEMEN 211.20 (212.40) 1682064
ASHOK LEYLAN 84.80 (89.15) 31366207
AUROBIND PHA 788.80 (783.10) 1853657
AVENUE SUPER 1391.55 (1397.30) 338685
BANDHAN BANK 413.90 (414.20) 1169284
BANK OFBAROD 113.00 (111.30) 13283892
BEL 82.80 (83.90) 4472876
BHEL 69.05 (69.35) 6289323
BIOCON LTD 670.10 (670.65) 1514939
BOSCH LTD 19155.40 (19090.15) 9082
BRITANNIA 3216.85 (3203.85) 148520
CADILA HEALT 346.10 (342.05) 545629
COLGATE PALM 1321.90 (1307.25) 1359904
CONTAINER 664.05 (659.90) 305335
DABUR INDIA 430.40 (430.65) 1179389
DLF LIMITED 177.75 (177.25) 5827123
GENERAL INS 250.00 (247.70) 27942
GODREJ CONSU 790.60 (789.80) 506573
HAVELLS INDI 702.60 (696.20) 1172488
HDFC STAND L 361.20 (373.35) 1229942
HINDUSTAN ZI 257.95 (259.40) 359501
ICICI LOMBAR 848.40 (832.25) 80295
ICICI PRU LI 303.80 (305.40) 3408688
IDEA CELLULR 34.05 (33.90) 33984041
INTERGLOBE A 1178.55 (1109.30) 9697495
L&TFIN.HOLD 137.50 (136.60) 3490759
LIC HOUS.FIN 469.60 (466.95) 922672
LUPIN 868.40 (864.60) 701634
MARICO LIMIT 373.95 (376.55) 904818
MCDOWELL 571.75 (580.25) 4920065
MOTHERSON 154.05 (157.55) 5785444
MRF 64902.75 (66072.05) 4134
NHPC LTD 25.30 (25.25) 1370740
NMDC LTD 90.10 (89.90) 973709
OIL INDIA 170.00 (170.05) 693618
ORACLE FIN S 3796.40 (3769.65) 20813
P&G HYG&HEAL 9921.30 (9914.85) 1063
PETRONET LNG 226.30 (226.80) 1907820
PIDILITE IND 1109.35 (1131.45) 2220551
PIRAMAL ENTE 2307.75 (2357.85) 377837
SAIL 48.25 (48.55) 6284815
SBI LIFE INS 618.25 (620.00) 129335
SHREE CEMENT 16170.55 (16103.35) 27535
SHRIRAM TRAN 1114.55 (1088.05) 816136
SIEMENS 1027.95 (1045.00) 361633
SUN TV LTD 527.00 (529.45) 2113026
THE NEW INDI 179.00 (179.30) 11247

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 5.69 (5.42) 1810
AISHWARYA TE 2.99 (3.14) 5200
ALPHAGEO 470.05 (452.35) 1289
AMAR RAJA BA 775.35 (781.25) 10290
ANDHRA BANK 27 (27.20) 57594
ANDHRA CEMEN 5.10 (5.08) 5901
ANDHRA PAPER 432.65 (443.15) 1961
ANDHRA PETRO 59.75 (62.25) 94443
ANDHRA SUGAR 311.05 (314.70) 1593
ANJANI PORTL 119.75 (123) 1888
ASTRA MICROW 80.40 (80.60) 5004
AUROBINDO PH 787.80 (782.05) 75636
AVANTEL SOFT 222 (223.50) 453
AVANTI FEEDS 358.70 (362.55) 11838
AVON ORG 6.95 (6.65) 102100
BALAJI AMIN 480.30 (492.50) 884
BARTRONICS 6.74 (6.71) 11543
BHAGIRA CHEM 430 (438.95) 4260
BHAGYA NAG 34.80 (35.85) 1464
BRILLIANT SE 1.01 (1.04) 46692
CAMBRIDGE TE 45.40 (45.30) 112
CIL SECURI 15.15 (15.45) 2111
CONT COFFEE 273.75 (272.10) 623
COROMAN FERT 443 (435.20) 4165
CUBEX TUB 14.62 (14.95) 207
CYBERMATE 1.96 (1.90) 20540
CYIENT LIMIT 591.95 (598.40) 4313
DIVI'S LAB 1494.85 (1503.70) 12546
DIVYA GRANIT 102.90 (103.90) 9273
DR REDDY 2666.20 (2645.50) 29593
FOUR SOFT 37.85 (38.55) 705
GATI CORPN 76.40 (77.40) 43911
GAYATRI PROJ 166.40 (168.85) 1698
GMR INFRASTR 15.95 (16.15) 688059
GOLDST INFRA 238.10 (234.25) 14619
GOLDSTONE EN 13.70 (14.25) 13332
GRANULES (I) 96 (93.20) 314607
GSS AMERICA 117 (122.25) 92910
GVK POWER 6.87 (6.96) 123777
HBL NIFE POW 26.70 (26.90) 6211
HERITAGE FOO 515.85 (519.05) 1276
HIL LTD 1927.75 (1942) 454
IDL INDUSTRS 260.20 (264.90) 748
ILFS ENGINEE 12.75 (13.35) 16881
INCAP 38.85 (37) 1345
IVRCL INFRAS 0.96 (0.98) 41105
KAKATIYA CEM 188.35 (192.05) 806
KALLAM SPG 16.95 (17.65) 18716
KAVERI SEED 578 (555.75) 29702
KCP LTD 86.35 (86.80) 1430
KERNEX MICRO 25.65 (26.45) 2582
KNR CONSTRUC 210.55 (210.90) 9324
KREBS BIO 112.10 (112.85) 119
LANCO INDUS 181.45 (183.85) 1506
LAURUS LABS 376.75 (376) 205
LOKESH MACH 44.15 (44.80) 2684
MADHUCON PRO 6.73 (6.34) 1800
MEGA SOFT 7.08 (6.95) 12383
MIC ELECTRON 0.92 (0.96) 56905
MOLD-TEK.TEC 50.25 (52) 16481
MOLDTK PLA 262.90 (266.30) 1210
MSR INDIA LT 10.58 (10.57) 10046
NAGARJAGRICH 27.50 (27.10) 35
NATCO PHARMA 681.65 (685.20) 12374
NAVA BH VENT 111.65 (112.15) 9016
NCC 83.90 (85.45) 447680
NCL IND 126.30 (126.55) 236
NEHA INTER 4.30 (4.30) 35857
NETTLINX 44.65 (46.95) 7341
NEULAND LAB 504.95 (500.35) 8522
NIHAR INFO 11.40 (11.98) 90
NILE 348.30 (354) 3643
NORTHGATE TE 0.64 (0.61) 90028
OIL COUNTRY 14 (14.20) 2549
PANYAM CEMEN 11.92 (12.27) 4360
PENNER IND 37 (37.40) 16482
PHYTOCHEM I 43.10 (41.75) 3003
PIONEER DIST 164.80 (164.60) 820
PITTI LAMIN 55.85 (55.20) 10609
POKARNA 172.75 (168.95) 3248
PRAJAY ENGS 8.50 (8.25) 2356
PREMIER EXPL 252.80 (265.15) 16783
PRISM CEMENT 79.40 (80.90) 5710
PRUDENTL PHA 3.49 (3.57) 56695
RAASI REFRAC 17.27 (16.45) 1591
RAIN INDUSTR 119.45 (119.60) 31249
RAJ PACKAGIN 28.40 (27.05) 1014
RAM INFORMAT 41.45 (42.85) 1149
REG.CERAMIC 4.25 (4.47) 4450
SAGAR CEM 644 (632) 2
SAMKRG PIST 182.75 (187.30) 3397
SATVAH. ISPA 9.11 (9.55) 2700
SMS PHARMA 71.95 (72.30) 859
SOUTH BIO TE 1.94 (1.97) 526
SREE RAYAL A 36.50 (37.10) 190711
SRI KPR INDU 19 (19.45) 1800
SRINIVASA SH 41.45 (40) 200
STARCHIK SP 26 (26) 1465
STEEL EXCHAN 13.25 (13.75) 732
SUJANA METAL 0.38 (0.37) 200
SUJANA TOWER 1.26 (1.26) 1
SUJANA UNIVE 0.30 (0.31) 300
SURANA STRIP 1.36 (1.30) 100
SURANA TELE 4.05 (4.39) 13532
SURYALATA SP 127.50 (130) 200
SURYAVA SPIN 5.17 (5.44) 55
SUVEN PHARMA 202.10 (204.10) 25983
TAJ GVK HOTE 182.45 (181.45) 2961
TANLA 32.85 (29.90) 79375
TERA SOFTWAR 43.80 (45.70) 721
TRANS BIOTEK 5.81 (5.92) 21000
VAMSHI RUBB 31 (31.75) 220
VBC FERRO 38.50 (40.35) 276
VICEROY HOTE 3.83 (3.99) 20809
VIJAY GROWTH 9 (8.92) 140
VIJAY TEXTIL 40.25 (40.80) 2900
VIMTA LABS 265.40 (274.65) 6576
VISAKA IND 393.60 (412.15) 4635
VISTA PHARMA 27.20 (27.95) 10896
VIVIMED LABS 25.35 (25.65) 63422
VJIL CONSULT 38.95 (41) 586
VST INDUS 3208.50 (3135.85) 777
YBRANT DIGIT 3.03 (3) 37044
ZENOTECH LAB 32.40 (32.10) 4429
ZENTECH 85.55 (85) 32408

ఈనాడు బిజినెస్

కంపెనీల ఆఫర్ల ధోరణి మారిపోయింది. పండుగలు, స్వాతంత్ర్య దినం, గణతంత్ర దినోత్సవం వంటి సందర్భాల్లో గరిష్ఠ విక్రయ ధరలలో కొంతమేర రాయితీ ఇస్తూ, కొనుగోలుదార్లను ఆకర్షించేవారు. ఇప్పుడు ధర తగ్గింపు అంటూనే, తగ్గించిన మొత్తంలో కొంతభాగాన్ని నగదు వెనక్కి రూపేణ ఇస్తామని ప్రకటిస్తున్నారు. ఇలా వెనక్కి ఇచ్చే మొత్తం ఆయా సంస్థల మొబైల్ వాలెట్లలోకే చేరుతుంది. అంటే కొంతకాలం పాటు వినియోగదారులను తమ సంస్థకు తప్పనిసరి ఖాతాదార్లుగా మార్చుకుంటున్నాయి.

వదులుకోం.. మిమ్మల్ని

- వినియోగదార్లకు కంపెనీల తాయిలాలు
- నేరుగా రాయితీ కొంత.. నగదు వెనక్కి ఇంకొంత
- అది వాలెట్లలోనే సుమా
- గణతంత్ర ఆఫర్లు ఇలా

ఈనాడు వాణిజ్య విభాగం

గణతంత్ర దినోత్సవం (జనవరి 26) సందర్భంగా ఆఫర్లు ఇవ్వడాన్ని కొన్నేళ్లుగా విక్రయసంస్థలు సంప్రదాయంగా మార్చేశాయి. పైగా గత పండుగల సీజన్‌లో అమ్మకాలు ఆశించిన మేర జరగకపోవడంతో, ఈ సందర్భంగా అయినా కొనుగోలుదార్లను ఆకట్టుకునేందుకు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, డిజిటల్ వాలెట్లతో ఒప్పందం చేసుకుని, ఆఫర్లకు తెర దీశాయి. ఈ విధంగా విక్రయ సంస్థతో పాటు, ఆయా ఆర్థిక సంస్థలకూ వ్యాపారం పెరగడం ఒక ఎత్తయితే, కొనుగోలుదార్లు కొన్ని నెలలపాటు తమతో లావాదేవీ నిర్వహించేలా, విధానాలు రూపొందిస్తున్నాయి. మొబైల్ వాలెట్‌లలో జమయిన మొత్తంతో ఏదైనా కొనుగోలు చేసుకునే, బిల్లులు చెల్లించే వీలును కొన్ని సంస్థలు కల్పిస్తుంటే, తదుపరి కొనుగోళ్లకు నిర్దేశిత మొత్తాన్నే వాడుకునే వీలును మరికొన్ని సంస్థలు కల్పిస్తున్నాయి. విక్రయశాలలతో పాటు ట్రావెల్ పోర్టళ్లు కూడా ఇదే విధానాన్ని అవలంబిస్తున్నాయి. నిత్యావసరాల నుంచి గృహోపకరణాలు, దుస్తుల వరకు ఆయా ఆఫర్లు చూస్తే..



BIG BAZAAR

ఈనెల 27 వరకు గరిష్ఠ విక్రయధరలపై భారీ తగ్గింపు ఇస్తున్నామని సంస్థ ప్రకటించింది. దీనికి అదనంగా రూ.3,000, అంతకు మించి కొనుగోలు చేస్తే, ఫ్యూచర్‌పే వాలెట్‌కు 20 శాతం నగదు (గరిష్ఠంగా రూ.6,000) వెనక్కి వస్తుందని తెలిపింది. అయితే ఇది వెంటనే రాదు. ఫిబ్రవరి నుంచి జులై వరకు 6 నెలల పాటు సమాన వాయిదాల్లో వస్తుంది. అంటే రూ.3,000 పెట్టి కొనుగోలు చేసిన వారికి, 20 శాతంగా లభించే రూ.600ను 6 నెలల పాటు నెలకు రూ.100 చొప్పున జమ చేస్తారు. సంస్థ స్టోర్లలో కొనుగోళ్లకే దీన్ని వినియోగించాల్సి ఉంటుంది. ఇది కాక రూపే కార్డుపై కొనుగోలు చేస్తే, నేరుగా 10 శాతం రాయితీ లభిస్తోంది. పేటీఎంతో కొనుగోలు చేస్తే, చెల్లింపు మొత్తంపై 50 శాతం తిరిగి వస్తుందని ప్రకటిస్తోంది. అయితే ఇందులో కొంతమేర మాత్రమే నగదు రూపేణ పేటీఎం వాలెట్‌లోకి వస్తుంది. మిగిలింది సినిమా టికెట్ల వంటివి కొనుగోలు చేస్తే, వాటిపై ఆఫర్ రూపేణ లభిస్తుందన్నమాట. అంటే పేటీఎంతో పాటు ఇతర సంస్థలకూ వ్యాపార అవకాశాలు వచ్చినట్లే. ఫుడ్‌బజార్, ఎఫ్‌బీబీ, హైపర్‌సిటీ, ఇజోన్ స్టోర్లలోనూ ఇవే ఆఫర్లున్నాయి.

amazon

సెల్‌ఫోన్ల నుంచి దుస్తుల వరకు భారీ ఆఫర్లు ప్రకటించింది. అమెజాన్ పే ద్వారా చేసుకునే మొబైల్ రీఛార్జులపై రూ.50 వరకు, వినియోగ బిల్లుల చెల్లింపుపై రూ.10-1000 వరకు, బస్‌టికెట్లపై రెడ్‌బస్‌లో రూ.100 వరకు, ట్రావెల్‌యారీలో రూ.125 వరకు, విమాన టికెట్లపై రూ.600 వరకు నగదు వెనక్కి ఇస్తామని ప్రకటించింది. నిత్యావసర సరకుల విభాగమైన అమెజాన్ పాంట్రీలో రూ.1,500లకు కొనుగోలు చేస్తే, రూ.100 నగదు అమెజాన్‌పేకు జమవుతుంది. ఈనెల 31 వరకు ఈ ఆఫర్ ఉంది. సరకులు సరఫరా అయ్యాక, 72 గంటల్లోపు నగదు వెనక్కి ఇస్తామని తెలిపింది.

Flipkart

వివిధ రకాల ఉత్పత్తులపై 70 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు ఫ్లిప్‌కార్ట్ ప్రకటించింది. టీవీలు, గృహోపకరణాలపై వడ్డీ రహిత సులభ వాయిదాలకు తోడు, స్మార్ట్‌ఫోన్లను పరిమితకాలం లోపు తిరిగి ఇచ్చేసి, మరొకటి తీసుకునేందుకు, నిర్దేశిత ధర చెల్లిస్తామని తెలిపింది.

abhibus

బస్ టికెట్లతో పాటు హోటల్ గదుల బుకింగ్ పైనా రాయితీ, తమ అభిక్యాష్ వాలెట్‌లోకి కొంత, పేపాల్ వాలెట్‌తో చెల్లిస్తే ఆ వాలెట్‌లోకి మరి కొంత నగదు వాపసు ఇస్తామని ప్రకటించింది. తదుపరి టికెట్ల కొనుగోలుకు అభిక్యాష్ వాలెట్‌లోని మొత్తంలో తడవకు 5 శాతం (గరిష్ఠంగా రూ.25-50) మాత్రమే వినియోగించుకోవచ్చు.

Big C

పలు కంపెనీల స్మార్ట్‌ఫోన్లపై వడ్డీలేని సులభ వాయిదాలు, హెచ్‌డీఎఫ్‌సీ కార్డులపై 10 శాతం వరకు నగదు వెనక్కి ఇస్తున్నట్లు సంస్థ తెలిపింది. కొన్ని స్మార్ట్‌ఫోన్లపై రూ.1, 26, కే నాణ్యమైన స్క్రీన్‌గార్డ్, బ్లూటూత్ వంటివి ఇస్తున్నట్లు ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్‌కు అవసరమైన రూ.3500 విలువైన స్క్రీన్‌గార్డ్, బ్యాక్‌కవర్, పవర్‌బ్యాంక్, బ్లూటూత్ వంటివి రూ.1950కే అందిస్తున్నట్లు వివరించింది. ఫీచర్‌ఫోన్లను బండిల్‌గా రూ.1950కి ఇస్తున్నామని తెలిపింది.

PhonePe

బిల్లుల చెల్లింపుపై అపోలో, మోర్ విక్రయశాలల్లో రూ.75 వరకు, పాంటలూన్స్‌లో రూ.100, స్పెన్సర్‌లో 4 లావాదేవీలపై రూ.100, కేఎఫ్‌సీ-మెడ్‌ప్లస్‌లలో 10 లావాదేవీలపై రూ.300 వరకు, ఫార్మ్ఈజీలో రూ.350 వరకు, ట్రావెల్‌యారీలో 25 శాతం నగదు వెనక్కి ఇస్తున్నట్లు ప్రకటించింది. మెట్రో క్యాష్‌అండ్‌క్యారీలో రూ.2,000కు మించిన బిల్లులపై రూ.100, సాధారణ విక్రయశాలల్లో 10 సార్లు చెల్లిస్తే రూ.100 పొందవచ్చు.


redBus

బస్ టికెట్లు, హోటల్ గదుల బుకింగ్, షిరిడీ-తిరుపతి-రామేశ్వరం పుణ్యక్షేత్రాలకు బస్సు, హోటల్ గది, దర్శనం టికెట్ ప్యాకేజీలపైనా 15 శాతం రాయితీ ప్రకటించింది. అమెజాన్ పే, ఫ్రీచార్జ్ వాలెట్లతో పాటు రెడ్‌బస్ వాలెట్‌లోకీ నగదు వెనక్కి ఇచ్చే పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపింది.

happi

వడ్డీలేని సులభ వాయిదాలతో పాటు పేటీఎం ద్వారా చెల్లింపులపై 20 శాతం నగదు వెనక్కి ఇస్తున్నట్లు సంస్థ తెలిపింది. పేటీఎంలో జమయ్యే నగదుతో, ఏమైనా కొనుగోలు చేసుకోవచ్చని, బిల్లులూ చెల్లించుకోవచ్చని ప్రకటించింది. కొన్ని మోడళ్లపై సూట్‌కేస్, వాక్యూమ్‌క్లీనర్, ఐబాల్ బ్యారెల్ వంటివి ఇస్తున్నామని వివరించింది.

టాటా మోటార్స్ ప్యాసింజర్ కార్ల ప్రెసిడెంట్ మయాంక్



బీఎస్-VI కు మారడం భారమే

తెలుగు రాష్ట్రాల్లోకి హారియర్

ఈనాడు - హైదరాబాద్

వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి దేశంలో భారత్ స్టేజ్ (బీఎస్)- 6 వాహనాలే అందుబాటులో ఉండాలనే నిబంధన వాహన సంస్థలకు సవాలేనని టాటా మోటార్స్ ప్యాసింజర్ కార్ల వ్యాపార విభాగం ప్రెసిడెంట్ మయాంక్ పరీఖ్ అన్నారు. వాహన సంస్థలు ఈ ప్రమాణాలను అందుకునేందుకు తీవ్రంగా కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు. మార్చి 31, 2020 తర్వాత బీఎస్ 4 వాహనాలను రిజిస్ట్రేషన్ చేయకూడదని సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఆలోపే ఈ వాహనాలన్నింటినీ విక్రయించాల్సిందేనని, ఇది కాస్త ఇబ్బందికరమైన పరిణామమేనని అభిప్రాయపడ్డారు. ఇది అమల్లోకి వచ్చిన తర్వాత మోడళ్లను బట్టి, పెట్రోలు వాహనాల మీద కనీసం రూ.20,000 వరకూ, డీజిల్ కార్లపై రూ.1,00,000 వరకూ భారం ఉండవచ్చన్నారు. టాటా మోటార్స్ తన మోడళ్లలో కొన్నింటిని బీఎస్ 6కు మారుస్తుందనీ, కొన్ని మోడళ్లను నిలిపివేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏయే మోడళ్లను ఆపేసేది ఇప్పుడే చెప్పలేమన్నారు. గురువారం హైదరాబాద్‌లో టాటా మోటార్స్ ప్రీమియం మధ్య శ్రేణి స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) హారియర్‌ను తెలుగు రాష్ట్రాల విపణిలోకి ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా మయాంక్ పారీక్ మాట్లాడుతూ.. మొత్తం కార్ల విభాగంలో ఎస్‌యూవీలకు 24 శాతం వాటా ఉందనీ, ఇది ఏటా 20శాతం వృద్ధి చెందుతుందన్నారు. మధ్య శ్రేణి ఎస్‌యూవీల్లో ఏటా సగటున 17శాతం వృద్ధి కనిపిస్తోందని చెప్పారు. ప్రీమియం మధ్య శ్రేణి విభాగంలో తమ వాటాను పెంచుకోవడానికి హారియర్ దోహదం చేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరు నాటికి మొత్తం ప్రయాణికుల కార్ల విభాగంలో 4.4శాతం మాత్రమే వృద్ధి కనిపించిందని మయాంక్ చెప్పారు. పండగల వేళ కూడా కార్ల అమ్మకాలు జోరుగా సాగలేదని పేర్కొన్నారు. కేరళలో వరదలు, నగదు కొరత వల్ల రుణాలు వేగంగా లభించకపోవడంలాంటివి ఇందుకు కారణాలుగా విశ్లేషించారు. టాటా మోటార్స్ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ 22.4శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. మూడేళ్ల క్రితం టాటా మోటార్స్‌కు ప్రయాణికుల కార్ల విభాగంలో 2.8 శాతం వాటా ఉండగా. . ఇప్పుడది 6.8శాతానికి చేరిందన్నారు. ప్రస్తుతం కార్ల మార్కెట్లో 60శాతం విభాగాల్లోనే తాము పోటీ పడుతున్నామని, 2021-22 నాటికి 90శాతం విభాగాల్లో ఉంటామని చెప్పారు. అందుకు అనుగుణంగా 12-14 మోడళ్లు తీసుకురాబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు తర్వాత మరో కాన్సెప్ట్ కారును తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు.

విద్యుత్ వాహనాల తయారీకి కావాల్సిన సాంకేతికత తమ వద్ద అందుబాటులో ఉందని, దేశంలో విద్యుత్ ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు విషయంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఈఈఎస్ఎల్‌కు కొన్ని విద్యుత్ కార్లను అందించినట్లు పేర్కొన్నారు. దేశంలో అత్యధిక పన్ను చెల్లించడంతో పాటు, ఉపాధి కల్పిస్తోన్న వాహన రంగానికి కొన్ని మినహాయింపులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు, ఈ బడ్జెట్‌లో ఏదైనా హామీ లభిస్తుందా అని ఎదురు చూస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతోపాటు విద్యుత్ వాహనాల విషయంలోనూ ప్రభుత్వం కొంత స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే మాకూ ఏం చేయాలి? ఎలా చేయాలి అనేది అవగాహన వస్తుందని పేర్కొన్నారు.

నానో ఇక ఉండకపోవచ్చు

ఆశించిన స్థాయిలో గిరాకీ లేకపోవడం, ఎప్పటికప్పుడు కార్ల భద్రతా ప్రమాణాల్లో మార్పులు వస్తుండటం తదితర కారణాలతో మధ్య తరగతి లక్ష్యంగా వచ్చిన రతన్ టాటా కలల కారు 'నానో' భవిష్యత్తులో అందుబాటులో ఉండకపోవచ్చు. భారత్ స్టేజ్ 6కు దీన్ని అభివృద్ధి చేసే దిశగా అదనపు పెట్టుబడి పెట్టేందుకు టాటా మోటార్స్ సిద్ధంగా లేదు. 'కొన్ని కార్లను బీఎస్ 6 ప్రమాణాలకు తగ్గట్లు అభివృద్ధి చేయడం లేదు. అందులో నానో ఒకటి' అని మయాంక్ పారీక్ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొన్ని మోడల్స్‌ను నిలిపివేయడం సాధారణ విషయమేనని, ఇండికా, ఇండిగో, విస్టా ఇలా కొన్ని మోడళ్లను ఆపేసిన సంగతిని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 2009లో రూ.1,00,000 కారుగా మార్కెట్లోకి వచ్చిన నానో ఉత్పత్తిని సంస్థ క్రమంగా తగ్గిస్తూ వచ్చింది. అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం చివరగా గత ఏడాది జూన్‌లో గుజరాత్‌లోని సనంద్ ప్లాంటులో ఒకే ఒక నానో కారును ఉత్పత్తి చేసింది.

భారత ఉద్యోగులపై ఎందుకీ వివక్ష?

- అమెరికన్లతో పోలిస్తే 25 శాతం తక్కువ వేతనం
- ఒరాకిల్‌పై అమెరికా కార్మిక శాఖ ఆరోపణలు

బెంగళూరు: అమెరికాకు చెందిన కంపెనీ ఒరాకిల్‌పై ఆ దేశ కార్మిక శాఖే ఆరోపణలు చేసింది. కంపెనీలోని భారత, ఆసియా, ఆఫ్రికా ఉద్యోగులకు అదే హోదాలో పనిచేసే శ్వేత జాతీయులు లేదా ఆసియాయేతర ఉద్యోగులతో పోలిస్తే 25 శాతం తక్కువ వేతనమిస్తున్నారని తెలిపింది. అమెరికా కార్యకలాపాల్లో.. ఉత్పత్తి అభివృద్ధికి సంబంధించిన కీలక పాత్రలను ఇవ్వడానికి ఆసియావాసుల్లో భారతీయులకు ఆ కంపెనీ ప్రాధాన్యమిస్తోందని వివరించింది. అయితే వేతనం ఇవ్వడంలో మాత్రం వివక్ష చూపుతున్నారని అమెరికా కార్మిక శాఖకు చెందిన 'ఆఫీస్ ఆఫ్ ద ఫెడరల్ కాంట్రాక్ట్ కాంప్లియన్స్ ప్రోగ్రామ్స్'(ఓఎఫ్‌సీసీపీ) తన ఫిర్యాదులో పేర్కొంది. ఒక క్రమపద్ధతిలో మహిళలు, నల్లజాతీయులు, ఆసియావాసులకు తక్కువ జీతం వచ్చేలా చేస్తున్నారని అందులో స్పష్టం చేసింది. అమెరికాలోని రెడ్‌వుడ్ షోర్స్‌లోని కంపెనీ ప్రధానకార్యాలయంలో జరిపిన దర్యాప్తు అనంతరం ఈ ఫిర్యాదును లేవనెత్తినట్లు తెలుస్తోంది.

వేతన రూపంలో రూ.2,800 కోట్ల నష్టం

ఒరాకిల్ ఇండియా ఈ పరిణామంపై వ్యాఖ్యానించడానికి నిరాకరించింది. జనవరి 2013-డిసెంబరు 2016 మధ్య శ్వేతజాతీయేతరులు వేతనాల రూపంలో 400 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.2800 కోట్లు) మేర కోల్పోయినట్లు ఆ ఫిర్యాదు వెల్లడిస్తోంది. వివక్షకు గురైన ఆసియా జాతీయుల సంఖ్య 11,000గా ఉందని తెలుస్తోంది. భారత్‌లో ప్రాంగణ నియామకాల ద్వారా ఒరాకిల్ ఇంజినీర్లను నియమించుకుంటుందని కూడా అందులో తెలిపింది.

దేశీయ అలీబాబా.. రిలయన్స్

- అమెజాన్, వాల్‌మార్ట్‌లకు దీటుగా
- బ్రోకరేజీ సంస్థ యూబీఎస్ అంచనా

దిల్లీ: పెట్రో రసాయనాల వ్యాపారం నుంచి టెలికాం, రిటైల్ రంగంలో దూసుకెళ్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్, దేశీయ వినియోగదారుల దిగ్గజ సంస్థగా అవతరిస్తుందని బ్రోకరేజీ సంస్థ యూబీఎస్ అంచనా వేసింది. ఇ కామర్స్ రంగంలోకీ ప్రవేశిస్తున్నందున, చైనా ఆన్‌లైన్ దిగ్గజం అలీబాబా తరహాలో దేశీయంగా అతిపెద్ద రిటైల్ సంస్థగా ఏర్పడి, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు దీటుగా మారుతుందని పేర్కొంది.

దేశంలోని 6,500 పట్టణాలు, నగరాలలో 10,000కు పైగా రిలయన్స్ రిటైల్ విక్రయశాలలు ప్రస్తుతం నడుస్తున్నాయి. ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభించనున్న రిలయన్స్ ఇండస్ట్రీస్, వీటన్నిటితో పాటు సమీపంలోని సాధారణ దుకాణాలను కూడా అనుసంధానించాలని ప్రణాళిక ఏర్పరచుకుంది. ఇక రిలయన్స్ జియోకు 28 కోట్ల మందికి పైగా చందాదార్లున్నారు. అందువల్ల టెలికాం/ప్రసార మాధ్యమాల రంగాల్లో మార్కెట్ అగ్రగామిగా ఎదిగే వీలు రిలయన్స్‌కు ఉందని, రిటైల్/ఇకామర్స్‌లోనూ గణనీయ వాటా చేజిక్కించుకుంటుందని యూబీఎస్ అభిప్రాయ పడింది. రిటైల్ స్టోర్లు ఉండటం, తగిన వ్యూహాలు-వ్యవస్థలను సిద్ధం చేసుకోవడం, దేశీయ సంస్థ కావడం రిలయన్స్‌కు ఉపకరిస్తాయని, 300 బేసిస్ పాయింట్ల మార్కెట్ వాటాను అధిక వృద్ధితో సాధిస్తుందని పేర్కొంది. చైనాలో అలీబాబా కూడా ఇలానే ఎదిగిందని పేర్కొంది. అమెజాన్ విజయవంతానికి ఆ సంస్థ నిర్వహించే ప్రైమ్ సభ్యత్వం తోడ్పడుతోందని, రిలయన్స్ జియో కూడా ఇదే చేసిందని గుర్తు చేసింది. రెండున్నరేళ్లలోనే అగ్రగామి సంస్థల్లో ఒకటిగా నిలవడం ద్వారా, పెట్టుబడిదార్లకు జియో ఆశ్చర్యం కలిగిస్తోందని యూబీఎప్ తెలిపింది.



కొత్తసారథి రవ్‌నీత్ గిల్



యెస్ బ్యాంక్ ఎండీ, సీఈఓగా నియామకం

ముంబయి

ప్రైవేట్ రంగ యెస్ బ్యాంక్ తదుపరి మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా రవ్‌నీత్ సింగ్ గిల్ నియమితులయ్యారు. ప్రస్తుతం గిల్ డాయిష్ బ్యాంక్ ఇండియా హెడ్‌గా వ్యవహరిస్తున్నారు. యెస్ బ్యాంక్ వ్యవస్థాపక సీఈఓ రాణా కపూర్ స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. రాణా కపూర్ పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. కొత్త ఎండీ, సీఈఓగా రవ్‌నీత్ సింగ్ నియామకానికి ఆర్‌బీఐ ఆమోదం తెలిపిందని, మార్చి 1 లేదా అంతకంటే ముందే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని యెస్ బ్యాంక్ తెలిపింది. బాధ్యతల మార్పిడిని ఖరారు చేసేందుకు ఈ నెల 29న బోర్డు భేటీ కానుందని వెల్లడించింది. రాణా కపూర్ పదవీకాలం పొడిగింపునకు గతేడాది సెప్టెంబరులో ఆర్‌బీఐ అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. జనవరి 31లోగా బ్యాంక్‌ను వీడాలని కపూర్‌ను ఆర్‌బీఐ ఆదేశించింది. ఇందుకు గల కారణాలను ఆర్‌బీఐ వెల్లడించనప్పటికీ.. గత రెండేళ్లలో బ్యాంక్ మొండి బకాయిలు పెరగడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇవే కారణాలతో యాక్సిస్ బ్యాంక్‌లో సైతం మేనేజ్‌మెంట్ స్థాయి మార్పులు చేపట్టింది.

ఎవరీయన..: రవ్‌నీత్ సింగ్ గిల్ ప్రస్తుతం డాయిష్ బ్యాంక్ ఇండియా హెడ్‌గా వ్యవహరిస్తున్నారు. 1991 నుంచి ఆయన డాయిష్ బ్యాంక్‌లో కొనసాగుతున్నారు. బ్యాంకింగ్ పరిశ్రమలో గిల్ దాదాపు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. 1991లో డాయిష్ బ్యాంక్ ప్రైవేట్ వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలో చేరిన ఆయన.. 1993లో కార్పొరేట్ బ్యాంకింగ్ విభాగానికి మారారు. క్యాపిటల్ మార్కెట్లు, ట్రెజరీ సొల్యూషన్ల విభాగాలకు నేతృత్వం వహించారు. గిల్ సామర్థ్యాన్ని గుర్తించిన బ్యాంక్.. 2012లో కంట్రీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పదోన్నతి కల్పించింది. హిందు కాలేజీ, దిల్లీ విశ్వవిద్యాలయం నుంచి గిల్ మాస్టర్స్ డిగ్రీ పొందారు. తండ్రి బాటలోనే తొలుత సివిల్స్‌కు వెళ్దామని భావించిన ఆయన, తర్వాత మనసు మార్చుకుని బ్యాంకింగ్‌లోకి అడుగుపెట్టారు. వివిధ దశలో అనేక మంది పరిశ్రమ ప్రముఖులు తనకు దిశానిర్దేశం చేశారని గిల్ చెప్పారు. రాయల్ సుందరం మాజీ ఎండీ, సీఈఓ అజయ్ బింబెట్, డాయిష్ బ్యాంక్ సహ సీఈఓలు ఎస్ఎన్ కపూర్, రవిసింగ్, అన్షుసింగ్, జుర్గెన్ ఫిషెన్‌లతో పాటు హేమేంద్ర కొఠారీ, దీపక్ పరేఖ్ వంటి వారి నుంచి ఆయన స్ఫూర్తి పొందారు.

క్రికెట్‌కు వీరాభిమాని

యెస్ బ్యాంక్ కొత్త సీఈఓ క్రికెట్‌కు వీరాభిమాని కావడం గమనార్హం. ఆయన పోటీ క్రికెట్ సైతం ఆడారు. ఆయనకు చాలా మంది క్రికెటర్లతో పరిచయాలు ఉన్నాయి. కపిల్ దేవ్‌కు పెద్ద అభిమాని అయిన గిల్.. టెండూల్కర్, ధోనీ, సెహ్వాగ్, ద్రవిడ్, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లిలను అభిమానిస్తారు. ప్రస్తుతం ఇండస్ఇండ్ బ్యాంక్ ఎండీ, సీఈఓ రమేశ్ సోబ్తి ఆయన కుటుంబ సన్నిహితుల్లో ఒకరు. 90ల్లో దిల్లీలోని ఒక క్రికెట్ గ్రౌండ్‌లో గిల్‌ను తొలిసారిగా సోబ్తి కలిశారు. సోబ్తి ఏఎన్‌జడ్ గ్రిండ్లే టీమ్‌కు ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ కాగా.. గిల్ డీబీ జట్టు ఫాస్ట్ బౌలర్. 'గిల్‌ను మర్చిపోలేం. ఆయన బౌలింగ్ చాలా ప్రమాదకరంగా ఉండేది. ఏమరుపాటుగా ఉంటే గాయాలు తప్పేవీ కావు' అని సోబ్తీ ఒక ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌తో గిల్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడేవారు. చాలా రోజులు పాటు వీరి కుటుంబాలు సమీపంలోనే ఉండేవి. ఐపీఎల్‌ను సైతం గిల్ బాగా ఇష్టపడతారు. ఐపీఎల్‌లో సొంత టీమ్ లేనందుకు కొన్నిసార్లు చింతించారు కూడా.

తగ్గిన లాభం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రైవేటు రంగానికి చెందిన యెస్ బ్యాంక్ రూ.1,001.85 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.1,076.87 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 7 శాతం తక్కువ. సమీక్షిస్తున్న త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 41.2 శాతం పెరిగి రూ.2,666.4 కోట్లకు చేరింది. మొత్తం ఆడ్వాన్సులు 42.2 శాతం వృద్ధి చెంది రూ.2,43,885 కోట్లకు పెరిగాయి. మొత్తం స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 1.72 శాతం నుంచి 2.1 శాతానికి చేరాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.93 శాతం నుంచి 1.18 శాతానికి పెరిగాయి. ఫలితంగా కేటాయింపులు రూ.550.2 కోట్లుగా నమోదయ్యాయి.

దూసుకెళ్లిన షేరు

యెస్ బ్యాంక్ వారసుడిగా గిల్ నియామకం నేపథ్యంలో బ్యాంక్ షేరు దూసుకెళ్లింది. ఇంట్రాడేలో 19 శాతం దూసుకెళ్లిన షేరు రూ.234.90 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 8.39 శాతం లాభంతో రూ.213.85 దగ్గర స్థిరపడింది. బ్యాంక్ మార్కెట్ విలువ రూ.3,839.42 కోట్లు పెరిగి రూ.49,460.42 కోట్లకు చేరింది.

పరిశ్రమల ఏర్పాటులో బీసీలకు కోటా

- బ్యాంకులపై ఆధారపడకుండా ఆర్థిక సాయం
- తెదేపాకు వెన్నెముక వెనకబడిన వర్గాలే
- నాలుగున్నరేళ్లలో రూ.40 వేల కోట్లు వెచ్చించాం
- ఎన్నికల ప్రణాళికలో మరిన్ని వరాలు
- 'జయహో బీసీ' సన్నాహక సమావేశంలో సీఎం చంద్రబాబు



గురువారం ఉండవల్లిలోని ప్రజావేదికలో జరిగిన జయహో బీసీ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబును భారీ పూలదండతో సన్మానిస్తున్న బీసీ నాయకులు

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసే సూక్ష్మ మధ్యతరహా పారిశ్రామిక పార్కు (ఎంఎస్ఎంఈ)ల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్లు వర్తింపజేసి పరిశ్రమలు ఏర్పాటుచేయించే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీనిచ్చారు. 'వ్యవసాయం చేసేవారు కూడా ఇక్కడ చిన్న పరిశ్రమలు పెట్టి వస్తువులు తయారు చేసుకోవచ్చు. రాయితీలు ఎంతివ్వాలో ఆలోచిస్తున్నాం. బ్యాంకులపై ఆధారపడకుండా మిమ్మల్ని ఆదుకుంటాం' అని వివరించారు. 'బీసీలను ఆర్థికంగా పైకి తేవాల్సిన అవసరం ఉంది. దీనికి కొలమానమే లేదు. అధిక రాయితీలిస్తాం. ఏ పని చేస్తామంటే అది కల్పిస్తాం' అని పేర్కొన్నారు. ఈ నెల 27న రాజమహేంద్రవరంలో 'జయహో బీసీ' సదస్సు జరగనున్న నేపథ్యంలో సన్నాహక సమావేశం గురువారం ఉండవల్లి ప్రజావేదికలో జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 32 బీసీ సంఘాల నేతలు దీనికి హాజరయ్యారు. 'ఎంఎస్ఎంఈ పార్కుల్లో తయారయ్యే వస్తువులకు మార్కెటింగ్, బ్రాండింగ్, ప్యాకింగ్ బాధ్యతను తీసుకునే సరికొత్త వ్యవస్థను ఏర్పాటుచేస్తాం. స్థానిక మార్కెట్‌లో విక్రయించుకోవడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌కు చేర్చేలా ప్రోత్సహిస్తాం' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'బీసీల రుణం తీర్చుకునేందుకు నాలుగున్నరేళ్లలో రూ. 40వేల కోట్లు వెచ్చించాం. ఇది ప్రారంభం మాత్రమే. ఎన్నికల ప్రణాళిక(మేనిఫెస్టో)లో మరిన్ని వరాలు ప్రకటిస్తాం' అని వెల్లడించారు.

బీసీలే వెన్నెముక

'తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక. కొన్ని వర్గాలు కొన్నిసార్లే తెదేపాకు ఓటేశాయి. బీసీలు మాత్రం ఎప్పుడూ ఆదరిస్తున్నారు. నేను సీఎంగా ఉండటానికి వారే కారణం' అని ముఖ్యమంత్రి వివరించారు. 'బీసీలను మరచిపోతే నన్ను నేను మరిచిపోయినట్లే. మీరే నాకు అధిష్ఠానం. మీరు ఏది బాగుంటుందో చెబితే ఆచరణకు పరిశీలించి అమలుచేయడమే నా సిద్ధాంతం' అని స్పష్టం చేశారు. సమాజానికి నిజమైన సేవకులైన బీసీలకు తగిన గుర్తింపు ఉండాలని పేర్కొన్నారు. తెదేపా వాళ్లనే కక్షతో గత ప్రభుత్వాలు బీసీలకు ఏమీ చేయలేదని ధ్వజమెత్తారు. గతంలో ఆదరణ పథకం తెస్తే వైఎస్ హయాంలో రద్దు చేశారని గుర్తుచేశారు. బీసీ ఫెడరేషన్లకు రూపాయి ఇవ్వకుండా అవమానించారని గుర్తుచేశారు. వెనకబడిన వర్గాలు అండగా ఉన్నంతవరకు తెదేపాను ఏ శక్తీ ఏమీ చేయలేదని సీఎం ధీమా వ్యక్తంచేశారు.

ఎక్కువ లబ్ధి బీసీలకే

'పసుపుకుంకుమ కింద స్వయంసహాయక సంఘాల సభ్యులకు రూ.10వేల చొప్పున ఇచ్చాం. ఫిబ్రవరిలో మరో రూ.10వేలు ఇస్తున్నాం. అంటే ఒక్కో మహిళకు రూ.20వేలు ఇచ్చినట్లవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే రూ.22 వేల కోట్లు అందిస్తున్నాం. ఇందులో సగానికిపైగా లబ్ధిదారులు బీసీలే. పింఛను పొందే 54 లక్షల మందిలో 25 లక్షల మంది బీసీలే' అని చంద్రబాబు గుర్తు చేశారు. 'చంద్రన్న బీమా, పెళ్లికానుక వంటి పథకాలతోపాటు అన్నక్యాంటీన్ల ద్వారా ప్రజాసేవ చేస్తున్నాం. గర్భిణులకు సీమంతాలు చేస్తున్నాం. ఆదరణ-2 ప్రారంభించి 600 రకాల ఆధునిక పనిముట్లు ఇస్తున్నాం. ప్రపంచంలో ఉన్న ఆధునిక పరికరాలన్నీ అందుబాటులో ఉంచుతాం. నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూ ఆదాయం పెంచుకోవాలి' అని సూచించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద రూ.5లక్షలు ఇస్తామన్నారు. అత్యంత వెనకబడిన తరగతులకు 11 ఫెడరేషన్లను ఏర్పాటుచేసి ప్రత్యేక గుర్తింపు తేవడంతో పాటు ఎంబీసీలకు కార్పొరేషన్ పెట్టి రూ.100 కోట్లు కేటాయించామని తెలిపారు.

ఎన్నికల ప్రణాళికలో ఇంకెన్నో

విద్యారంగంలో అందరికంటే ఎక్కువ గురుకులాలు బీసీలకు అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి హామీనిచ్చారు. 'స్థానిక సంస్థల్లో ఏబీసీడీ వర్గీకరణ ఆచరణ సాధ్యమో కాదో పరిశీలిస్తాం. సంచార జాతులను ఎలా ఆదుకోవాలనే అంశంపై వచ్చిన సూచనలను అధ్యయనం చేయిస్తాం. ఫెడరేషన్లన్నీ కలిపి కార్పొరేషన్ చేయడంపై ఆలోచిస్తాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యాదవ, కురమ, చేనేత, శెట్టిబలిజ కార్పొరేషన్ల ఏర్పాటుతోపాటు 50ఏళ్లు దాటిన నాయీబ్రాహ్మణులకు పింఛన్ల మంజూరుపై సానుకూలంగా స్పందించారు. 'ఒక వర్గం నుంచి మరో వర్గంలోకి మార్చే విషయంలో చర్చ జరగాలి. పేదలకు ప్రాధాన్యమిచ్చి రిజర్వేషన్లు కల్పించాలి' అని పేర్కొన్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేయాలనుకుంటున్నారు..

తెలంగాణతో సమానంగా ఆంధ్రప్రదేశ్ ఎదగాలంటే 15 ఏళ్లు శ్రమించాల్సి ఉందని చంద్రబాబు గుర్తు చేశారు. కోడి కత్తి పార్టీతో జట్టుకట్టిన హైదరాబాద్ మోదీ రాష్ట్రానికి అన్యాయం చేయాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

మూడు విడతల్లో పసుపు కుంకుమ-2 సాయం

స్వయంసహాయక సంఘాలకు పసుపుకుంకుమ-2 కింద ఒక్కో సభ్యురాలికి మూడు విడతల్లో మొత్తం రూ.10 వేలను ప్రభుత్వం అందజేయనుంది. దీన్ని శుక్రవారం విజయవాడ, విశాఖపట్నం, కడపలో నిర్వహించే ప్రాంతీయ స్వయంసహాయక సంఘాల సదస్సుల్లో ముఖ్యమంత్రి ప్రకటిస్తారు. ఫిబ్రవరి 5న రూ.2,500, మార్చి 5న మరో రూ.2,500, 25న మిగిలిన రూ.5 వేలు సభ్యుల బ్యాంకుఖాతాల్లో జమ కానున్నాయి. సభ్యులకు స్మార్ట్‌ఫోన్లపైనా ముఖ్యమంత్రి ప్రకటన చేయనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జయహో బీసీ సభ వేదిక ఏర్పాట్లు

జయహో బీసీ సభకు ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈనెల 27న నిర్వహించనున్న జయహో బీసీ సభకు తెదేపా నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు మూడు లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో భారీ వేదికను నిర్మిస్తున్నారు. వచ్చేవారికి ఆహారం, మజ్జిగను అందించేందుకు 1500 మంది వలంటీర్లను నియమించారు. 27వ తేదీ మధ్యాహ్నం చంద్రబాబు నేరుగా కళాశాలలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. మూడింటినుంచి ఆరింటి వరకు సభ జరుగుతుంది.

బీసీల మధ్య చిచ్చుకు వైకాపా, భాజపా యత్నం

- మంత్రి కాలవ ఆరోపణ

ఈనాడు, అమరావతి: వైకాపా, భాజపాలు బీసీల మధ్య చిచ్చుపెట్టాలని ప్రయత్నిస్తున్నాయని ఆ పార్టీలు బీసీ వ్యతిరేకులని మంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 27న నిర్వహించనున్న జయహో బీసీ సదస్సుకు సన్నాహంగా బీసీ సంఘాలతో ఉండవల్లిలో గురువారం నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్.రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న కాలంలో బీసీ సామాజిక వర్గాలు అణచివేతకు గురయ్యాయన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటున్నామని తెలిపారు. 2004-2009 కాలంలో బీసీలకు ఎన్ని నిధులు ఖర్చు చేశారో అంతకంటే ఎక్కువ మొత్తం ప్రస్తుతం 13 జిల్లాల్లోనే ఇచ్చామన్నారు. బీసీ సామాజిక వర్గాలకు ఏర్పాటు చేసిన సమాఖ్యలను కార్పొరేషన్‌లుగా మార్పు చేయాలని, మరికొన్ని బీసీ సామాజిక వర్గాలకు కొత్తగా సమాఖ్యలు, కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని దీనిపై బీసీ సభలో సీఎం నిర్ణయం ప్రకటిస్తారని వెల్లడించారు. తెదేపా నుంచి బీసీలను ఏ దుష్టశక్తి దూరం చేయలేదని తెలిపారు.

రేపు, ఎల్లుండి కోస్తాలో వడగండ్ల వాన!

ఈనాడు, విశాఖపట్నం: కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా శని, ఆదివారాల్లో ఉరుములు, మెరుపులతో వడగండ్ల వానలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. రాయలసీమలో శనివారం నుంచి 29వ తేదీ వరకు అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపారు. రాష్ట్రం మీదుగా బంగాళాఖాతంలో ఏర్పడిన పరిస్థితులే దీనికి కారణమని విశ్లేషించారు. దక్షిణ బంగాళాఖాతంలోని మధ్యప్రాంతంతో పాటు భూమధ్యరేఖ వెంబడి ఉన్న హిందూమహాసముద్రంలో అల్పపీడనం కొనసాగుతోందని చెప్పారు. ఇది సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనంతో కలిసి ఉందని తెలిపారు. నైరుతి బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు తీరం వెంబడి ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనపడిందని వెల్లడించారు.

మూడేళ్లుగా ఫిర్యాదులేమీ లేవు..

- అధిక రుసుములపై హైకోర్టుకు తెలిపిన ఇంటర్మీడియెట్ బోర్డు

ఈనాడు, అమరావతి: కళాశాలల్లో అధిక రుసుము వసూళ్లపై మూడేళ్లుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఇంటర్మీడియెట్ బోర్డు హైకోర్టుకు వివరించింది. రాష్ట్రంలోని అన్‌ఎయిడెడ్, ప్రైవేటు విద్యాసంస్థలలో ప్రభుత్వం నిర్ధారించిన రుసుముకంటే విద్యార్థుల నుంచి ఎక్కువ వసూలు చేస్తున్నారని, వాటి నియంత్రణకు క్రమబద్ధీకరణ సంస్థను ఏర్పాటుచేయాలని మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశారు. దీనిపై హైకోర్టు గురువారం విచారించింది. నిర్ధారిత రుసుముకంటే అధికంగా వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేటు ఇంటర్మీడియెట్ కళాశాలల వివరాలు ఇవ్వాలని మాజీ ఎంపీ హర్షకుమార్‌కు హైకోర్టు సూచించింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొని తదుపరి విచారణను కొనసాగిస్తామంటూ రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఆదేశించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రఘునందన్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఇంటర్మీడియెట్‌కు ప్రభుత్వం తక్కువ రుసుమును నిర్ధారించినా ఏ కళాశాల కట్టుబడి ఉండటం లేదనేది అందరికీ తెలిసిందేనని అన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఫలానా కళాశాల అధిక రుసుము వసూలు చేస్తోందంటూ పిటిషనర్ స్పష్టంగా పేర్కొనలేదని, రుసుములను సవరించేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పడిందని వివరించారు. విద్యాశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అధిక రుసుము వసూలుచేస్తున్న కొన్ని కళాశాలల వివరాలనైనా తెలపాలని సూచించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కనీసం కొన్ని కళాశాలల వివరాలను తెలపాలని పిటిషనర్‌ను ఆదేశించింది.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ శివన్

దేశాన్ని తీర్చిదిద్దాల్సింది విద్యార్థులే

- ఇస్రో ఛైర్మన్ శివన్

శ్రీహరికోట, తిరుమల - న్యూస్‌టుడే

దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాల్సింది విద్యార్థులేనని ఇస్రో ఛైర్మన్ శివన్ అన్నారు. వైఫల్యాలు ఎదురైనా లక్ష్య సాధనలో పట్టు వదలకూడదని ఉద్బోధించారు. అంతరిక్ష సేవలు, పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో 'సంవాద్ విత్ స్టూడెంట్స్' కార్యక్రమాన్ని గురువారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో అధిపతి డాక్టర్ శివన్ పాల్గొన్నారు. సూళ్లూరుపేట ప్రాంతంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాలకు చెందిన ఎంపిక చేసిన 300 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. సుమారు 90 నిమిషాలపాటు ఇస్రో అధిపతి శివన్ విద్యార్థులతో మమేకమయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉందని, దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందుకు తీసుకుపోవాలని సూచించారు.

శ్రీవారి సన్నిధిలో రాకెట్ నమూనాకు పూజలు

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో పీఎస్ఎల్‌వీ- సీ44 నమూనాకు గురువారం పూజలు నిర్వహించారు. శ్రీహరికోట నుంచి పోలార్ ఉపగ్రహ వాహకనౌకను నింగిలోకి ప్రయోగించనున్న నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం శివన్ స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలకు ప్రణాళిక రూపొందించామని, ప్రపంచంలో అగ్రగామిగా నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రయోగాల సందర్భంగా షార్ కేంద్రానికి అనుమతించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది మరో 34 ప్రయోగాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.



సాగు 'బడి'

చదువుతోపాటు వ్యవసాయం, సాగు విధానాలను విద్యార్థులు తెలుసుకునేలా పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పిస్తున్నారు గుంటూరు జిల్లా తాడికొండ మండలం రావెల జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. పాఠశాల ఆవరణలో 200 మిరప, 100 టమోటా, 100 వంగ మొక్కలను, వాటితోపాటు బీర, కాకర మొక్కలు, ఆకు కూరలను పండిస్తున్నారు. విద్యార్థులతోనే వాటికి నీరు పట్టించడం, ఎండు ఆకులతో కంపోస్టు తయారు చేయడం, సేంద్రియ ఎరువును వేయడం వంటివి క్రమ పద్ధతిలో చేయిస్తున్నారు. పిల్లలు పెంచిన మొక్కల నుంచి కూరగాయలు తీస్తూ మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తున్నారు. రైతు కష్టాన్ని తెలపడంతోపాటు సాగుపై విద్యార్థుల్లో ఆలోచనలను రేకెత్తిస్తున్నారు.

- ఈనాడు, గుంటూరు

అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు

దిల్లీ: అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా గుట్టును దిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం రట్టు చేసింది. బ్రిటన్‌కు చెందిన ఓ వ్యక్తి సహా ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.90 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. పోలీసులు ఈ వివరాలను వెల్లడించారు. ముంబయి, దిల్లీ నుంచి నిషేధిత మత్తు పదార్థాలు దేశంలోని పలు ప్రాంతాలతో పాటు, బ్రిటన్, నేపాల్, మలేసియా, లండన్‌లకు సరఫరా అవుతుండటాన్ని దిల్లీ పోలీసులు గమనించారు. కొద్ది రోజులుగా మాటువేసి... నిందితులు సునీల్‌కుమార్(33), లోకేశ్ మెహతా(25), సతీశ్ సాహు(45), నీరజ్ అరోరా(43), రాజేశ్ దత్తా(45)లను అరెస్టు చేశారు. వీరు అందించిన సమాచారం ప్రకారం హరినగర్‌లోని ఓ గోదాము నుంచి 13.5 లక్షల ట్యాబ్లెట్ల డ్రగ్స్, 10.2 కిలోల ట్రెమడాల్ పొడి, 500 గ్రాముల కాటమైన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.90 కోట్లు ఉంటుందని అంచనా.

కాకినాడ సెజ్‌కు 205 ఎకరాల కేటాయింపు

ఈనాడు, అమరావతి: బహుళ ఉత్పత్తి కార్యకలాపాల కోసం తూర్పు గోదావరి జిల్లా యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లోని ఆరు గ్రామాల్లో 205.32 ఎకరాల భూమిని కాకినాడ సెజ్‌కు కేటాయిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి, కలెక్టర్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన ఉన్నతస్థాయి అధికారుల బృందం ఎకరా రూ.9 లక్షల ధరకు 155.32 ఎకరాలు కేటాయించింది. మరో 50 ఎకరాలను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ (ఐఐపీ) ఏర్పాటుకు నిబంధనలకు లోబడి ఉచితంగా కేటాయించింది.

జమ్మలమడుగుపై సీఎందే నిర్ణయం

- ఏకాభిప్రాయానికి రాని ఆదినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి
- ఎవరెక్కడో తానే చెబుతానన్న సీఎం
- ఎవరికి టిక్కెట్ ఇచ్చినా కలసికట్టుగా పనిచేయాలని ఆదేశం

ఈనాడు - అమరావతి

కడప జిల్లాలోని జమ్మలమడుగు శాసనసభ స్థానం నుంచి మంత్రి ఆదినారాయణరెడ్డి, శాసన మండలిలో ప్రభుత్వ విప్ రామసుబ్బారెడ్డిల్లో ఎవరు పోటీ చేసేదీ తానే వారం రోజుల్లో నిర్ణయిస్తానని తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. వారిద్దరిలో ఒకరు జమ్మలమడుగు నుంచి, మరొకరు కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాల్సి వచ్చినా ఇద్దరూ కలిసి కట్టుగా పనిచేయాల్సిందేనన్నారు. ఈలోపు ఇరువురూ కార్యకర్తలను మానసికంగా సిద్ధం చేయాలని సూచించారు. కడప జిల్లాకు చెందిన ముఖ్య నాయకులతో ముఖ్యమంత్రి గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. జమ్మలమడుగుతో పాటు పోటీ తీవ్రంగా ఉన్న రాయచోటి, కోడూరు నియోజవకర్గాలపైనా వారితో చర్చించారు. ఆ రెండు నియోజకవర్గాలకు తానే అభ్యర్థుల్ని ఖరారు చేస్తానన్నారు. ఎవరికి టిక్కెట్ వచ్చినా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. దీనికి నేతలంతా అంగీకరించారు.



ఇద్దరి మొగ్గూ అసెంబ్లీ సీటుకే..!

జమ్మలమడుగు నుంచి వచ్చే ఎన్నికల్లో ఎవరు పోటీ చేయాలన్న విషయంలో మంత్రి ఆదినారాయణ రెడ్డి, శాసన మండలిలో ప్రభుత్వ విప్ రామసుబ్బారెడ్డి మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. వారిలో ఒకరు జమ్మలమడుగు శాసనసభ స్థానం నుంచి, మరొకరు కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాల్సిందేనని.. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారో వారే తేల్చుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినా, వారు ఒక నిర్ణయానికి రాలేకపోయారు. దీంతో బుధవారం వారితో సుదీర్ఘంగా చర్చించారు. విషయం కొలిక్కి రాకపోవడంతో గురువారం మరోసారి సమావేశమయ్యారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాయచోటి టిక్కెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, పాలకొండరాయుడి కుమారుడు సుగవాసి ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఏ నిర్ణయం తీసుకున్నా ఇష్టమే..!

సీఎంతో సమావేశం అనంతరం కడప జిల్లా నాయకులంతా విలేకరులతో మాట్లాడారు. "ఇద్దరూ జమ్మలమడుగు టిక్కెట్ కోసమే పట్టుబట్టాం. చివరకు నిర్ణయాధికారాన్ని ముఖ్యమంత్రికే విడిచిపెట్టాం. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటాం. నియోజకవర్గంలో మా పార్టీకి చెందిన నాయకులతోనూ మాట్లాడుకుంటాం. వారంలో అంతా కొలిక్కి వస్తుంది" అని మంత్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. "తెదేపా ఆవిర్భావం నుంచీ మా కుటుంబం పార్టీకి సేవలందిస్తోంది. మా చిన్నాన్న శివారెడ్డి ఎన్టీఆర్ హయంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా పనిచేశారు. నేను రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశాను. కడప లోకసభ స్థానానికి పోటీ చేస్తే గెలుస్తామా? ఓడిపోతామా? అన్నది సమస్య కాదు. మాకు జమ్మలమడుగు నియోజకవర్గం ముఖ్యం. అదే విషయాన్ని ముఖ్యమంత్రికి చెప్పాను. ఇప్పుడికి ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. మా కార్యకర్తలతో విడిగా సమావేశం ఏర్పాటు చేసుకుని వారిని ఒప్పిస్తాం" అని రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. రామసుబ్బారెడ్డి పినతండ్రి శివారెడ్డి కుమారుడు గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. జమ్మలమడుగు టిక్కెట్ వదులుకునేందుకు తాము అంగీకరించినా, తమ కార్యకర్తలు సమ్మతించరన్నారు. జమ్మలమడుగు, రాయచోటి, కోడూరులలో ముఖ్యమంత్రి ఎవర్ని అభ్యర్థులుగా నిర్ణయించినా కలిసికట్టుగా పనిచేస్తామని చెప్పామని సీఎం రమేష్ తెలిపారు.

సీఎంతో ఆదిశేషగిరిరావు భేటీ



ఈనాడు, అమరావతి, తాడేపల్లి, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నటుడు కృష్ణ సోదరుడు, నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుని ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవలే వైకాపాకి రాజీనామా చేసిన ఆయన త్వరలో తెదేపాలో చేరనున్నారు. ఈ అంశంపై చర్చించేందుకే ఆయన ముఖ్యమంత్రిని కలిసినట్టు సమాచారం. సీఎంతో భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వైకాపా అధ్యక్షుడు జగన్ విధానాలు సరిగా లేనందునే ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగానే కలిశానన్నారు. పింఛన్ల మొత్తాన్ని పెంచడం, డ్వాక్రా మహిళలకు ఆర్థికంగా చేయూత వంటి అనేక మంచి కార్యక్రమాల్ని చేస్తున్నందుకు సీఎంని ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబే అవుతారనే విశ్వాసం వ్యక్తం చేశారు. సూపర్‌స్టార్ కృష్ణకు చెప్పకుండా తాను ఏ పని చేయనని తెలిపారు.

హాజరు లేనందున పరీక్షలకు దూరం

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్ చివరి సంవత్సరం పరీక్షలు రాసే విద్యార్థుల్లో 335 మంది అనర్హులయ్యారు. 75% హాజరు లేనందున వీరు పరీక్షలు రాసేందుకు ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం అనుమతి నిరాకరించింది. కొందరు విద్యార్థులు హాజరు ప్రాధాన్యాన్ని విస్మరించి తరగతులకు దూరంగా ఉండి ఇప్పుడు లబోదిబోమంటున్నారు. పరీక్షలు రాసేందుకు అవకాశాన్ని కల్పించాలని కొందరు విద్యార్థులు కోరగా.. తాము నిబంధనల మేరకు వవహరిస్తున్నామని విశ్వవిద్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

రీసెర్చ్ అధికారి ఉద్యోగాల భర్తీకి ప్రకటన

ఏపీపీఎస్సీ గురువారం రెండు రీసెర్చ్ ఆఫీసర్ (లేజిస్లేచర్ సెక్రటేరియట్) ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేసింది. వచ్చేనెల 13 నుంచి మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయి.

477 మంది ఉపాధ్యాయులకు అంతర్‌జిల్లా బదిలీలు

ఉపాధ్యాయుల అంతర్‌జిల్లాల బదిలీలకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ తరహా బదిలీలకు మొత్తం 507 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేయగా 477 మందికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ బదిలీలకు ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, పలు ఉపాధ్యాయ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి.

గోదాములున్నా తప్పని గోడు

- రైతులను చైతన్యపరచడంలో అధికారుల వైఫల్యం
- పొలాలు, చెట్ల కింద ఆరబోతతో కుళ్లిన ఉల్లి
- మార్కెట్‌కు తీసుకెళ్లినా ధర రాదని రోడ్లపై పారబోత
- ఖాళీగా పడివున్న ఉల్లి గోదాములు



కర్నూలు జిల్లా సంగాలలో చెట్ల కింద ఉంచిన ఉల్లి

ఈనాడు డిజిటల్ – కర్నూలు, పాత నగరం: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని.. అన్నట్లుంది ఉల్లి రైతుల పరిస్థితి. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటను నిల్వచేసుకోడానికి, మంచి ధర లభించినప్పుడే దాన్ని అమ్ముకోడానికి ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తెస్తున్నా.. క్షేత్రస్థాయిలో చైతన్యం కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. ఫలితంగా రైతాంగం అన్నివిధాల నష్టపోతోంది. కర్నూలు జిల్లాల్లో వేలాది ఉల్లి రైతుల దుస్థితి ఇందుకు అద్దం పడుతోంది.

జిల్లావ్యాప్తంగా రెండు నెలల క్రితం కోతకోసిన ఉల్లిని పొలాలు, చెట్ల కింద ఆరబోశారు. మంచి ధర వచ్చే వరకు నిల్వ చేసుకునేందుకు ఉచితంగా ఉల్లి షెడ్లు అందుబాటులో ఉన్నా ఒక్కరూ అటు దృష్టి పెట్టింది లేదు. సొంతంగా షెడ్లు కట్టుకోవడానికి రాయితీలున్నా ఆ విషయం తెలిసిందీ తక్కువ మందికే. తీరా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని మార్కెట్‌కు ఉల్లిని తరలిద్దామని చూస్తే.. సంచులు పగిలి కుళ్లిన సరకు కనిపిస్తోంది. రోడ్లపక్కన పారేయక తప్పని దైన్యస్థితి రైతన్నలకు కన్నీరు రప్పిస్తోంది. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ తదితర మండలాల్లో ఇలాంటి దుస్థితి కానవస్తోంది.

కర్నూలులో...

మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు, కోడుమూరు, గూడూరు, డోన్‌లలో ఉల్లి గోదాములను రెండేసి షెడ్లుగా విభజించి నిర్మించారు. ఒక్కో గోదాములో 200 మెట్రిక్ టన్నుల సరకును నిల్వ చేసుకోవచ్చు. దీనికోసం రూ.4కోట్లు ఖర్చుపెట్టారు. కళాజాత ప్రచారాలతో రైతులకు అవగాహన కల్పించడానికి రూ.20వేలు ఖర్చుచేశామని అధికారులు చెబుతున్నారు. ఈ గోదాములలో ఉల్లిని నిల్వ చేసుకుంటే ఎలాంటి నగదూ చెల్లించనవసరం లేదు. రైతులకు అలవాటు చేసేందుకు ఈ వెసులుబాటు కల్పించారు. కానీ తగిన ప్రచారం లేదు. దీంతో రెండేళ్లలో ఒక్క క్వింటా పంటా వీటిలో నిల్వ చేసింది లేదు. పైగా ఈ గోదాములు మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయి.

ఖరీఫ్ రైతులు కన్నీరుమున్నీరు

కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 16వేల హెక్టార్లు కాగా గతేడాది 22వేల హెక్టార్లలో సాగైంది. వర్షాభావ పరిస్థితులతో ఎకరాకు 50 క్వింటాళ్లకు మించ లేదు. ఎకరా ఉల్లి సాగుకు రూ.60వేల వరకు ఖర్చు చేశారు. తీరా మార్కెట్‌కు సరకు తీసుకెళ్లే సమయానికి మహారాష్ట్ర ఉల్లి జిల్లాకు రావడంతో ధర పతనమైంది. షోలాపూర్, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో అప్పటికే ఉల్లి చేతికందడంతో ధర పెరగలేదు. పైగా 'గోరుచుట్టుపై రోకలి పోటు'లా లారీల సమ్మె ఉల్లి రైతును మరింత కష్టాల్లోకి నెట్టింది. మార్కెట్‌లో క్వింటా రూ.200 నుంచి రూ.700లోపే పలకడంతో రైతుకు రూ.15వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి నష్టం కలిగింది. కౌలురైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది.

రైతు సొంతంగా 50%... ఉత్పత్తి సంఘాలకు 75%

ఉద్యానశాఖ ఉల్లి గోదాముల నిర్మాణానికి రాయితీలిస్తోంది. రైతు సొంతంగా నిర్మించుకుంటే యూనిట్ ధర రూ.1.75లక్షల్లో 50శాతం, ఉత్పత్తిదారుల సంఘం ద్వారా అయితే 75శాతం వరకు రాయితీ అందజేస్తోంది.

మద్దతు ధరతో ఒకింత ఊరట


ఉల్లి రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లగా మద్దతు ధర రూ.700 ప్రకటిస్తూ జిల్లాకు రూ.4కోట్లు మంజూరుచేసిన సంగతి తెలిసిందే. ఉల్లి సీజన్ ప్రకారం గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కర్నూలు మార్కెట్‌లో విక్రయించిన రైతులకు మద్దతు ధర వర్తిస్తుంది. పొలాల్లో నిల్వచేసిన ఉల్లిని ప్రస్తుతం మార్కెట్‌కు తెస్తున్నారు. ఇప్పటికే అమ్మిన వారిలో ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకు అమ్మిన రైతులు 11వేల మంది ఉన్నారు. వీరితోపాటు, ప్రస్తుతం అమ్ముతున్న లబ్ధిదారుల జాబితా త్వరగా సిద్ధంచేసి ఖాతాలో నగదు జమచేస్తే నష్టంలో కొంతయినా పూడుతుందని రైతన్నలు ఆశపడుతున్నారు.



గురువారం దిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో 'బాల కల్యాణ్' పురస్కార గ్రహీత డాక్టర్ ఎ.శ్రీధర్ రెడ్డి కరచాలనం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీధర్ రెడ్డి వేల మంది చిన్నారులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించడంతోపాటు చికిత్స అందించారు. అణగారినవర్గాల బాలల సంక్షేమం కోసం ఆయన మూడు శరణాలయాలను కూడా నడిపిస్తున్నారు.

భేష్.. షఫీ బేగ్

- కారుతో ఢీకొట్టిన వ్యక్తి గురించి స్వీయదర్యాప్తు
- మూడు నెలలు శ్రమించి ఆధారాలు సేకరించిన వ్యాపారి
- నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు



మీర్జా షఫీ బేగ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: 'దారిలో నడుచుకుంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా ఓ వాహనం మీకు అతిసమీపం నుంచి దూసుకెళ్లింది. తాగిన మత్తులో ఉన్న డ్రైవర్ తూలుతూ లేచి వెళ్లిపోయాడు'.. ఇలాంటి ఘటన ఎదురైతే హమ్మయ్య ప్రమాదం నుంచి త్రుటిలో బయటపడ్డాం.. అనుకుని అక్కడి నుంచి వెళ్లిపోతాం. కానీ ఇదే ఘటన ఎదుర్కొన్న ఓ వ్యాపారి భిన్నంగా స్పందించారు. నిందితుల కోసం తానే దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదకారకుడిని గుర్తించి కోర్టును ఆశ్రయించాడు. కోర్టులో కేసు నమోదు చేయించి పోలీసులకు ఆదేశాలు పంపేలా చేశారు.

బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10లో వ్యాపారి మీర్జా షఫీ బేగ్ (48) నివసిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో కొంత భాగం కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. షఫీ అక్టోబరు 13న రాత్రి 12.30 గంటలకు భోజనం చేసి రోడ్డుపై నడుస్తున్నారు. వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు అతన్ని తాకుతూ వెళ్లి ముందున్న గోడను ఢీకొట్టింది. ఆ ధాటికి షఫీ కింద పడిపోవడంతో తలకు, శరీరానికి స్వల్ప గాయాలయ్యాయి. కారులోంచి ఓ వ్యక్తి తూలుతూ కిందకు దిగి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. షఫీ వెంటనే బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి మౌఖికంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నంబరు ఆధారంగా దర్యాప్తు చేపట్టినా ఆధారాలు లభించలేదు. అయితే షఫీ ప్రమాద ఘటనను మరిచిపోలేకపోయారు. ప్రమాదంలో తనకేదైనా జరిగితే కుటుంబం ఏమయ్యేదనే ఆందోళన మానసికంగా కుంగదీసింది. నిందితుణ్ని గుర్తించడానికి తానే దర్యాప్తు ప్రారంభించారు. కారు నంబరుతో ఆరా తీశారు. నిందితుడు ఫోన్ మాట్లాడుతూ వెళ్లడంతో ఆ పరిసరాల్లోని సెల్ టవర్ల పరిధిలో వెళ్లిన కాల్స్ వివరాలు సేకరించి దాని ద్వారా ముందుకెళ్లారు. మొత్తం మూడు నెలలు శ్రమపడి ప్రమాదానికి కారకుడు నిమ్స్ ఆసుపత్రి వైద్యుడని గుర్తించారు. ఈ విషయాల ఆధారంగా కోర్టులో కేసు వేశారు. బంజారాహిల్స్ పోలీసులకు పోస్టులో ఫిర్యాదు పంపారు. ఈలోగా కేసు నమోదు చేయాలంటూ మూడో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించింది. ఆధారాల ప్రకారం.. ప్రమాదానికి నిమ్స్ ఆసుపత్రి వైద్యుడు కె.వి.కృష్ణారెడ్డి కారణమని భావించి బుధవారం బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 336 కింద కేసు నమోదు చేశారు. 'మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులయ్యేవారి వల్ల ఎంత మంది క్షోభ అనుభవిస్తున్నారో చూస్తున్నాం. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తికి బుద్ధి రావాలనే లోతుగా దర్యాప్తు చేశా. పోలీసులూ బాగా సహకరించారు' అని మీర్జా షఫీ బేగ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



తిరుమలేశుని దర్శించుకుని వస్తున్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్

శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ రాధాకృష్ణన్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ గురువారం దర్శించుకున్నారు. వేకువజామున స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు.

రెండో తరగతి బాలికపై దాష్టీకం

- ప్రధానోపాధ్యాయుడే కారకుడంటూ తల్లిదండ్రుల ఫిర్యాదు
- పోలీసుల అదుపులో నిందితుడు
- సస్పెన్షన్ వేటు వేసిన డీఈవో
- ఘటనపై భిన్న వాదనలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రధానోపాధ్యాయుడి దాష్టీకం కారణంగా తమ చిన్నారికి రక్తస్రావమైందంటూ బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. కృష్ణాజిల్లా నూజివీడు డీఎస్పీ సీహెచ్.జి.వి.ప్రసాద్ ఆగిరిపల్లిలో గురువారం సాయంత్రం విలేకరులకు వెల్లడించిన వివరాల మేరకు.. ఆగిరిపల్లిలో ఎనిమిదేళ్ల బాలిక రెండో తరగతి చదువుతోంది. ఈనెల 22న బడికి హాజరైన ఆమె సాయంత్రం 5గంటలకు ఇంటికి చేరింది. అప్పటికే నడవలేని స్థితిలో ఉన్న తమ చిన్నారికి రక్తస్రావం కావడాన్ని గమనించిన తల్లిదండ్రులు ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ బాధిత బాలికకు ప్రాథమిక చికిత్స చేసి, నాలుగు కుట్లు వేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంపా వెంకటేశ్వరావు(వెంకట్రావు) దండించడం వల్లే ఇలా జరిగిందని ఆరోపిస్తూ బాలిక తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను తొలుత నూజివీడు ఆసుపత్రికి, అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హనుమాన్‌జంక్షన్ సీఐ ఎన్.రాజశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారని డీఎస్పీ తెలిపారు. బాలికకు గాయం ఎలా అయిందనే విషయంపై అన్ని కోణాల్లో దృష్టి సారిస్తామని ఆయన వెల్లడించారు. సంఘటనపై కలెక్టర్ లక్ష్మీకాంతం ఆదేశాల మేరకు ఐసీడీఎస్ పీడీ కృష్ణకుమారి నూజివీడులో బాలికను పరామర్శించి, విచారించారు. ఘటనపై గుడివాడ డీవైఈవో కమలకుమారి విచారించి, డీఈవో రాజ్యలక్ష్మికి నివేదిక సమర్పించారు. దాని ఆధారంగా నిందిత ప్రధానోపాధ్యాయుడిని డీఈవో సస్పెండ్ చేసినట్లు ఆగిరిపల్లి ఎంఈవో పి.రత్నకుమార్ తెలిపారు. ఘటనపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరోవంక.. జరిగింది అత్యాచార ఘటనగా పేర్కొంటూ రాజకీయ నాయకులు బాధితులను పరామర్శించారు.



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు గంపా వెంకటేశ్వరావు



ప్రతిభ చూపిన విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న సంస్థ అకడమిక్ అడ్వైజర్ మట్టుపల్లి ప్రకాష్

సీఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' బుధవారం ప్రకటించిన సీఏ ఫైనల్, ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని సంస్థ అకడమిక్ అడ్వైజర్ మట్టుపల్లి ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం గుంటూరులోని బ్రాడీపేట సంస్థ కార్యాలయంలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మట్టుపల్లి ప్రకాష్ మాట్లాడుతూ.. సీఏ ఫైనల్‌లో అఖిలభారత స్థాయిలో మొదటి 50 ర్యాంకులకుగాను 8 ర్యాంకులు, సీఏ ఫౌండేషన్‌లో జాతీయస్థాయిలో మొదటి 50 ర్యాంకుల్లో 19 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. సీఏ ఫైనల్‌లో అఖిలభారత స్థాయిలో కె.విజయలక్ష్మి 4, ఎం.భానుప్రసాద్ 13వ ర్యాంకు సాధించారని ఆయన చెప్పారు.

మార్చి నెలాఖరుకు పీడీ ఖాతాలు ఖాళీ?

ఈనాడు, అమరావతి: ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రాష్ట్రంలోని పర్సనల్ డిపాజిట్(పి.డి.) ఖాతాల్లో ఎలాంటి నిల్వ లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు ఉత్తర్వులు ఇవ్వాలనే యోచనపై ఆర్థికశాఖ అధికారులు పరిశీలన జరుపుతున్నారు. పి.డి.ఖాతాలపై ఇటీవల చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఖాతాల్లో ఉన్న నిధులు మురిగిపోయే అవకాశం లేకుండా ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరంలోనూ వినియోగించుకునే వెసులుబాటు ప్రస్తుతం ఉంటోంది. ఇప్పుడు నిల్వలు ఖాళీ చేయడం వల్ల ఆ అవకాశం ఉండదు. ఈ ఖాతాలపై అనేక విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఇందులో నిల్వలు ఉపసంహరించుకుని వీటిని సున్నా నిల్వలుగా మార్చేయాలని యోచిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాటికి పీడీ ఖాతాల్లో రూ.29,909 కోట్ల నిల్వలు ఉన్నాయని ఆర్థికశాఖ అప్పట్లోనే స్పష్టం చేసింది.

ఇప్పటికే 12వేల ఖాతాలు తొలగింపు: ఈ ఆర్థిక సంవత్సరంలో 12 వేలకు పైగా పి.డి.ఖాతాలను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. ఆ ఖాతాల గడువు పూర్తి కావడం, ఖాతాల్లో నిధులు లేకపోవడం వల్లే ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుంది. ఈ ఖాతాల తొలగింపు తర్వాతే ప్రస్తుతం 44 వేలకు పైగా ఖాతాలున్నాయి. ఆయా ఖాతాల్లో నిల్వలు ఖాళీ అయినా ఆ ఖాతాలను తొలగించేది లేదని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ కడప వరకు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: విశాఖపట్నం-తిరుపతి మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ (నంబరు: 17487/17488)ను కడప వరకు పొడిగించారు. దక్షిణమధ్య రైల్వే తీసుకున్న ఈ నిర్ణయం జనవరి 31వ తేదీనుంచి అమలవుతుంది. 'తిరుమల' కడప నుంచి బయల్దేరి తిరుపతి మీదుగా విశాఖపట్నం వరకు వెళుతుంది. తిరిగి అక్కడి నుంచి తిరుపతి మీదుగానే కడప చేరుకుంటుంది. రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ బుధవారం ప్రకటించిన 22 రైళ్ల పొడిగింపు జాబితాలో తిరుమల ఎక్స్‌ప్రెస్ లేకపోవడం గమనార్హం.

వెంకన్న ఆలయ నిర్మాణానికి స్టాంపు రుసుము మినహాయింపు

ఈనాడు, అమరావతి: అమరావతిలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి కేటాయించిన భూమికి స్టాంపు రుసుము, రిజిస్ట్రేషన్ రుసుముల నుంచి మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. ఆలయ నిర్మాణానికి రాజధాని ప్రాంతంలో 25 ఎకరాలు కేటాయించారు. రుసుముల మినహాయింపు వల్ల రూ.1,00,20,600 తితిదేకు ప్రయోజనం లభించనుంది.

మహాకాళి, మహాలక్ష్మి పూజలు

- శాస్త్రోక్తంగా యాగం
- తెలంగాణ సీఎం కేసీఆర్ దంపతుల పూజలు



సహస్ర మహా చండీయాగంలో భాగంగా మహాకాళి, మహాలక్ష్మి పూజల్లో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన సతీమణి శోభ

ఈనాడు, హైదరాబాద్: సహస్ర మహా చండీయాగం గురువారం నాలుగో రోజు శాస్త్రోక్తంగా జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు రాజశ్యామల మాత మండపంలో పూజలు నిర్వహించారు. శ్రీ మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి స్వరూపిణిగా శ్రీ రాజశ్యామలాదేవిని సువర్ణ మంత్ర పుష్పాంజలితో పూజించారు. 'సర్వ మంగళ మాంగల్యే... శ్రీ రాజశ్యామలా దైవేయ నమస్తే...' అంటూ రుత్వికులు వేదోక్తంగా ప్రార్థనలు చేశారు. మహారుద్ర మండపంలో జరిగిన పూజలో సీఎం పాల్గొన్నారు. మహారుద్ర సహిత రుద్ర ఏకాదశి, రుద్రనమకం, రుద్రచమకం పఠించారు. పంచాక్షరి జపంలో భాగంగా 'శివశివశంకర భూతపతే, శంకర శివ శంభో మహాదేవ, హరహర మహాదేవ..' అనే ప్రార్థనలు యాగశాలలో మారుమోగాయి. అనంతరం బ్రహ్మ స్వరూపిణి బగళాముఖి మండపంలో సీఎం దంపతుల సమక్షంలో వేదపండితులు, రుత్వికులు పూజలు చేశారు. 'గౌరీ నారాయణ నమోస్తుతే, పీతాంబర దేవీ నమోస్తుతే, జయతే, విజయతే, జయ విమలే బగలే..' అంటూ దేవిని స్తుతించారు. నవగ్రహ మండపంలో ఆదిత్య హృదయం పఠనం, సూర్య నమస్కారాలు నిర్వహించారు. చండీమాత ప్రధాన యాగశాలలో రాజరాజేశ్వరి మాత ప్రార్థనలు చేశారు. 'భువనేశ్వరీ, బ్రహ్మాండ కుటుంబినీ, శ్రీ గణనాథ, పార్వతీ నందన, పాపవిమోచన..' అంటూ ప్రార్థనలు నిర్వహించారు. రుత్వికులు చండీ సప్తశతి పారాయణం చేశారు. వేదపండితులు యాగం వీక్షించడానికి వచ్చిన భక్తులకు సుభాషితాలు వినిపించారు. యాగ విశిష్టతను వివరించారు. మహాహారతితో ఉదయం పూట కార్యక్రమాలు ముగిశాయి. 'శతమానం భవతి' అంటూ రాజశ్యామల మండపంలో సీఎం దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

ముఖ్యమంత్రి దంపతులు అనంతరం పాంచాంగిక దీక్షలో ఆవాహిత దేవతా పూజనం 10 వేల జపం, సువాసినీ పూజ, హారతీ మంత్ర పుష్పం, మూల మంత్ర హవనం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహారుద్ర యాగంలో భాగంగా శాంతిపాఠంతో ప్రారంభమై ఆవాహిత దేవతా పూజలు, రుద్ర జపాభిషేకాలు, 44 మంది రుత్వికులతో 44 ఏకాదశ రుద్ర హోమాలు, ప్రదోష పూజ, నవగ్రహ జపాదులు, పంచకాటకాలు, పంచోపనిషత్తులు, సుందరాకాండ పారాయణం, సూర్య నమస్కారాలు, మహా మృత్యుంజయ జపం, హవనాలు పూర్తి చేశారు

శ్రీ చక్రార్చన, సప్తశతి పారాయణాలు పూర్తి చేసుకొని మంగళహారతి, మంత్ర పుష్పం, భజన కార్యక్రమం, తీర్థ ప్రసాద వితరణతో మధ్యాహ్నిక కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నవార్ణ జపం, లక్ష జపం పూర్తి చేశారు. 6.30కు ప్రదోషకాల పూజలు, హారతి మంత్ర పుష్పం, భజన కార్యకమం, తీర్థ ప్రసాద వితరణ, భజన నిర్వహించారు. మంగళహారతితో కార్యక్రమం ముగిసింది.

నేటితో ముగియనున్న యాగం

అయిదురోజులుగా నిర్వహిస్తున్న సహస్ర మహాచండీయాగం శుక్రవారంతో ముగియనుంది. తెలంగాణ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వానలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ, గత సోమవారం దీన్ని ప్రారంభించారు. శుక్రవారం చివరి రోజు విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరగనున్నాయి. పెద్దఎత్తున భక్తులు యాగానికి వస్తారని అంచనా వేస్తున్నారు.

అబ్బాయిలను బాగా పెంచితే.. అమ్మాయిలకు అదే రక్షణ

- 'ఈనాడు' కార్టూనిస్ట్ శ్రీధర్
- విద్యార్థినులకు లఘుచిత్రాల పోటీ

మలక్‌పేట, న్యూస్‌టుడే: మగపిల్లలకు క్రమశిక్షణ అలవడేలా పెంచితే.. సమాజంలో ఆడపిల్లలకు ఎదురయ్యే ఇబ్బందులను గణనీయంగా తగ్గించవచ్చని 'ఈనాడు' కార్టూనిస్ట్ శ్రీధర్ తల్లిదండ్రులకు సూచించారు. కొందరు అబ్బాయిల ప్రవర్తన సరిగా లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకే తల్లిదండ్రులు ముఖ్యంగా అబ్బాయిలకు విద్యాబుద్ధులతోపాటు, విలువలు నేర్పించాలని అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలల హక్కుల సంఘం, సీఐడీ శిశు మహిళా భద్రత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని అనిబిసెంట్ జూనియర్, డిగ్రీ మహిళా కళాశాలలో విద్యార్థినులకు లఘుచిత్రాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీధర్‌తోపాటు, గైనకాలజిస్టు డాక్టర్ శోభ తదితరులు హాజరయ్యారు. బాలల హక్కుల సంఘం అధ్యక్షుడు అచ్యుత్‌రావు మాట్లాడుతూ పోటీలో ప్రదర్శించిన 50 లఘు చిత్రాల్లో న్యాయనిర్ణేతలు 12 చిత్రాలను ఎంపిక చేసినట్లు, విజేతలకు శుక్రవారం పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. 'గృహ హింస, విద్యార్థుల మనస్తత్వం, మోసానికి గురి కావద్దు, మీ టూ (నేను సైతం)..' తదితర అంశాలపై చిత్రాలను రూపొందించినట్లు చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు నటరాజ్ భట్, ఫ్యాషన్ డిజైనర్ మంగారెడ్డి, నిర్మాత, దర్శకుడు డాక్టర్ స్వామి, యానిమేషన్ నిపుణులు గోలి శ్యామల వ్యవహరించారు. కార్యక్రమంలో బాలల హక్కుల సంఘం అధ్యక్షురాలు అనురాధ, కళాశాల కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ వీణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న 'ఈనాడు' కార్టూనిస్ట్ శ్రీధర్, పక్కన (ఎడమ నుంచి వరుసగా) అనురాధ, శ్యాంసుందర్‌రెడ్డి, అచ్యుత్‌రావు, శోభ, వీణారెడ్డి

తాయిలాలు ఉండేనా!

- కేంద్ర బడ్జెట్‌లో జనాకర్షక పథకాలు ప్రకటిస్తారా?
- సర్వత్రా నెలకొన్న ఆసక్తి

ఈనాడు – దిల్లీ

సిక్సర్లకా? సంప్రదాయాలకా? రానున్న బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం దేనికి ప్రాధాన్యం ఇస్తుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో 'సిక్సర్లు'లాంటి జనాకర్షక పథకాలను ప్రకటిస్తామని ఇప్పటికే మంత్రులు వెల్లడించారు. ఎన్నికల ముందు తాత్కాలిక బడ్జెట్‌ను మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని, అందువల్ల దీంట్లో కీలక విధానపర నిర్ణయాలను ప్రకటించడం సంప్రదాయం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ఏ నిర్ణయం తీసుకుంటారనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బడ్జెట్ విషయంలో మోదీ ప్రభుత్వం చాలా సంప్రదాయాలను మార్చివేసిందని, అందువల్ల కీలక ప్రకటనలు చేయకూడదన్న ఆనవాయితీని కూడా ఉల్లంఘిస్తుందన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఫిబ్రవరి చివరి రోజున బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంప్రదాయం కాగా, దాన్ని కాదని మొదటి తేదీన ప్రవేశపెడుతోంది. సాధారణ బడ్జెట్, రైల్వే బడ్జెట్‌లు వేర్వేరుగా ఉండగా, ఆ రెండింటినీ విలీనం చేసింది. ఆ పద్ధతిలోనే



ప్రస్తుతం నడుస్తుందన్న అంచనాలు ఉన్నాయి.

పూర్తి స్థాయి బడ్జెట్ ఎందుకు ఉండదు?

ఎన్నికల ముందు పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టకూడదన్నది కాలపరీక్షకు నిలిచిన సంప్రదాయంగా మారింది. మూడు నాలుగు నెలల పాటు ప్రభుత్వ వ్యయాలకు వీలు కలిగించే ఓట్ ఆన్ అకౌంట్‌ను మాత్రమే రూపొందిస్తారు. ఒక వేళ పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే... ఎన్నికల్లో అదే పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎలాంటి సమస్యా లేదు. వేరే పార్టీ గెలిస్తే ఇబ్బందులు తప్పవు. మార్పులు చేసే విషయంలో కొత్త ప్రభుత్వానికి తలనొప్పులు ఎదురవుతాయి. అంతిమంగా పన్ను చెల్లింపుదారులు సమస్యలు ఎదుర్కొంటారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం కూడా నైతిక విలువలకు కట్టుబడి ఉండాలన్న సంప్రదాయం ఉంది. తాజా పరిస్థితులను పరిశీలిస్తే.. కొత్త ప్రభుత్వం మే 22లోగా ఏర్పాటు కానుంది. జులైలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అందువల్ల నాలుగు నెలల వ్యయానికి అనుమతిస్తూ ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెడితే సరిపోతుంది. దీనిపై భాజపా తిరుగుబాటు నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం తగదని చెప్పారు. మరో మాజీ మంత్రి పి.చిదంబరం మాట్లాడుతూ "గతంలో ఓట్ ఆన్ అకౌంట్‌లో చిన్న చిన్న ప్రకటనలకు పరిమితమయ్యేవారు. ఈ ప్రభుత్వం సంప్రదాయాలను పట్టించుకోవడం లేదు" అని అన్నారు. చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్నపుడు తాత్కాలిక బడ్జెట్‌లో పన్నుల చట్టాలను సవరించరాదన్న సంప్రదాయాన్ని ఉల్లంఘించి 2014-15లో పరోక్ష పన్నుల్లో మార్పులను ప్రకటించారు.

ఎలాంటి సిక్సర్లు ఉంటాయి?

రైతుల ప్రయోజనం కోసం రైతుబంధులాంటి పథకాన్నిగాని, మధ్యప్రదేశ్‌లో అమలు చేస్తున్న భవంతర్ భుగటన్ యోజనలాంటిదిగానీ, రెండింటిని సమ్మిళితం చేసేదిగానీ ప్రకటించే వీలుంది. ఆదాయపు పన్ను పరిమితిని రూ.5 లక్షల వరకు పెంచే అవకాశం ఉంది.

పూర్తిస్థాయి బడ్జెట్‌ను వ్యతిరేకిస్తాం: కాంగ్రెస్

దిల్లీ: పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ఎన్డీయే సర్కారు ప్రయత్నిస్తే పార్లమెంటు లోపల, వెలుపలా తీవ్రంగా వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే హక్కు ప్రభుత్వానికి లేదని పార్టీ అధికార ప్రతినిధి మనీష్ తివారీ తెలిపారు.

ఆస్తి ఎంతున్నా ఫర్వాలేదు

- ఆదాయం రూ.8 లక్షలు దాటకూడదు
- రిజర్వేషన్ అర్హతల్లో గుజరాత్ మార్పులు

ఈనాడు, దిల్లీ: ఆర్థికంగా వెనకబడిన వారికి జనరల్ కేటగిరీలో విద్య, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్ల కల్పనకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అర్హతల్లో గుజరాత్ ప్రభుత్వం మార్పులు చేసింది. ఆస్తితో సంబంధం లేకుండా కేవలం ఆదాయాన్ని మాత్రమే అర్హతగా పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. దీనివల్ల ఆస్తి ఎంత ఉన్నా వార్షిక కుటుంబ ఆదాయం రూ.8 లక్షల్లోపు ఉంటే గుజరాత్ విద్య, ఉద్యోగాల్లో ఈ కోటా కింద రిజర్వేషన్ పొందడానికి అర్హులవుతారు. కేంద్రం విధించిన అర్హతలను కేవలం కేంద్ర ప్రభుత్వ విద్య, ఉద్యోగాలకు మాత్రమే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికితోడు 1978కి ముందు గుజరాత్‌కు వచ్చి స్థిరపడిన కుటుంబాల్లోని సభ్యులకు మాత్రమే స్థానిక రిజర్వేషన్లు వర్తించేలా షరతు విధించింది. కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాల్లో స్థానిక అవసరాలకు తగ్గట్టు మార్పులు చేసుకోవడానికి ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకొని గుజరాత్ ప్రభుత్వం ఈ మార్పులు చేసింది. 1978కి ముందే గుజరాత్‌లో స్థిరపడిన వారికే రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయాన్ని విపక్ష కాంగ్రెస్, రాష్ట్రేతరుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీని ప్రభావం గుజరాత్‌లో స్థిరపడిన ఇతర రాష్ట్రాలకు చెందిన వేలమంది యువతపై పడనుంది. 4దశాబ్దాలుగా గుజరాత్‌లో నివసిస్తున్న వారిని మినహాయించడం అన్యాయమని ఉత్తర్ భారతీయ వికాస్ పరిషత్ అధ్యక్షుడు మహేష్‌సింగ్ కుశ్వాహ పేర్కొన్నారు. కేంద్రం ఆమోదించిన కోటా చట్టాన్ని మార్చాల్సిన అవసరం లేదని గుజరాత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ దోషి పేర్కొన్నారు.



గురువారం దిల్లీలో 'జాతీయ బాల పురస్కార' గ్రహీతలతో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి మేనకా గాంధీ బృందచిత్రం

చిన్నారులు, కళాకారులతో ముచ్చటించిన ప్రధాని

దిల్లీ: ప్రకృతితో ఎప్పుడూ మమేకం కావాలని చిన్నారులకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. గురువారం తనను కలిసిన 'ప్రధాన మంత్రి జాతీయ బాల పురస్కారం-2019' గ్రహీతలతో ఆయన ఆప్యాయంగా ముచ్చటించారు. ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి, వారి ద్వారా మరింత మందికి స్ఫూర్తి కలిగించేందుకు ఈ పురస్కారాలు ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. చిన్నారులకు ఆటోగ్రాఫ్‌లు ఇవ్వడంతోపాటు వారి స్ఫూర్తిదాయక అనుభవాలను మోదీ శ్రద్ధగా విన్నారు. జాతీయ బాల పురస్కారాల్లో 'బాల శక్తి' (వ్యక్తిగత విభాగం), 'బాల కల్యాణ్' (బాలల అభ్యున్నతి కోసం కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు) అని రెండు విభాగాలున్నాయి. ఈసారి బాల శక్తి పురస్కారాలు 26 మందికి, బాల కల్యాణ్ పురస్కారాలు ఇద్దరు వ్యక్తులు, మూడు సంస్థలకు దక్కాయి. ప్రధాని నివాసంలో జరిగిన మరో కార్యక్రమంలో శకటాలను రూపొందించే కళాకారులు, 'గిరిజన అతిథులు', ఎన్‌సీసీ క్యాడెట్‌లు, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలతో మోదీ ముచ్చటించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నందుకు వారిని అభినందించారు. ఈ సందర్భంగా కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలను కూడా ఆయన వీక్షించారు.

తెరాస, వైకాపా మద్దతిచ్చినా కష్టమే!

- 99 స్థానాలు కోల్పోనున్న ఎన్డీయే
- మమత, మాయా, ముఫ్తీ, అఖిలేశ్‌లు కలిస్తే మహా కూటమిదే విజయం
- ఇండియాటుడే-కార్వీ సర్వేలో వెల్లడి

దిల్లీ: దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఎన్డీయే, యూపీయే కూటములకు చెరో 44 శాతం చొప్పున ఓట్లు లభించే అవకాశం ఉందని 'ఇండియా టుడే - కార్వీ' నిర్వహించిన తాజా సర్వేలో వెల్లడయింది. విపక్షాల మహా కూటమిలో మెహబూబా ముఫ్తీ, మమతా బెనర్జీ, మాయావతి, అఖిలేశ్ యాదవ్‌లు చేరితే మాత్రం కేంద్రంలో మోదీ సర్కారును కూలదోసే అవకాశాలుంటాయని దీనిలో తేలింది. తెరాస, వైకాపా, బిజద, అన్నాడీఎంకేలు మద్దతు ఇచ్చినా ఎన్డీయేకి కష్టమేనని సర్వే పేర్కొంది. దేశ ప్రజల మనోభిప్రాయం (మూడ్ ఆఫ్ ది నేషన్) తెలుసుకునేందుకు ఈ సర్వేను నిర్వహించారు. ప్రాంతీయ పార్టీలకు చెందిన కె.చంద్రశేఖర్‌రావు, పళనిస్వామి, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, నవీన్ పట్నాయక్‌లు ఎన్డీయేతో కలిసినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన ఆధిక్యం మాత్రం ఆ కూటమికి లభించదని దీనిలో తేలింది. దేశవ్యాప్తంగా 13,179 మందితో మాట్లాడి సర్వే ఫలితాన్ని క్రోడీకరించారు.

3 రకాలుగా ఫలితాలు రావచ్చని సర్వేలో తేలింది.

1) 2014లో 336 లోక్‌సభ స్థానాలను దక్కించుకున్న ఎన్డీయే ఇప్పుడు 257 స్థానాలకు పరిమితమవుతుంది.
- ఇతర పార్టీలకు, స్వతంత్రులకు కలిపి 14 స్థానాలు వచ్చే అవకాశం ఉంది. వారంతా ఎన్డీయేతో కలుస్తారనుకున్నా ప్రభుత్వ ఏర్పాటుకు (272 స్థానాలు) ఒక స్థానం తక్కువవుతుంది.
- ప్రస్తుతం 59 స్థానాలకు పరిమితమైన యూపీఏ.. కొత్త మిత్రుల మద్దతుతో ఈసారి 272 స్థానాల మెజారిటీని సాధించగలుగుతుంది.

2) వైకాపా, అన్నాడీఎంకేల మద్దతు లభించినా ఎన్డీయే 234 స్థానాల వద్ద ఆగిపోతుంది.

3) ఎన్డీయేలో ఏ పార్టీ కొత్తగా చేరకుండా.. తృణమూల్, ఎస్పీ, బీఎస్పీలు యూపీయేలో చేరితే ఎన్డీయే 219, యూపీయే 269 స్థానాలు పొందుతాయి. ఇతరులకు 55 సీట్లు వెళ్తాయి.

ఉత్తరాదిలో ఎన్డీయే బలంగానేఉన్నా దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం 18% ఓట్లతో సరిపెట్టుకోవాల్సి రావచ్చు. యూపీఏ 43%, ఇతరులు 39% ఓట్లు సాధించే అవకాశం ఉంది. సీట్లపరంగా చూస్తే దక్షిణాదిలో యూపీయే 78 స్థానాల్లో నెగ్గుతుంది. తూర్పు రాష్ట్రాల్లో అధికార కూటమికి 37%, యూపీయేకి 25% ఓట్లు రావచ్చు. పశ్చిమ రాష్ట్రాల్లో ఎన్డీయేకి ఫలితాలు బాగుంటాయి.

'మీ-సేవ'లో కేసుల వివరాలు

ఈనాడు, దిల్లీ: దేశ వ్యాప్తంగా కంప్యూటరీకరించిన జిల్లా, దిగువ న్యాయస్థానాల్లోని కేసుల వివరాలు ఇక నుంచి గ్రామీణ ప్రాంతాల వారికి చేరువ కానున్నాయి. కేసుల నమోదు, విచారణ, వాటి తాజా పరిస్థితి, న్యాయమూర్తుల ఆదేశాలు, తీర్పులు తదితర 'ఈ-కోర్టు' పోర్టల్‌కు చెందిన 23 రకాల వివరాలు తెలుసుకోవడానికి 'మీ-సేవ' కేంద్రాలను ఆశ్రయిస్తే సరిపోతుందని కేంద్ర న్యాయశాఖ గురువారం ఇక్కడ ఓ ప్రకటనలో తెలిపింది. 'ఈ-కోర్టు' ప్రాజెక్టు కింద 16,845 న్యాయస్థానాల్లో కంప్యూటరీకరణ పూర్తయిందని, వాటి సమాచారం స్థానిక మీ-సేవ కేంద్రాల్లో తెలుసుకోవచ్చని పేర్కొంది. రకరకాల సేవలు అందించినందుకు ఆయా కేంద్రాలు రూ.5 చొప్పున వసూలు చేయవచ్చనీ, సమాచారం ఒక పేజీకి మించితే ముద్రణ రుసుముగా రూ.5 తీసుకోవచ్చని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీకి కనీసం ఒక మీ-సేవ కేంద్రం ఉన్నందున ఈ-కోర్టు సేవలు దేశమంతటా విస్తరించినట్లేనని తెలిపింది. ఈ-కోర్టు డేటాబేస్‌లో ప్రస్తుతం 10 కోట్ల కేసులు, 7 కోట్ల ఆదేశాలు, తీర్పులకు సంబంధించిన వివరాలు ఉన్నాయని న్యాయశాఖ తెలిపింది.

ఘన వ్యర్థాలపై నివేదికలతో రండి: ఎన్జీటీ

దిల్లీ: ఘన వ్యర్థాల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ ప్రణాళికలతో కూడిన నివేదికలతో తమ ముందు స్వయంగా హాజరు కావాలని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులను జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశించింది. మార్చి 1 నుంచి విడివిడిగా సమావేశాలు నిర్వహించి ఈ నివేదికలను పరిశీలించనున్నట్లు తెలిపింది. ఘన వ్యర్థాలను కట్టడి చేయడంలో విఫలమయ్యారంటూ ఆయా ప్రభుత్వ వర్గాలపై ఎన్జీటీ మండిపడింది. వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వ వెబ్‌సైట్లలో ప్రదర్శించాలని రాష్ట్రాలకు సూచించింది.

ఎస్సీ, ఎస్టీ చట్టంపై స్టేకు సుప్రీం నిరాకరణ

దిల్లీ: ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టానికి చేసిన సవరణలపై స్టే ఉత్తర్వులు ఇవ్వడానికి గురువారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ సవరణల ప్రకారం నిందితులు ముందస్తు బెయిల్ పొందడానికి అవకాశం లేదు. దీనిని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని జస్టిస్ ఎ.కె.సిక్రి ఆధ్వర్యంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. సవరణలను సవాలు చేస్తూ మరికొన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయని, వీటన్నింటినీ కలిపి విచారించాల్సి ఉందని అభిప్రాయపడింది. ఇందుకోసం మరో ధర్మాసనం ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయమూర్తిని కోరింది. ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నివారణ చట్టంలోని అంశాలు దుర్వినియోగమవుతున్నందున వాటిని రద్దు చేస్తూ గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే ఆ నిబంధనలను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం చట్టానికి సవరణలు చేసింది. దీనిపై మళ్లీ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఖరారు కాని సీబీఐ డైరెక్టర్ పేరు

దిల్లీ: సీబీఐ డైరెక్టర్ నియామకం కోసం గురువారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన అత్యున్నతస్థాయి సంఘం సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రధాని నివాసంలో జరిగిన ఈ భేటీలో సంఘం సభ్యులైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఎంపికపై ఎటువంటి విమర్శలు రాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం 1982-85 బ్యాచ్‌లకు చెందిన 12 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లతో జాబితాను రూపొందించింది. గుజరాత్ డీజీపీ శివానంద్ ఝా, బీఎస్ఎఫ్ డీజీ రజనీకాంత్ మిశ్ర, సీఐఎస్ఎఫ్ డీజీ రాజేశ్ రంజన్, ఎన్ఐఏ డీజీ వై.సి.మోదీ, ముంబయి పోలీసు కమిషనర్ సుబోధ్ జైశ్వాల్‌ల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. అధికారులకు సంబంధించిన వివరాలను అందజేయడంతో సభ్యులు వాటిపై చర్చలు జరిపారు. అయితే వారి అనుభవంతోపాటు, వృత్తిపరమైన ఇతర వివరాలను జాబితాలో పొందుపరచలేదని ఖర్గే చెప్పారు. అన్ని వివరాలు సమర్పించాలని తాను, జస్టిస్ గొగొయి కోరామని తెలిపారు.

సీబీఐ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించిన జస్టిస్ సిక్రి

దిల్లీ: సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావు నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణ బాధ్యత నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.సిక్రి తప్పుకొన్నారు. శుక్రవారం దీన్ని మరో ధర్మాసనం ముందు విచారణకు పెట్టాలని సూచించారు. సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మను బదిలీ చేయాలని నిర్ణయించిన అత్యున్నత స్థాయి కమిటీలో జస్టిస్ సిక్రి కూడా సభ్యుడిగా ఉన్న సంగతి తెలిసిందే. నాగేశ్వరరావు నియామకం అత్యున్నత స్థాయి కమిటీ ద్వారా జరగలేదని 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను వేసింది. గురువారం ఈ అంశం జస్టిస్ సిక్రి నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. తాను తప్పుకొంటున్నానని, ఇంతకుమించి ఏమీచెప్పలేనని ఆయన తెలిపారు.

స్నేహితుడిని కడతేర్చి.. 200 ముక్కలు చేసి!

ముంబయి: స్నేహితుడిని హతమార్చి, అతని శరీరాన్ని దాదాపు 200 ముక్కలు చేసి మరుగుదొడ్డిలో పడేసిన ఓ వ్యక్తి రాక్షసత్వం ముంబయిలో వెలుగు చూసింది. ఈ దారుణ ఘటనలో గణేశ్ కొల్హాట్కర్ (58) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శాంతాక్రజ్‌కు చెందిన నిందితుడు పింటూ శర్మ (42)ను పోలీసులు అరెస్టు చేశారు. కొల్హాట్కర్ గతంలో శర్మ నుంచి రూ. లక్ష అప్పు చేసి, తిరిగి కొంత చెల్లించాడు. గత డిసెంబరు 16న ఇద్దరూ కొల్హాట్కర్ ఇంటివద్ద కలుసుకున్న సందర్భంగా వాగ్వాదం చోటుచేసుకుంది. కొల్హాట్కర్ ఆలస్యంగా పెళ్లి చేసుకుంటున్నాడని గేలిచేస్తూ అతని కాబోయే భార్యపై శర్మ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. కొల్హాట్కర్‌ను శర్మ గోడకేసి కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం మృతదేహాన్ని శర్మ 4 రోజుల పాటు చిన్న ముక్కలుగా చేసి మరుగుదొడ్డిలో పడేసి నీళ్లు కొట్టేశాడు. హతుడి శరీర భాగాలు అడ్డుపడి ఆ భవనంలోని డ్రైనేజి వ్యవస్థ నిలిచిపోవడంతో స్థానికులు శుభ్రపరిచేందుకు మనుషులను పిలిపించగా అసలు విషయం బయట పడింది.

అండమాన్‌లో నౌకాదళ విమాన స్థావరం

దిల్లీ: అండమాన్ నికోబార్ దీవుల్లోకొత్తగా నౌకాదళ విమాన స్థావరం ప్రారంభమైంది. నౌకాదళం కింద ఇప్పటికే ఈ ప్రాంతంలో రెండు కేంద్రాలు ఉన్నాయి. ఐఎన్ఎస్ కొహాసా అనే స్థావరం.. అండమాన్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్‌కు 300 కిలోమీటర్ల దూరంలో ఉంది. హిందు మహాసముద్రంలో చైనాపై కన్నేసి ఉంచడానికి తోడ్పడుతుందని చెబుతున్నారు. ఈ స్థావరంలో వెయ్యి మీటర్ల పొడవైన రన్‌వే ఉంది.

మరో వారంలో పట్టాలెక్కనున్న ట్రైన్-18

దిల్లీ: శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో రైల్వే శాఖ ప్రవేశపెట్టనున్న వేగవంతమైన 'ట్రైన్-18' మరో వారం రోజుల్లో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. 'ప్రభుత్వ విద్యుత్తు తనిఖీదారుడు' (ఈఐజీ) ఈ రైలును మూడు రోజుల పాటు పరీక్షించి, నడిపేందుకు అనుమతించారు. ప్రారంభోత్సవ తేదీపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

బొగ్గుగనిలో ఓ మృతదేహం వెలికితీత

షిల్లాంగ్: మేఘాలయ బొగ్గుగనిలో చిక్కుకుని గల్లంతయిన వారిలో ఒకరి మృతదేహాన్ని 42 రోజుల తర్వాత సహాయక బృందం గురువారం బయటకు తీసింది. తూర్పు జయంతియా హిల్స్ జిల్లాలోని అక్రమ బొగ్గు గనిలోకి వరదనీరు ప్రవహించడంతో గత డిసెంబరు 13న అందులో 15 మంది మైనర్లు చిక్కుకున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితమే ఒక మృతదేహాన్ని కనుగొనగా.. జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), భారత నావికాదళం సంయుక్త బృందం వెలికి తీసింది.



వెలికితీసిన మృతదేహాన్ని తరలిస్తున్న సహాయక బృందం

బ్యాంకులో కాల్పులు

అమెరికాలో ఐదుగురి మృతి

వాషింగ్టన్: అమెరికాలో మరోసారి తూటాల మోత మోగింది. ఫ్లోరిడా రాష్ట్రంలో ఓ దుండగుడు విచక్షణరహితంగా కాల్పులకు తెగబడి ఐదుగురి ప్రాణాలను బలితీసుకున్నాడు. బుధవారం సెబ్రింగ్ పట్టణంలోని సన్‌ట్రస్ట్ బ్యాంకులో ఈ దారుణం చోటు చేసుకుంది. 'ఐదుగురిని కాల్చి చంపాను' అంటూ ఓ వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ రావడంతో పోలీసులు స్పందించారు. ప్రత్యేక బలగాల బృందం బ్యాంకు వద్దకు చేరుకుంది. అయితే నిందితుడు లోపలే దాక్కొని ఉండిపోయాడు. బలగాలు బ్యాంకు లోపలికి ప్రవేశించిన తర్వాత అతడు లొంగిపోయాడు. నిందితుడిని 21 ఏళ్ల జెఫెన్ జేవర్‌గా పోలీసులు గుర్తించారు. అతడు ఈ దుశ్చర్యకు ఎందుకు ఒడిగట్టాడన్నది తెలియరాలేదు. గతంలో ఫ్లోరిడాలోని ఓ జైల్లో కొంత కాలం పాటు శిక్షణ (ట్రైనీ) గార్డుగా నిందితుడు పని చేసినట్లు తెలిసింది. ఘటనపై ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ విచారం వ్యక్తం చేశారు. దుండగుడిపై కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు.

దిల్లీలో గణతంత్ర వేడుకలపై దాడులకు కుట్ర

జేఈఎమ్ ఉగ్రవాది అరెస్టు

దిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా దిల్లీలో దాడులకు తెగబడాలని ఉగ్రవాదులు పన్నిన కుట్రను పోలీసులు భగ్నం చేశారు. జైష్ ఎ మహమ్మద్ (జేఈఎమ్) ఉగ్రసంస్థతో సంబంధమున్న ఇద్దరు ఉగ్రవాదులను అరెస్టు చేశారు. అబ్దుల్ లతీఫ్ గనాయ్ అనే ఉగ్రవాదిని దిల్లీలో అరెస్టు చేశారు. పలు ఆధారాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. శ్రీనగర్‌లో ఇటీవల జరిగిన గ్రెనేడ్ దాడులకు కూడా సూత్రధారి లతీఫేనని పోలీసులు తెలిపారు. అదే తరహాలో గణతంత్ర దినోత్సవం సమయంలోనూ దిల్లీలోని జనసమ్మర్ధ ప్రాంతాల్లో దాడులు చేపట్టాలని అతడు కుట్ర పన్నినట్లు తమకు సమాచారం అందిందని వెల్లడించారు. దిల్లీలో రెక్కీ నిర్వహించిన హిలాల్ అనే ఉగ్రవాదిని కూడా జమ్మూ కశ్మీర్‌లోని బాందీపొరాలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



గురువారం అమేఠీలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ ★ రాయ్‌బరేలీలో ఓ మహిళతో మాట్లాడుతున్న రాహుల్

యూపీలో ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యం

- ప్రియాంక, సింధియాలకు నిర్దేశించాం
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ వెల్లడి

అమేఠీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే లక్ష్యాన్ని తన సోదరి ప్రియాంకకు అప్పగించినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వెల్లడించారు. ప్రియాంకగాంధీకి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా యూపీ తూర్పు ప్రాంతం, పార్టీ నేత జ్యోతిరాదిత్య సింధియాకు పశ్చిమ ప్రాంతం బాధ్యతల్ని అప్పగించిన సంగతి తెలిసిందే. గురువారం సొంత నియోజకవర్గం అమేఠీలో ఏర్పాటు చేసిన సభలో రాహుల్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో భాజపాను ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను ప్రియాంక, సింధియాలకు అప్పగించినట్లు వెల్లడించారు. తాను భాజపా ముక్త భారత్ అని మాట్లాడబోననీ, గౌరవంగా మాట్లాడతానని పేర్కొన్నారు. గుజరాత్, యూపీ, తమిళనాడు ప్రతిచోటా కాంగ్రెస్ ముందడుగు వేసి పూర్తి సామర్థ్యంతో పోరాడుతుందని, అసెంబ్లీ ఎన్నికల తర్వాత యూపీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో వెనకడుగు వేయకుండా పూర్తి సామర్థ్యంతో పోటీ పడతామన్నారు. రఫేల్ విమానాల ఒప్పందంపై కేంద్రప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధాని పారిశ్రామికవేత్తల రుణాల్ని ఎత్తివేశారని ఆరోపించారు. కాపలాదారుడే దొంగ అని ప్రతి వీధిలో వినిపిస్తోందని వ్యాఖ్యానించారు. తన సోదరి ప్రియాంక, తల్లి సోనియా, తాను నియోజకవర్గ ప్రజలకు సైనికులమని అభివర్ణించారు. బీఎస్పీ అగ్రనేత మాయావతి, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్, అతని తండ్రి ములాయంపై తనకు పూర్తి గౌరవం ఉందని పునరుద్ఘాటించారు. భాజపా నేతలు మతం, కులం, ప్రాంతాల పేరిట విద్వేషాల్ని ప్రచారం చేస్తున్నారన్నారు. గుజరాత్ నుంచి యూపీ, బిహార్ వాసులను గెంటేస్తున్నారని, హిందూ, ముస్లింలు పరస్పరం కొట్టుకునేలా చేస్తున్నారని ఆరోపించారు. నరేంద్రమోదీ అంటేనే విద్వేషమని, విద్వేషానికి సంకేతమని పేర్కొన్నారు. 2019లో మోదీని తొలగిస్తామని, దీన్నెవరూ ఆపలేరన్నారని స్పష్టం చేశారు. గురువారం ఉదయం రాహుల్ స్థానిక శివాలయాన్ని సందర్శించారు.

రాహుల్‌కు చేతకాకే.. ప్రియాంకకు ఆ బాధ్యతలు: సుమిత్రా మహాజన్

ఇండోర్: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ఒంటరిగా రాజకీయాలు చేయలేరనేందుకు... పార్టీ తూర్పు ఉత్తర్‌ప్రదేశ్ వ్యవహారాలను ప్రియాంకా గాంధీకి అప్పగించడమే నిదర్శనమని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ వ్యాఖ్యానించారు. 1989 నుంచి ఇండోర్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న భాజపా సీనియర్ నేత మహాజన్ ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఇండోర్‌లో పర్యటిస్తున్న సందర్భంగా గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వారు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ- "కాంగ్రెస్ కుటుంబ రాజకీయాల జోలికి నేను వెళ్లదలచుకోలేదు. అది వారి సొంత విషయం. కాకపోతే... ఒక విషయం చెప్పదలచుకున్నా. నాయకత్వ లక్షణాలు, సామర్థ్యం ఉన్నవారికి ఒక అవకాశం ఇవ్వాలి. ప్రియాంక చాలా మంచి వ్యక్తి. ఆమెకు తూర్పు ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ బాధ్యతలను అప్పగించడం ద్వారా ఒక విషయం అర్థమవుతోంది. ఒంటరిగా రాజకీయాలు చేయలేకే రాహుల్‌గాంధీ తన సోదరి సాయం తీసుకున్నట్టుంది" అని మహాజన్ వ్యాఖ్యానించారు. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్న మధ్యప్రదేశ్ నేత జ్యోతిరాదిత్య సింధియాకూ ఆమె అభినందనలు తెలిపారు.

నిర్మాణంలోని భవనం కూలి ఆరుగురి మృతి

గురుగ్రామ్: నిర్మాణంలో ఉన్న నాలుగంతస్తుల భవనం కుప్పకూలిన దుర్ఘటనలో గురువారం ఆరుగురు కూలీలు మృతి చెందారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. హరియాణాలోని గురుగ్రామ్ సెక్టార్ 65కు సమీపంలోని ఉల్లావాస్ గ్రామంలో తెల్లవారు జామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సహాయక చర్యలు చేపట్టిన గాజియాబాద్, దిల్లీలకు చెందిన 5 జాతీయ విపత్తు స్పందన దళ (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలు 6 మృతదేహాలను వెలికి తీశాయి. స్థానిక పోలీసులు, అగ్ని మాపక దళ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. భారీఎత్తున కాంక్రీట్, ఇనుప చట్రాలు ఉండటంతో శిథిలాలను తొలగించడానికి సహాయక బృందాలు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. నాలుగో అంతస్తులో ఇటీవల వేసిన పైకప్పు తొలుత పెద్ద శబ్దంతో పడిపోగా అనంతరం భవనం



మృతదేహాలను వెలికితీస్తున్న సహాయక సిబ్బంది

కుప్పకూలినట్లు అధికారులు తెలిపారు. రెండు, మూడు అంతస్తుల్లో ఉన్న కూలీలంతా నిద్రపోతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. భవనం కుప్పకూలడానికి గల కారణాలు తెలియరాలేదు. భవన యజమాని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వెనెజువెలాలో రాజకీయ సంక్షోభం

- అధ్యక్షుడిగా ప్రకటించుకున్న విపక్షనేత

కారకస్: దక్షిణ అమెరికా ఖండంలోని వెనెజువెలా దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. తానే దేశ అధ్యక్షుడునని ప్రతిపక్ష నేత జువాన్ గుయాడో (35) బుధవారం రాజధాని కారకస్‌లో ప్రజల సమక్షంలో ప్రకటించుకున్నారు. అధ్యక్షునిగా ఆయనను గుర్తిస్తున్నట్టు అమెరికాతో పాటు, పొరుగుదేశాలైన బ్రెజిల్, కొలంబియా, పెరు, అర్జెంటినాలు ప్రకటించాయి. అయితే ఈ చర్యను రష్యా, క్యూబా, టర్కీ వంటి దేశాలు ఖండించాయి. అధ్యక్షుడు నికోలస్ మదురోకే మద్దతు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య చర్చలు జరగాలని ఐక్యరాజ్య సమితి సూచించగా, తాజాగా ఎన్నికలు జరపడమే మేలని యూరోపియన్ యూనియన్ అభిప్రాయపడింది. చమురు నిల్వలు అధికంగా ఉన్న దేశం అయినప్పటికీ మదురో పాలనలో వెనెజువెలా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఆయన సైన్యం, రష్యా సహకారంతో పాలన కొనసాగిస్తున్నారు. పరిస్థితులను గమనించిన విపక్ష నేత గుయాడో తనను తాను అధ్యక్షునిగా ప్రకటించుకున్నారు. అది జరిగిన కొన్ని నిమిషాల్లోనే ఆయనను దేశ తాత్కాలిక నేతగా గుర్తిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన విడుదల చేశారు. దీనికి బదులుగా అమెరికాతో దౌత్య సంబంధాలను రద్దు చేస్తున్నట్టు అధ్యక్షుడు మదురో తెలిపారు. అయితే మాజీ అధ్యక్షునిగా మారినందున ఆయనకు ఆ అధికారం లేదని అమెరికా తిప్పికొట్టింది. వెనెజువెలా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంటోందని రష్యా ఆరోపించింది. దేశంలో గత రెండు రోజులుగా జరుగుతున్న అల్లర్లలో 13 మంది మృతి చెందారు.

ఛాంపియన్


ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

క్వార్టర్స్‌లో సింధు, సైనా, శ్రీకాంత్

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు పి.వి. సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ సింధు 23-21, 21-7తో జార్జియా మరిస్కా (ఇండోనేసియా)పై, 8వ సీడ్ సైనా 21-17, 21-15తో ఫిత్రియాని (ఇండోనేసియా)పై గెలిచారు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో 8వ సీడ్ శ్రీకాంత్ 21-14, 21-9తో కెంటా నిషిమొటొ (జపాన్)పై నెగ్గాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సుమీత్‌రెడ్డి- మను అత్రి 14-21, 21-17, 10-21తో కిమ్ ఆస్ట్రప్- ఆండర్స్ రస్ముసెన్ (డెన్మార్క్) చేతిలో ఓడారు. క్వార్టర్‌ఫైనల్స్‌లో మారిన్‌తో సింధు, పోర్న్‌పావీతో సైనా, క్రిస్టీతో శ్రీకాంత్ తలపడతారు.

కార్ల్‌సన్ చేతిలో ఆనంద్ ఓటమి

లీడెన్ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ టోర్నీలో ఆనంద్ టైటిల్ ఆశలకు ఎదురుదెబ్బ. పదో రౌండ్లో అతడు ప్రపంచ ఛాంపియన్ కార్ల్‌సన్ (నార్వే) చేతిలో ఓడిపోయాడు. కార్ల్‌సన్ ఏడు పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. అనిష్ గిరి 6.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఆనంద్ (6) మూడో స్థానానికి పడిపోయాడు.

ఇక ఆడుకోవచ్చు

హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ మళ్లీ మైదానంలో అడుగుపెట్టనున్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడారన్న ఆరోపణలపై వారిపై విధించిన సస్పెన్షన్‌ను బీసీసీఐ తొలగించింది. పాండ్య వెంటనే న్యూజిలాండ్‌కు వెళ్లనున్నాడు.

పాండ్య, రాహుల్‌లపై సస్పెన్షన్ ఎత్తివేత

దిల్లీ

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో సస్పెన్షన్‌కు గురైన హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. వారి సస్పెన్షన్‌ను పరిపాలకుల కమిటీ (సీఓఏ) వెంటనే ఎత్తివేసింది. సుప్రీంకోర్టు సహాయకుడు పీఎస్ నరసింహను సంప్రదించిన తర్వాత సీఓఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఐతే ఆటగాళ్లపై విచారణ కొనసాగుతుంది. సుప్రీంకోర్టు నియమించే అంబుడ్స్‌మన్ ఆటగాళ్లపై చర్యలపై తుది నిర్ణయం తీసుకుంటాడు. "బీసీసీఐ రాజ్యాంగంలోని నిబంధన 16 కింద సస్పెన్షన్ ఎత్తివేయాలని నిర్ణయించాం" అని బీసీసీఐ విడుదల చేసిన ప్రకటనలో సీఓఏ పేర్కొంది. ఈ కేసు ఫిబ్రవరి 5న కోర్టులో విచారణకు రానుంది. రాహుల్, పాండ్య ఓ టీవీ షోలో మహిళలపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో.. బోర్డు వారిని ఆస్ట్రేలియా పర్యటన నుంచి వెనక్కి పిలిపించిన సంగతి తెలిసిందే.



న్యూజిలాండ్‌కు హార్దిక్

సస్పెన్షన్ తొలగిపోవడంతో పాండ్య న్యూజిలాండ్ పర్యటనకు సిద్ధమవుతాడు. అందుబాటులో ఉండే తొలి విమానంలో అతడు బయలుదేరతాడు. ఒకవేళ కర్ణాటక రంజీ ట్రోఫీ ఫైనల్ చేరితే రాహుల్ ఆ జట్టు తరఫున ఆడతాడు. కివీస్ పర్యటనకు రాహుల్ ఎంపిక కాని సంగతి తెలిసిందే. విచారణ కొనసాగుతుండగా ఆటగాళ్లను ఆడనివ్వాలని మొదట ప్రతిపాదించింది బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా. "ఈ కేసు పరిపాలనాపరమైన గొడవగా మారాలని నేను కోరుకోవట్లేదు. హార్దిక్, రాహుల్ తిరిగి మైదానంలో అడుగుపెట్టడం నాకు అన్నింటికన్నా ముఖ్యం. కోర్టు కేసు కొనసాగుతుండగా బెన్ స్టోక్స్ ఆడినప్పుడు.. హార్దిక్, రాహుల్ ఎందుకు ఆడకూడదు" అని ఖన్నా అన్నాడు. ఆటగాళ్లపై చర్యల విషయంలో సీఓఏ ఛైర్మన్ వినోద్ రాయ్, సభ్యురాలు ఎడుల్జీ మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. వాళ్లపై నిషేధాన్ని రెండు మ్యాచ్‌లతో సరిపెట్టాలన్న రాయ్ ఆలోచనను ఎడుల్జీ తిరస్కరించింది. క్రికెటర్లపై చర్యలపై తీసుకునే ప్రక్రియలో బీసీసీఐ ఆఫీస్ బేరర్లనూ భాగం చేయాలన్న ఎడుల్జీ ప్రతిపాదనను రాయ్ తోసిపుచ్చాడు. ఆటగాళ్లపై నిర్ణయం తీసుకోవడానికి అంబుడ్స్‌మన్‌ను నియమించాలంటూ సీఓఏ చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆటగాళ్లపై బోర్డు మరీ కఠినంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆటగాళ్లు తమ తప్పుల నుంచి ఇప్పటికే పాఠాలు నేర్చుకుని ఉంటారని, ఈ గొడవను ఇంతటితో వదిలేయాలని మాజీ కెప్టెన్లు గంగూలీ, ద్రవిడ్ అభిప్రాయపడ్డారు.


మంధాన

మెరిసిన మంధాన మురిసిన భారత్

స్మృతి 105

కివీస్‌తో తొలి వన్డేలో ఘన విజయం

నేపియర్

అబ్బాయిలే కాదు.. న్యూజిలాండ్ పర్యటన తొలి మ్యాచ్‌లో భారత అమ్మాయిలూ అదరగొట్టారు. ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భాగంగా గురువారం న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు 9 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. మొదట స్పిన్నర్లు బిస్త్ (3/32), పూనమ్ యాదవ్ (3/42), దీప్తి శర్మ (2/27)ల ధాటికి న్యూజిలాండ్ 48.4 ఓవర్లలో 192 పరుగులకే కుప్పకూలింది. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన (105; 104 బంతుల్లో 9×4, 3×6) ధనాధన్ సెంచరీకి తోడు.. జెమీమా రోడ్రిగ్జ్ (81 నాటౌట్; 94 బంతుల్లో 9×4) మెరుపు బ్యాటింగ్ తోడవడంతో స్వల్ప లక్ష్యాన్ని భారత్ 33 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. లక్ష్య ఛేదనలో కివీస్ బౌలర్లు భారత అమ్మాయిలను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయారు. 22 ఏళ్ల మంధాన ఆరంభం నుంచి తన దైన శైలిలో భారీ షాట్‌లతో ప్రత్యర్థిపై విరుచుకుపడింది. యువ సంచలనం జెమీమా కూడా ఆమెతో పోటీపడి పరుగులు సాధించింది. కెరీర్‌లో ఐదో వన్డే ఆడుతున్న ఆమె తొలి అర్ధసెంచరీ చేసుకోగా.. మంధాన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ కెరీర్లో నాలుగో సెంచరీని అందుకుంది. తొలి వికెట్‌కు ఈ ఇద్దరు ఓపెనర్లు కలిసి 190 పరుగులు జోడించడం విశేషం. విజయానికి మూడు పరుగుల దూరంలో మంధాన నిష్క్రమించింది. అంతకుముందు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న కెప్టెన్ మిథాలీ రాజ్ నమ్మకాన్ని బౌలర్లు వమ్ము చేయలేదు. స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో న్యూజిలాండ్ బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. బౌలర్లు తీసిన 9 వికెట్లలో 8 స్పిన్నర్లకే దక్కాయి. దీప్తి శర్మ పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు 2 వికెట్లు తీయగా.. పూనమ్ మిడిలార్డర్‌ను పడగొట్టి కివీస్‌ను కోలుకోకుండా చేసింది. ఓపెనర్లు బేట్స్ (36), డెవిన్ (28), కెప్టెన్ సాటర్త్‌వెయిట్ (31) మినహా ఆ జట్టులో మిగతావారు పెద్దగా పరుగులు చేయలేదు. ఈ నెల 29న రెండో వన్డే జరుగుతుంది.


నిప్పులు చెరిగిన ఉమేశ్

105కే కుప్పకూలిన కేరళ ● విదర్భతో రంజీ సెమీఫైనల్


ఉమేశ్

వాయనాడ్ (కేరళ): ఉమేశ్ యాదవ్ విజృంభించడంతో కేరళతో రంజీ సెమీఫైనల్లో తొలి రోజు, గురువారం విదర్భ బలమైన స్థితిలో నిలిచింది. ఉమేశ్ (7/48) పదునైన పేస్‌కు విలవిల్లాడిన కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 105 పరుగులకే కుప్పకూలింది. వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఉమేశ్.. రంజీ ట్రోఫీలో 100 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. ముగ్గురు కేరళ బ్యాట్స్‌మెన్ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. విష్ణు (37 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆట ముగిసే సమయానికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఫజల్ (75) రాణించాడు.

కర్ణాటక 264/9: సౌరాష్ట్రతో బెంగళూరులో ఆరంభమైన మరో సెమీఫైనల్లో కర్ణాటక తొలి రోజు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. గోపాల్ (87), శరత్ (74 బ్యాటింగ్), మనీష్ పాండే (62) రాణించారు. ఉనద్కత్ నాలుగు వికెట్లు పడగొట్టాడు.


క్విటోవా

ప్లిస్కోవాపై గెలిచి ఫైనల్‌కు


ఒసాకా

ఒసాకా దూకుడు

క్విటోవాతో టైటిల్ పోరు

తుది సమరానికి నాదల్

నొవోమి ఒసాకా దూకుడు మీదుంది. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఈ జపాన్ అమ్మాయి ఆస్ట్రేలియన్ ఓపెన్లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. కత్తిపోటుకు గురై పునరాగమనం చేసిన తర్వాత చెక్ అమ్మాయి క్విటోవా తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్ చేరింది. మరోవైపు పురుషుల విభాగంలో సంచలనాల సిట్సిపాస్‌ను చిత్తు చేసిన స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు.

25 గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు చేరడం నాదల్‌కు ఇది 25వ సారి.

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆఖరి ఘట్టానికి చేరింది. మహిళల సింగిల్స్‌లో జపాన్ కెరటం ఒసాకా.. చెక్ రిపబ్లిక్ స్టార్ పెట్రా క్విటోవా తుది సమరానికి అర్హత సాధించారు. గురువారం హోరాహోరీ సాగిన సమరంలో ఒసాకా 6-2, 4-6, 6-4తో ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)ను ఓడించింది. తొలి సెట్లో 16 విన్నర్లు కొట్టిన ఒసాకా.. రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి 6-2తో సెట్ గెలుచుకుంది. అయితే రెండో సెట్లో ప్లిస్కోవా బలంగా పుంజుకుంది. తొమ్మిదో గేమ్‌లో ఒసాకా రెండు అనవసర తప్పిదాలు చేయడంతో 5-4తో ఆధిక్యంలో నిలిచిన ప్లిస్కోవా ఆ తర్వాత 6-4తో సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. ఏడు నిమిషాల పాటు సాగిన మూడో సెట్ మూడో గేమ్‌ను నిలబెట్టుకున్న ఒసాకా.. ఆ తర్వాత గేమ్‌లోనే ప్లిస్కోవా సర్వీస్ బ్రేక్ చేసి 5-3తో ఆధిక్యంలో నిలిచింది. ఆపై సర్వీస్ నిలబెట్టుకుని 6-3తో సెట్‌తో పాటు మ్యాచ్ గెలుచుకుంది. తుది సమరంలో ఒసాకా.. క్విటోవాతో తలపడనుంది. మరో సెమీస్‌లో ఎనిమిదో సీడ్ క్విటోవా 7-6 (7-2), 6-0తో అన్‌సీడెడ్ డానియల్ కోలిన్స్ (అమెరికా)ను ఓడించింది. తొలి సెట్లో తప్ప.. క్విటోవా జోరు ముందు కోలిన్స్ నిలువలేకపోయింది. రెండో సెట్లో ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా ఇవ్వకుండా 6-0తో గెలిచింది క్విటోవా.



నాదల్ ఫటాఫట్


మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన స్పెయిన్ వీరుడు రఫెల్ నాదల్ అలవోకగా ఫైనల్లో అడుగుపెట్టాడు. ఏకపక్షంగా సాగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో నాదల్ 6-2, 6-4, 6-0తో గ్రీసు కుర్రాడు స్టెఫానోస్ సిట్సిపాస్‌ను చిత్తు చేశాడు. తొలి సెట్ నాలుగో గేమ్‌లో సిట్సిపాస్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-1తో ఆధిక్యంలోకి వెళ్లిన రఫా.. ఆ తర్వాత ఎనిమిదో గేమ్‌లో మరోసారి బ్రేక్ సాధించి 6-2తో సెట్ గెలుచుకున్నాడు. రెండో సెట్లో చక్కటి సర్వీసులతో ఆకట్టుకున్న సిట్సిపాస్.. నాదల్‌కు పోటీ ఇచ్చాడు. కానీ అది కాసేపే..! తొమ్మిదో గేమ్‌లో పదునైన విన్నర్‌తో సిట్సిపాస్ సర్వీస్ బ్రేక్ చేసిన నాదల్.. ఆ తర్వాత సర్వీస్ నిలబెట్టుకుని 6-4తో సెట్ సాధించాడు. మూడో సెట్లో సిట్సిపాస్ పూర్తిగా తేలిపోయాడు. జకోవిచ్- పౌలీ మధ్య జరిగే సెమీస్ విజేతతో నాదల్ టైటిల్ కోసం తలపడనున్నాడు.

పురుషుల రెండో సెమీస్ నేడు
జకోవిచ్ (సెర్బియా) × లూకాస్ పౌలీ (ఫ్రాన్స్)
- మధ్యాహ్నం 2 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

శ్రీలంక 144

బ్రిస్బేన్: శ్రీలంకతో తొలి టెస్టులో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. పర్యటక జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకే కుప్పకూల్చిన కంగారూల జట్టు.. మ్యాచ్‌పై పట్టు సాధించే దిశగా దూసుకెళ్తోంది. గురువారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. మార్కస్ హారిస్ (40 బ్యాటింగ్), నాథన్ లైయన్ (0) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ప్యాట్ కమిన్స్ (4/39), అరంగేట్ర పేసర్ జే రిచర్డ్‌సన్ (3/26) స్టార్క్ (2/41) విజృంభించడంతో లంక కథ 144 పరుగులకే ముగిసింది. డిక్వెలా (64) పోరాడాడు.

ఇంగ్లాండ్ 77 ఆలౌట్


రోచ్

బ్రిడ్జ్‌టౌన్: కీమర్ రోచ్ (5/17), హోల్డర్ (2/15), జోసెఫ్ (2/20) విజృంభించడంతో వెస్టిండీస్‌తో తొలి టెస్టులో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూలింది. గురువారం రెండో రోజు ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 30.2 ఓవర్లలో 77 పరుగులకే కుప్పకూలింది. ఒక దశలో 35/1తో ఉన్న ఇంగ్లాండ్.. విండీస్ బౌలర్ల ధాటికి స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయి ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 289 పరుగులు చేసిన విండీస్... 212 పరుగుల భారీ ఆధిక్యాన్ని సాధించింది.

పదో తరగతిపై ప్రత్యేక దృష్టి

- విద్యార్థులను గ్రేడ్ల వారీగా విభజించి శిక్షణ
- 100 శాతం ఉత్తీర్ణత కోసం సంక్షేమ గురుకులాల ప్రణాళికలు



ఈనాడు డిజిటల్-అమరావతి: పదో తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ గురుకులాలు ఈ సంవత్సరం ప్రత్యేక ప్రణాళికలు రచించి అమలు చేస్తున్నాయి. తొలిసారిగా గ్రేడ్ల వారీగా విభజించి 10 జీపీఏ సాధించే విద్యార్థుల సంఖ్యను పెంచేలా కసరత్తు చేపట్టాయి. 2018-19లో కనీసం 1700 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి.

ప్రణాళిక ఇలా..

- సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ గురుకులాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 12,500 మంది ఉన్నారు. వీరిలో నుంచి 10 జీపీఏ సాధించే అవకాశం ఉన్న 1500 మంది విద్యార్థులను ఇప్పటికే ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. గతంలో నిర్వహించిన పరీక్షల్లో సాధించిన మార్కులతోపాటు, ప్రధాన కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పరీక్షలో కనబర్చిన ప్రతిభ ఆధారంగా వీరిని ఎంపిక చేశారు. గత సెప్టెంబరు నుంచే వీరికి ప్రత్యేక శిక్షణ కొనసాగుతోంది.
- గురుకులాల అధికారులే ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్స్ రూపొందించి విద్యార్థులకు అందిస్తున్నారు. గత ఏడాది ప్రశ్నపత్రాలతో సాధన చేయించడంతోపాటు, వారిలో పోటీ వాతావరణాన్ని పెంచేందుకు ప్రతి రోజూ విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా మాట్లాడుతున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి కల్నల్ రాములు తెలిపారు.
- అనుత్తీర్ణులయ్యే అవకాశం ఉన్న విద్యార్థులపైనా గురుకులాలు ప్రధాన దృష్టి సారించాయి. ఇలాంటి వారు 400 మంది వరకూ ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా వీరంతా ఆంగ్లం, గణితం, సైన్స్ వంటి అంశాల్లోనే వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు. ఇలాంటి వారికి పాఠ్యాంశాలను అంశాలవారీగా సులభంగా అర్థమయ్యేలా, కనీసం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైనా మార్కులు సాధించేందుకు వీలుగా ప్రత్యేక స్టడీ మెటీరియల్ రూపొందించి అందించారు. తరచూ పరీక్షలు నిర్వహించి ఎక్కడ వెనుకబడ్డారో గుర్తిస్తున్నారు.
- విద్యార్థులను గ్రేడ్ల వారీగా విభజించి ఎస్సీ, ఎస్టీ గురుకులాలు విద్యార్థులను సన్నద్ధం చేస్తుండగా.. బీసీ గురుకులాలు ప్రత్యేక పంథాను ఎంచుకున్నాయి. పరీక్షలకు సన్నద్ధం చేయడంతోపాటు విద్యార్థుల్లో భయాన్ని తొలగించేందుకు గురువారం నుంచి ఇంటెన్సివ్ పరీక్షలు (ప్రత్యేక శిక్షణతో కూడిన పరీక్షలు) నిర్వహించనున్నాయి. ఇవి ఫిబ్రవరి నెలాఖరు వరకూ కొనసాగుతాయని బీసీ సంక్షేమ గురుకులాల కార్యదర్శి కృష్ణమోహన్ తెలిపారు.

గురుకులాల వారీగా గత రెండేళ్ల ఫలితాలు

సం.	ఉత్తీర్ణత శాతం	10 జీపీఏ సాధించినవారు
సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాలు-372		
2016-17	94	13
2017-18	94	53
బీసీ గురుకులాలు- 43		
2016-17	96.5	6
2017-18	97.8	54



అమరావతిలో గణతంత్ర వెలుగులు

రంగులకాంతులతో ఆకట్టుకున్న భవనాలు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వెలగపూడిలోని సచివాలయ ప్రాంగణమంతా గురువారం రాత్రి విద్యుద్దీపాల కాంతులతో జిగేల్‌మంది. సచివాలయంలోని మొత్తం 5 బ్లాకులతో పాటు అసెంబ్లీ, శాసనమండలి, పార్కు పరిసరాలన్నీ ప్రస్తుతం తళుకులీనుతున్నాయి. మువ్వన్నెల జెండా రంగులను ప్రతిబింబించేలా అయిదో బ్లాకుకు ప్రత్యేకంగా అమర్చిన త్రీడీ లైటింగ్ చూపరులకు కనువిందు చేసింది. **- ఈనాడు, అమరావతి**

విద్యుత్తు కార్మికుల శ్రమ దోపిడీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ధ్వజం

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: ప్రజల నుంచి సక్రమంగా బిల్లు వసూళ్లలో కీలకంగా వ్యవహరిస్తున్న విద్యుత్తు మీటర్ రీడింగ్ కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు ఆరోపించారు. విజయవాడలో గురువారం నిర్వహించిన విద్యుత్తు మీటర్ల పరిశీలన కార్మికుల రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కీలకమైన పని నిర్వహిస్తున్న మీటర్ రీడర్ల పనికి తగిన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ.. మీటర్ రీడర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, వీరి సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి శుక్రవారం సమ్మె నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్.శ్రీనివాస్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్ల సంఘం నాయకులు రామయ్య, మీటర్ రీడర్ల సంఘం నాయకులు హజరత్ వలీ తదితరులున్నారు.

అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి

ప్రజాసంఘాల నిరసన

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ప్రజల పక్షాన నిజాయతీగా పని చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారంటూ.. ఇటువంటి కుయుక్తులు వెంటనే మానుకోవాలంటూ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, చిత్తూరు జిల్లా కన్వీనర్ ఆంజనేయులు, ప్రజా కళామండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయ్‌లను మదనపల్లి బస్టాండ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారనీ.. వీరిని తక్షణం విడిచి పెట్టాలన్నారు. గురువారం విజయవాడ లెనిన్ కూడలిలో నిర్వహించిన ధర్నాలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.ఏసు, టి.ఆంజనేయులు, కె. పోలారి, అరసవెల్లి కృష్ణ, ఎన్.క్రాంతికుమార్, బి.విజయ భాస్కరరావు, రాధ, టి. శ్రీరాములు, దుడ్డు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ లెనిన్‌కూడలిలో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు కె.ఏసు, అరసవెల్లి కృష్ణ, కె. పోలారి, ఎన్.క్రాంతికుమార్, రాధ తదితరులు

'ఆర్వీఎస్' విద్యార్థులకు సర్దుబాటు!

సర్కారీ వైద్య కళాశాలల్లో చేర్చే విషయమై వైద్యశాఖలో సమాలోచనలు

ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లా ఆర్వీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎంబీబీఎస్ విద్యార్థులను హైకోర్టు, జాతీయ వైద్య మండలి ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సర్దుబాటు చేసే విషయమై వైద్య ఆరోగ్య శాఖలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలన్న దానిపై సమాలోచనలు జరుగుతున్నాయి. 2016-17 విద్యా సంవత్సరంలో ఆర్వీఎస్ వైద్య కళాశాలలో ఎ,బి,సి కేటగిరిల కింద 150 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కానీ కళాశాలలో బోధనకు తగినట్లు సౌకర్యాలు లేకపోవడం వంటి కారణాలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనలకు దిగారు. చివరికి హైకోర్టు జారీచేసిన ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 150 మంది విద్యార్థులను 'వన్‌టైం' విధానంలో సర్దుబాటు చేయాలని జాతీయ వైద్యమండలి గత నెలలో వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని అన్ని సీట్లను కన్వీనర్ కోటాలో కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మాదిరిగా బి,సి కేటగిరి సీట్లు ఇక్కడ లేవు. అదీకాకుండా కన్వీనర్ కోటా కింద ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చేరే విద్యార్థుల నుంచి తీసుకున్న ఫీజు చాలా తక్కువ. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని అధికారిక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. అప్పుడే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 3వ సంవత్సరంలోనికి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుంది. మరోవైపు తమ పిల్లలకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు రాష్ట్ర వైద్యశాఖ మంత్రి ఫరూక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అవసరమైన అధికారిక ఉత్తర్వులు త్వరలోనే జారీచేస్తామని మంత్రి ఫరూక్ వారికి హామీ ఇచ్చారు.

ఆర్థిక ప్రాతిపదికన 10 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

మానవ హక్కుల వేదిక

ఈనాడు, హైదరాబాద్: అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మానవ హక్కుల వేదిక ఆరోపించింది. ఈ చట్ట సవరణ వల్ల అనాదిగా కుల వివక్షకూ, వెలివేతకూ గురవుతున్న కులాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని పేర్కొంది. సమానత్వం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ ఆదర్శాలను పక్కకు తోసి కులాధిపత్యం, కుల దురహంకారాన్ని ఈ చట్టం స్థిరీకరించనుందని అభిప్రాయపడింది. ఈ మేరకు మానవహక్కుల వేదిక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.జీవన్‌కుమార్, వీఎస్ కృష్ణ, వేమన వసంతలక్ష్మి, ఎ.చంద్రశేఖర్‌లు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఈ సవరణ ప్రవేశ పెట్టే ముందు విస్తృత స్థాయి అధ్యయనం చేపట్టలేదని పేర్కొన్నారు. ఆర్థికంగా బలహీనమైన సెక్షన్లు ఎవరో తేల్చి చెప్పే సహేతుక వర్గీకరణ ఏదీ ఈ సవరణలో లేదని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికార భాజపా ఈ సవరణ ప్రతిపాదించగా ప్రతిపక్ష పార్టీలు కూడా కలిసిపోయాయని విమర్శించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512

రయ్ రయ్

■ autopage@eenadu.in



స్టీరింగ్ తిప్పేయాలని తెగ ఆశ..
కానీ ప్రమాదం జరుగుతుందేమోనని భయం!
కారు నడపడం బాగా ఇష్టమే.. అయినా
సొంత సామర్థ్యంపై అపనమ్మకం!
డ్రైవింగ్ ఫోబియా ఉన్నవాళ్ల లక్షణాలివి...
అవకాశం ఉన్నా ఇలాంటి అపోహలతో
30శాతం మంది డ్రైవింగ్‌కి దూరం
అవుతున్నారంటున్నాయి సర్వేలు...
కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ ఆందోళనని
పారదోలడం ఏమంత కష్టం కాదు.

భయమెందుకు భయ్యా!

డ్రైవింగ్ రాకెట్ సైన్స్ కాదన్నది అనుభవజ్ఞుల మాట. రాకెట్ సైన్స్ కాకపోయినా ఇది సైకాలజీకి సంబంధించిన విషయం అని చెప్పొచ్చు. ఆ కిటుకులు పట్టేస్తే భయం, వణుకు ఇట్టే తరిమేయొచ్చు.

మొదటి దారి: డ్రైవింగ్ కోర్సులో చేరండి

డ్రైవింగ్ స్కూల్‌లో అనుభవజ్ఞులు ఉంటారు. సొంతంగా డ్రైవింగ్ నేర్చుకోవడానికి, నిపుణులైన వారి సమక్షంలో నేర్చుకోవడానికి తేడా ఉంటుంది. వాళ్లు రోడ్డు నిబంధనల గురించి వివరిస్తారు. అక్కడ సిమ్యులేటర్ మీద సాధన చేయిస్తారు. క్లచ్, బ్రేక్, యాక్సిలరేటర్ తేడాలు వివరిస్తారు. హిల్‌సైడ్, నైట్ మోడ్, లేన్ ఛేంజ్ కాకుండా నడపడం.. ఇలా అన్ని రకాలుగా మనని పరీక్షిస్తారు. వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తే తర్వాత రియల్ స్టీరింగ్ పట్టుకున్నపుడు ఎలాంటి బెరుకు లేకుండా సాఫీగా ప్రయాణం సాగించవచ్చు.

రెండో దారి: హద్దులు మీరొద్దు

కొత్తగా డ్రైవింగ్ నేర్చుకుంటున్నపుడు ఒకరకమైన ఆందోళన, భయం ఉండటం సహజం. ఇంకొందరికి అత్యుత్సాహం కూడా ఉంటుంది. ఈ రెండూ వద్దు. దానికోసం మనకు మనమే కొన్ని షరతులు నిర్దేశించుకోవాలి. పరిమిత వేగంతోనే జాగ్రత్తగా బండి నడపడం, ఎప్పుడూ రోడ్డు ఎడమవైపు లేన్‌లోనే వెళ్లడం, ఎట్టి పరిస్థితుల్లోనూ వేగంగా వరుసలు మారకపోవడం, మారాల్సి వస్తే ఇండికేటర్లు వేయడం, డ్రైవింగ్‌లో నైపుణ్యం సాధించేవరకు హైవేలు ఎక్కకపోవడం ఇలాంటివి.

మూడో దారి: అనుకూల పరిసరాలు

కారులో ఉండే ప్రతికూల పరిస్థితులు సైతం డ్రైవరుకు చికాకు తెప్పించి ఏకాగ్రత కోల్పోయేలా చేస్తాయి. ఇలా జరగకుండా ఉండాలంటే లోపల అంతా ప్రశాంతంగా, సౌకర్యవంతంగా ఉండాలి. ఇబ్బంది కలిగించని విధంగా అనుకూలంగా ఉండే దుస్తులు, షూలు ధరించాలి. డ్రైవింగ్ ప్రారంభించడానికి ముందు రిలాక్స్‌గా ఉండాలి. ఇష్టమైన సంగీతం వినాలి. కారులో కూర్చున్నవారు సైతం గోల చేయకుండా నిశ్శబ్దం పాటించమని చెప్పాలి.

నాలుగో దారి: సాధన చేద్దాం

కొందరికైతే సీట్లో కూర్చోగానే ఒంట్లో వణుకు మొదలవుతుంది. మెడ కండరాలు బిగుసుకుపోయినట్టు ఇబ్బంది పడతారు. ఇలాంటపుడు దీర్ఘ శ్వాస తీసుకొని ఊపిరితిత్తుల నిండా గాలి పీల్చుకోవాలి. తర్వాత నెమ్మదిగా బయటికి వదలాలి. పదిసార్లు ఇలా చేస్తే శరీరం రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి పోవాలంటే ప్రోగ్రెసివ్ మజిల్ రిలాక్సేషన్ పద్ధతి అనుసరించాలి. శరీరంలోని మజిల్ గ్రూప్స్‌ని ఒక్కసారి బిగుతుగా మరోసారి వదులుగా చేస్తూ సాధన చేయాలి. అరచేయి పిడికిలిలా గట్టిగా బిగించి ఏడునుంచి పది సెకన్లపాటు ఉంచి తెరవాలి. చేతులు, తల, వెనుకభాగం, కాళ్లు, వేళ్లు.. ఇలా ఇతర కండరాలను సైతం ఇదేరకంగా రోజులో ఇరవై నిమిషాలపాటు చేస్తే ఆందోళన తగ్గి ఏకాగ్రత పెరుగుతుంది.


క్రమపద్ధతి పాటించాలి

సాధారణంగా మొదటిసారి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నపుడు ఎవరికైనా ఒకరమైన ఆందోళన, భయం ఉంటాయి. ఓ మోస్తరు నడపగలిగేవాళ్లు కూడా ట్రాఫిక్ ఎక్కువగా ఉంటే జంకుతారు. అనవసర తప్పిదాలు చేస్తారు. ఇలాంటి సందర్భాల్లో బాగా డ్రైవింగ్ చేయగలిగిన వాళ్లు పక్కసీట్లో కూర్చుంటే సగం భయం ఎగిరిపోతుంది. కొత్తవాళ్లు ముందు బాగా స్టీరింగ్ తిప్పడం, బ్రేక్ వేయడం, యాక్సిలరేటర్ నొక్కడం, సందర్భానుసారంగా గేర్ వేయడం సాధన చేయాలి. ఇవన్నీ జనం ఎవరూ లేని చోట ప్రాక్టీస్ చేయాలి. డ్రైవ్ చేయగలను అనే నమ్మకం కలిగాక చిన్నచిన్న మలుపుల దగ్గర, కొద్దిగా ట్రాఫిక్ ఉన్నచోట నడపాలి. అదీ పరిమిత వేగంలోనే. ఇదంతా ఒక క్రమపద్ధతిలో పాటిస్తూ, వీలైనంత ఎక్కువ సాధన చేస్తే భయం వదిలి ఎవరైనా పూర్తి ఆత్మవిశ్వాసంతో నడపగలుగుతారు.



- **సుధీర్ రాపోలు,** మారుతీ మోటార్ డ్రైవింగ్ స్కూల్

మెకానిక్‌గురూ



క్లచ్ ప్లేట్‌లో.. ఆ శబ్దాలేంటి?

■ బండి కొని ఏడాదిన్నర అయింది. పన్నెండువేల కిలోమీటర్లు తిరిగాను. రెండో గేరులో వెళ్తున్నపుడు దడ్‌దడ్‌మని శబ్దాలు వినిపిస్తున్నాయి. క్లచ్ కూడా బిగుసుకుపోతోంది. మెకానిక్ దగ్గరికి తీస్కెళ్తే క్లచ్, ప్రెషర్ ప్లేట్ మార్చాలని చెబుతున్నాడు. వీటికి గ్యారెంటీ ఉంటుందా? - కిరణ్‌కుమార్, కరీంనగర్

సమస్య క్లచ్‌లోనే ఉందనిపిస్తోంది. అన్ని క్లచ్‌ల్లో సాధారణంగా ఉండే సమస్య ఏంటంటే.. డిస్క్‌లోని ఫ్రిక్షన్ మెటీరియల్‌లో పగుళ్లు ఏర్పడినపుడు ఇలాంటి సమస్య మొదలవుతుంది. వాటిని తప్పనిసరిగా మార్చాల్సిందే. క్లచ్‌లు, ఎలక్ట్రికల్ విడిభాగాలకు ఎలాంటి గ్యారెంటీ, వారంటీ ఉండదు.

- **సాయిభరత్ బొప్పరాజు,** www.motofix.in

(మీకూ ఇలాంటి సమస్యలు, సందేహాలుంటే రాసి పంపండి. నిపుణులతో సమాధానాలు ఇప్పిస్తాం)



కిక్స్‌నిచ్చే ఎస్‌యూవీ.. సాహసాల వీ-స్ట్రామ్

ఎస్‌యూవీ అభిమానుల కోసం నిస్సాన్ కిక్స్ కారు...
సాహస రైడర్లకు సుజుకీ వీ స్ట్రామ్ 650 ఎక్స్‌టీ మోటార్‌సైకిల్...
ఈ వారంలో మార్కెట్లోకి రంగప్రవేశం చేశాయి...
ఆయా సెగ్మెంట్లలో మేటి ఫీచర్లు జోడించామంటున్నాయి కంపెనీలు...
ఆ ప్రత్యేకతలు, ధరలు, పోటీదారుల వివరాలివి.

తెలివైన కారు

పదిలక్షల రూపాయల స్పోర్ట్ యుటిలిటీ వాహన సెగ్మెంట్‌లో పోటీ చాలా ఎక్కువ. దీన్ని తట్టుకొని అమ్మకాల్లో జోరు కొనసాగించేందుకు అన్ని పోటీ కార్లలో కన్నా ఎక్కువ ఫీచర్లతో 'కిక్స్'ని రూపొందించామంటోంది నిస్సాన్. పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో తీసుకొచ్చారు. మిగతా సంగతుల విషయానికొస్తే...

డిజైన్: స్టైలిష్ డిజైన్ విషయంలో రాజీ పడలేదు. డీఆర్‌ఎల్‌లతో కూడిన ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్‌లు, నిస్సాన్ సంస్థకు ప్రత్యేకమైన సిగ్నేచర్ వీ మోషన్ గ్రిల్, ఫ్లోటింగ్ రూఫ్ రెయిల్స్, బూమెరాంగ్ ఆకారంలో టెయిల్ ల్యాంప్‌లు, లోపల డ్యుయెల్ టోన్ రంగులు, నాణ్యమైన లెదర్‌తో సీట్లు, డ్యాష్‌బోర్డు కిక్స్‌కి ప్రత్యేకం.

ఫీచర్లు: బయట కారుకి నాలుగు వైపులా ఏమేం ఉన్నాయో లోపలి తెరపై 360 డిగ్రీల కోణంలో చూడొచ్చు. ఈ అత్యాధునిక ఫీచర్ హై-ఎండ్ కార్లలోనూ అరుదే. డిజిటల్ కాంబినేషన్ మీటర్ ఆకట్టుకునేలా ఉంది. నిస్సాన్ ఇంటలిజెంట్ మొబిలిటీ టెక్నాలజీ సాయంతో కారుని స్మార్ట్‌వాచ్‌తో అనుసంధానం చేయొచ్చు. దీంతో వాహనం ఎక్కడ ఉందో తెలుస్తుంది. రోడ్‌సైడ్ సాయం పొందొచ్చు. ఆండ్రాయిడ్, ఆపిల్ ప్లేలతో పనిచేసే 8 అంగుళాల తాకే తెర ఉంది. విశాలమైన బూట్‌స్పేస్‌లో నాలుగైదు బ్యాగ్‌లు పెట్టుకోవచ్చు.

భద్రత:
ఎప్పటిలాగే భద్రతకి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. సురక్షిత ప్రయాణానికి దన్నుగా యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్), ఈబీడీ, ట్రాక్షన్ కంట్రోల్ ఫీచర్లున్నాయి. నాలుగు ఎయిర్‌బ్యాగ్‌లు ప్రమాదంలో రక్షణగా ఉంటాయి.

- **ఇంజిన్:** 4 సిలిండర్, 1,498సీసీ ఇంజిన్, 5600 ఆర్‌పీఎం మీద 106హెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేస్తుంది.
- **మైలేజీ:** 14.5కి.మీ/లీటరు (పెట్రోల్), 20కిమీ/లీ (డీజిల్)
- **పోటీదారులు:** హ్యుందాయ్ క్రెటా, రెనాల్ట్ కాప్చర్
- **ధర:** రూ. 9.55- రూ. 14.65 లక్షలు

లాంగ్ టూరర్ల నేస్తం


అడ్వెంచర్ టూరర్ 650సీసీ విభాగంలో అందుబాటులో ఉన్న మోటార్‌సైకిళ్లని వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఆ లోటు తీర్చడానికి వచ్చింది సుజుకీ వీ-స్ట్రామ్ 650 ఎక్స్‌టీ. ఈ విభాగంలో ఇది ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడవుతున్న బైక్. ఇప్పుడు మరింత మెరుగై, ఏబీఎస్ ఫీచర్‌తో వచ్చింది.

డిజైన్: వీ-స్ట్రామ్ 1000 మోటార్‌సైకిల్ స్ఫూర్తితో ఈ డిజైన్‌ని మలిచారు. ముందు సింగిల్ హెడ్‌ల్యాంప్ లేఅవుట్ ఉంటే గాలి నుంచి రక్షణగా ఎటుకావాలంటే అటు మార్చుకునే వీలైన విండ్‌షీల్డ్ ఆకర్షణీయంగా ఉంది. సన్నని పొడవాటి ఆకృతి, ఫ్రంట్ బీక్ టూరింగ్ చేసేవాళ్లకి అనుకూలం.


ఫీచర్లు: స్పోక్ చక్రాలు, ట్యూబ్‌లెస్ టైర్లు, సౌకర్యవంతమైన సీటు, ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్, పర్‌ఫెక్ట్ పొజిషన్‌లో ఉన్న హ్యాండిల్‌బార్, డిజిటల్ మరియు అనలాగ్ మీటర్, 19 అంగుళాల పొడవైన టైరు, అల్యూమినియం ట్విన్ స్పవర్‌ఫ్రేమ్‌లు లాంగ్‌టూర్లు, కఠినమైన రోడ్లపై దూసుకెళ్లేలా చేస్తాయి. 310 ఎంఎం ట్విన్ డిస్క్ బ్రేక్‌లు, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ట్రాక్షన్ కంట్రోల్ భద్రతా ఫీచర్లు.

- **ఇంజిన్:** డబుల్ సిలిండర్ 645సీసీ, వీ-ట్విన్ ఇంజిన్, 6స్పీడ్‌గేర్‌బాక్స్, 8,800 ఆర్‌పీఎం మీద 71పీఎస్ శక్తి ఉత్పత్తి అవుతుంది.
- **అత్యధిక వేగం:** 130కిమీ/గం.
- **మైలేజీ:** 18కిమీ/లీటరుకి
- **పోటీదారులు:** కావాసాకీ వర్సిస్ 650, ఎస్‌డబ్ల్యూఎం సూపర్ డ్యుయెల్ టీ
- **ధర:** 7.46లక్షలు (ఢిల్లీ ఎక్స్‌షోరూం)

- **డీనోస్ వాల్ట్**



సెలెబ్రిటీ సమాచారం



పుట్టినరోజుకి ఫ్లైట్ సిమ్యులేటర్

పుట్టినరోజుకి బహుమతులు ఇవ్వడం లేదా పుచ్చుకోవడం సెలెబ్రిటీలకు మామూలే. ఈ బర్త్‌డేకి తనకు తానే గిఫ్ట్ ఇచ్చుకున్నాడు బాలీవుడ్ నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్. అది ఖరీదైన కారు, ఫ్లాట్, వాచీ, ఆభరణాలు లేదా మరొకటో అనుకుంటున్నారా? కానేకాదు.. ఎవరూ ఊహించని ఫ్లైట్ సిమ్యులేటర్‌ని కొనేశాడు. 'నేను బోయింగ్ 737 ఫిక్స్‌డ్ బేస్ ఫ్లైట్ సిమ్యులేటర్



అనే అందాల రాశిని సొంతం చేసుకున్నా. 150 స్వప్నాల్లో నా మొదటి కల నెరవేరింది' అంటూ సిమ్యులేటర్‌లో సాధన చేస్తున్న వీడియోని ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకున్నాడు. ఈ సిమ్యులేటర్ అచ్చంగా ఎయిర్‌క్రాఫ్ట్ కాక్‌పిట్‌లాగే ఉంటుంది. కాబోయే పైలెట్లకు ముందు దీనిపైనే శిక్షణ ఇస్తారు. ధర కనీసం కోటి రూపాయలైనా ఉంటుంది. చూస్తుంటే హీరో కాస్తా పైలెట్ కావడానికి ప్రయత్నిస్తున్నట్టే ఉంది కదూ.

జాగ్వార్.. టూర్ అదిరెన్



సెకన్లలో వంద కిలోమీటర్ల వేగం అందుకున్న కారు.. మలుపుల్లోనూ అలవోకగా దూసుకెళ్లిన కారు.. దాదాపు ఒంటి చక్రంపై ముందుకెళ్లిన కారు.. జాగ్వార్ లాండ్‌రోవర్ హైదరాబాద్‌లో నిర్వహించిన 'ది ఆర్ట్ ఆఫ్ పెర్ఫార్మెన్స్ టూర్' విశేషాలివి. స్పీడ్ రన్, స్లాలామ్ ఎక్సర్‌సైజ్, లేన్ ఛేంజ్, బ్రేక్ టెస్ట్.. ఒకటేమిటి ఈ కంపెనీ కార్ల శ్రేణి సత్తాను, సామర్థ్యాన్ని చాటిచెప్పడానికి ఈ రెండురోజుల ప్రదర్శన వేదికైంది. సుశిక్షితులైన, నిపుణులైన డ్రైవర్లు ఈ విన్యాసాలు నిర్వహిస్తుంటే కారు అభిమానులు, ఔత్సాహిక డ్రైవర్లు ఈ ఉద్విగ్నభరిత డ్రైవింగ్‌ని ఎంజాయ్ చేశారు. ఈ షోలో ఎక్స్‌ఈ, ఎక్స్‌ఎఫ్, ఎక్స్‌జే, ఎఫ్-పేస్, ఎఫ్-టైప్ మోడళ్లను ప్రదర్శించారు. వీటి ధరలు రూ. 40.61లక్షల నుంచి రూ. 1.12కోట్లు (ఎక్స్‌షోరూం) మధ్యలో ఉన్నాయి.



మాయా నగరం.. మనుషుల్లేని వాహనం



అదో నగర వీధి...

ఎనభై కిలోమీటర్ల వేగంతో కారు దూసుకెళ్తోంది... ఉన్నట్టుండి ఓ వ్యక్తి అడ్డొచ్చాడు... కారు సడెన్ బ్రేక్ వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది...

ఇంకొంచెం ముందుకెళ్లగానే సైకిల్‌పై దూసుకొచ్చాడో బైసికిలర్... కంటెయినర్లు, వాహనాలు, ట్రాఫిక్ సిగ్నళ్లు, మనుషుల గుంపు.. దారిపొడవునా అడ్డంకులే...

అయినా దేన్నీ ఢీకొట్టకుండా అన్నీ దాటుకుంటూ ఆ కారు చాకచక్యంగా ముందుకెళ్తోంది...

ఇంతకు అసలు విషయం తెలుసా?

అడ్డుగా వచ్చిన వాళ్లంతా నిజం మనుషులు కాదు. ఆ కారులో డ్రైవరూ లేడు. ఉబర్ సంస్థ తాము తయారు చేసిన మానవరహిత కారును ప్రయోగాత్మకంగా పరీక్షించడానికి ఈ నకిలీ నగరాన్ని నిర్మించింది.

ఆమధ్య ఉబర్ డ్రైవర్‌లేని కారుని అమెరికాలో పరీక్షిస్తుంటే అది రోడ్డు దాటుతున్న ఓ మహిళను ఢీకొట్టింది. ఆమె దుర్మరణం పాలైంది. అది పెద్ద వివాదమైంది. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగొద్దనే ఉద్దేశంతో ఏకంగా నకిలీ నగరాన్నే సృష్టించి పరీక్షలు నిర్వహిస్తోంది ఉబర్. భవిష్యత్తులో మరింత విస్తృతం కానున్న ఈ సర్వీస్ టాక్సీల స్థానంలో మానవరహిత కార్లు వాడాలనేది ఆ సంస్థ ఉద్దేశం. పేరుకు నకిలీ నగరమైనా ఓ కారు ప్రయాణాన్ని పరీక్షించడానికి కావాల్సిన హంగులన్నీ అక్కడున్నాయి. ఆ వివరాలు.

ఎక్కడ నిర్మించారు?: అమెరికాలోని పిట్స్‌బర్గ్ నగరం పక్కన

నకిలీ నగరం పేరు: ఆల్మోనో

వైశాల్యం: నలభై ఫుట్‌బాల్ మైదానాలంత


ఏమేం ఉంటాయి?: రోబో మనుషులు, ట్రాఫిక్ లైట్లు, స్పీడ్‌బ్రేకర్లు, మలుపుల రోడ్డు సర్కిళ్లు, రోడ్డుపైనే సడెన్‌గా డోర్లు తెరుచుకునే కార్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు, రైల్‌రోడ్డు జంక్షన్లు, పాదచారుల రోడ్లు, మోటార్‌సైకిళ్లు, సిటీ బస్సులు, షిప్పింగ్ కంటెయినర్లు, పార్కింగ్ చేసిన కార్లు.. ఇలా నగర రోడ్లపై ఉండే అన్నీ ఉంటాయి.

ప్రణాళిక: పైన ప్రస్తావించిన అన్నింటినీ కంప్యూటర్ ద్వారా ఆపరేట్ చేస్తారు. యాభై నుంచి వంద కిలోమీటర్ల వేగంతో వెళ్లినా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఈ అటానమస్ కారు టెక్నాలజీని రూపొందిస్తున్నారు. కారుకి అమర్చిన సెన్సర్లు, కెమెరాలు, కంప్యూటర్ అనుసంధానకేంద్రం నుంచి వెళ్లే ఆజ్ఞల ఆధారంగా ఈ కారు పరుగులు తీస్తుంది.

ఖర్చు: ఉబర్ అధికారికంగా బయటికి ప్రకటించకపోయినా ఈ నకిలీ నగర నిర్మాణానికి ఎనభై కోట్లు ఖర్చు చేసినట్టు చెబుతున్నారు.

కొరియాలో కే-సిటీ మరోవైపు దక్షిణాకొరియాలో కూడా మరో నగరం ముస్తాబవుతోంది. 80 ఎకరాల్లో సిద్ధమవుతున్న ఈ నకిలీ నగరం ఉద్దేశం కూడా సెల్ఫ్‌డ్రైవింగ్ కార్లను పరీక్షించడమే. ఇందులో టోల్‌గేట్లు, పాదచారుల వరుసలు, ట్రెయిన్-ట్రాక్ క్రాసింగ్‌లు, గుంతలు, పలు రకాల నిర్మాణాలు, అడ్డంకులు అన్నీ ఉంటాయి. ప్రఖ్యాత కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ సహకారంతో సియోల్‌కి అరవై కిలోమీటర్ల దూరంలోని హ్వాసియాంగ్‌లో కే-సిటీ నిర్మిస్తున్నారు. 2020 నాటికి డ్రైవరులేని కారుని సియోల్ నగర రోడ్లపై తిప్పడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఈనాడు సినిమా



రవితేజ

పుట్టిన రోజున చెబుతారు

రవితేజ కథానాయకుడిగా ఎస్.ఆర్.టి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించనుంది. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. రామ్ తాళ్లూరి నిర్మాత. శనివారం రవితేజ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ని ప్రకటించనున్నారు. టైటిల్ లోగోని కూడా ఆవిష్కరించబోతున్నారు. 'డిస్కో రాజా' అనే పేరు ఈ సినిమా కోసం పరిశీలనలో ఉంది. ఆ పేరే ఖాయం చేశారా, లేదంటే మరో కొత్త పేరు ప్రకటిస్తారా? అనేది చూడాలి. రవితేజ పక్కన ముగ్గురు కథానాయికలకు చోటుంది. త్వరలోనే తొలి షెడ్యూల్ మొదలెడతారు.



ఫరా, అలీ రజా, సూఫీ ఖాన్

హైదరాబాద్ నవాబులు

ఆర్.కె దర్శకత్వం వహించిన చిత్రం 'హైదరాబాద్ నవాబ్స్ 2'. ఆయనే నిర్మాత. ఆర్.కె, అజీజ్ నాజన్, కెబి జానీ, సాజిద్ ఖాన్, అలీ రజా, సూఫీ ఖాన్, ఫరా కీలక పాత్రలు పోషించారు. హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. "2006లో వచ్చిన 'హైదరాబాద్ నవాబ్స్' మంచి విజయాన్ని అందుకుంది. ఆ వినోదానికి ఏమాత్రం తగ్గకుండా రెండో భాగాన్ని తెరకెక్కించాం. హైదరాబాద్ నగర సంస్కృతిని, ఇక్కడి సందడిని చూపిస్తాం. వినోదాత్మక చిత్రాల్ని ఇష్టపడేవాళ్లకు మా ప్రయత్నం నచ్చుతుంద"న్నారు ఆర్.కె.

మన్మథుడు ముస్తాబవుతున్నాడు



నాగార్జున

'దేవదాస్' తరవాత నాగార్జున నటించే చిత్రమేదీ ఇప్పటి వరకూ పట్టాలెక్కలేదు. కాకపోతే ఆయన దగ్గర రెండు స్క్రిప్టులు సిద్ధంగా ఉన్నాయి. 'బంగార్రాజు', 'మన్మథుడు 2' కథల్ని ఆయన ఓకే చేశారు. వాటిలో ముందుగా ఏది మొదలవుతుందన్న విషయంలో ఇప్పుడే ఓ స్పష్టత వచ్చింది. ముందుగా 'మన్మథుడు 2'ని మొదలెట్టడానికి నాగార్జున సన్నద్ధమయ్యారని తెలుస్తోంది. 'చిలసౌ'తో దర్శకుడిగా మారిన కథానాయకుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తారు. మార్చిలో 'మన్మథుడు 2' మొదలవుతుందని సమాచారం. ఎక్కువ భాగం పోర్చుగల్‌లో తెరకెక్కిస్తారట. అక్కడ దాదాపు 60 రోజుల పాటు షూటింగ్ జరుపుతారని సమాచారం. ఇందులో ఇద్దరు కథానాయికలకు చోటుంది. వాళ్లెవరన్నది త్వరలో ప్రకటిస్తారు.

రాజమౌళి టీమ్‌లో సముద్రఖని?



ఎస్.ఎస్ రాజమౌళి



సముద్రఖని

ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ కథానాయకులుగా ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. డీవీవీ దానయ్య నిర్మాత. రెండో షెడ్యూల్ ఇటీవలే ప్రారంభమైంది. దాదాపు 20 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్, చరణ్‌లపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తారు. ఎన్టీఆర్, చరణ్ మినహాయిస్తే ఈ సినిమాలో ఎవరెవరు నటిస్తున్నారన్న విషయంలో ఇప్పటికీ ఎలాంటి స్పష్టత రాలేదు. అయితే ఇప్పుడు ఓ నటుడి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనే సముద్రఖని. రాజమౌళి తన టీమ్‌లో సముద్రఖనికి చోటిచ్చినట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల టాక్. ఇటీవల చిత్రబృందం సముద్రఖనిని సంప్రదించి చర్చించినట్లు, ఈ సినిమాలో నటించడానికి ఆయన ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. దర్శకుడిగా పరిచయమైన సముద్రఖని ఆ తరవాత నటుడిగా మారారు. పలు తమిళ చిత్రాల్లో సహాయక, ప్రతినాయక పాత్రల్లో నటించి తన విశిష్టతని చాటుకున్నారాయన. మరి 'ఆర్.ఆర్.ఆర్'లో ఎలాంటి పాత్ర దక్కిందో..?

రోజూ ఎదురుచూస్తుంటా!



తమన్నా

కళాకారులకు సంతృప్తి ఉండకూడదు అంటోంది తమన్నా. ఎందుకు అని అడిగితే..? "అన్నీ సాధించేశాం అని ఎప్పుడూ అనుకోకూడదు. ఎక్కడో ఏదో వెలితి కనిపిస్తుండాలి. నేనెప్పుడూ చేసిన పనితో సంతృప్తి పడిపోను. ఇంకా దేనికోసమో అన్వేషిస్తుంటాను. అదే నా ఎదుగుదలకు కారణమ"ంది. ఇటీవల విడుదలైన 'ఎఫ్ 2'తో చక్కటి విజయాన్ని అందుకుంది తమన్నా. తను మాట్లాడుతూ "మిగిలిన వాళ్లతో పోలిస్తే నాకు మంచి పాత్రలే దక్కాయి. కథానాయిక అంటే పాటలకే పరిమితం అనుకున్న సందర్భాల్లోనూ నాకంటూ ప్రాధాన్యం ఇచ్చారు. అయితే ఇప్పటికీ నేను మరిన్ని మంచి పాత్రల కోసం రోజూ ఎదురుచూస్తూనే ఉంటాను. చేతిలో ఎన్ని సినిమాలున్నా, ఎన్ని మంచి పాత్రలు చేసినా ఈ నిరీక్షణ ఆగదు. రిటైర్‌మెంట్ ముందు రోజు వరకూ అది కొనసాగుతూనే ఉంటుంది" అంటోంది. ప్రస్తుతం 'క్వీన్' రీమేక్‌గా వస్తోన్న 'దటీజ్ మహాలక్ష్మి'లో నటిస్తోంది తమన్నా.



అమితాబ్ బచ్చన్, బొమన్ ఇరానీ

నిర్మాతగా బొమన్ ఇరానీ

ప్రముఖ బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ నిర్మాత అవతారమెత్తారు. ఇరానీ మూవీటోన్ పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ ఆ సంస్థ లోగోను ఆవిష్కరించారు. "ఈ క్షణం కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాను. మీ అందరి ప్రేమాభిమానాలతో ఇరానీ మూవీటోన్ సంస్థను ప్రారంభించాన"న్నారు బొమన్. "ఓ సినిమాకు రచయిత ముఖ్యమని నేను నమ్ముతాను. అలాంటి ప్రతిభావంతులైన రచయితలను గుర్తించేందుకు బొమన్ ఈ సంస్థకు శ్రీకారం చుట్టినందుకు సంతోషంగా ఉంది. అలాంటి సాహసం చాలా తక్కువ మంది చేస్తారు. అందుకు బొమన్‌కు అభినందనలు. ఆయన ప్రయత్నం విజయవంతమై మరింత మంది రచయితలను పరిశ్రమకు అందించాలని కోరుకుంటున్నాన"న్నారు అమితాబ్.



వెంకీ అట్లూరి, బీవీఎస్ఎన్ ప్రసాద్, అఖిల్, నిధి అగర్వాల్

అక్కినేని అభిమానుల్ని అలరించేలా 'మజ్ను'

అఖిల్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. నిధి అగర్వాల్ కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. శుక్రవారం విడుదల అవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకరులతో మాట్లాడింది. "ఈ కథపై నమ్మకంతో పని చేశా. సినిమా చూసిన తరవాత ప్రేక్షకులంతా ఆనందంగా బయటకు వస్తారు. తమన్ పాటలు చాలా బాగా ఉన్నాయి. నాన్నగారు ఈ సినిమా చూశారు. చాలా సంతోషించారు. దర్శకుడు అక్కినేని అభిమాని. అభిమానులందరినీ అలరించేలా ఈ సినిమా తీశాడు. ఏమాత్రం ఒత్తిడికి గురవ్వకుండా పని చేసిన సినిమా" అన్నారు అఖిల్. దర్శకుడు మాట్లాడుతూ "కేవలం మూడురోజుల్లో డబ్బింగ్ చెప్పేశాడు అఖిల్. తన డిక్షన్ చాలా బాగుంది. తమన్ మంచి పాటలు ఇచ్చాడు. పాటలన్నీ సందర్భానుసారం వస్తాయి. ట్రైలర్ చూసిన తరవాత 'ఆరెంజ్' సినిమాతో పోలుస్తున్నారు. ఆ కథకూ ఈ కథకూ ఎలాంటి సంబంధం లేదు. ద్వితీయార్ధం వినోదాత్మకంగా నడుస్తుంది. హైపర్ ఆది, ప్రియదర్శి పాత్రలు నవ్విస్తాయి. టైటిల్ మొదట అనుకునే ఈ కథ రాశా. కుటుంబ ప్రేక్షకులకు నచ్చే సినిమా అవుతుంద"న్నారు. "ప్రచార చిత్రాలు విడుదలైనప్పుడే ఈ సినిమాకి సానుకూల స్పందన వచ్చింది. సినిమా అంతకు మించి ఉంటుంద"ని నిధి చెప్పింది. "మంచి టీమ్ కుదిరింది. యువతరానికే కాదు, కుటుంబ ప్రేక్షకులకూ మా ప్రయత్నం నచ్చుతుంద"న్నారు నిర్మాత.

నాకు దక్షిణాది అంటే పిచ్చి

- అల్లు అర్జున్



ఒమర్ లులు, వోసేపచన్ వాల్‌కుజి, ప్రియా ప్రకాష్ వారియర్, రోషన్, అల్లు అర్జున్, సీహెచ్ వినోద్ రెడ్డి, గురురాజ్

"నాకు దక్షిణాది అంటే పిచ్చి. నేను దక్షిణాదికి చెందిన నటుణ్ని అని చెప్పుకోవడానికి గర్వపడతాను" అన్నారు అల్లు అర్జున్. సోషల్ మీడియా సంచలనం ప్రియా ప్రకాష్ వారియర్ నటించిన అనువాద చిత్రం 'లవర్స్ డే' పాటల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రోషన్ కథానాయకుడుగా ఒమర్ లులు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకి గురురాజ్, సి.హెచ్. వినోద్ రెడ్డి నిర్మాతలు. షాన్ రెహమాన్ సంగీతం అందించిన గీతాల్ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. అల్లు అర్జున్ తొలి సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేను పుట్టింది చెన్నైలో. పెరిగింది హైదరాబాద్‌లో. మలయాళంలోనూ, కన్నడలోనూ నా చిత్రాల్ని ఆదరిస్తున్నారు. అందుకే దక్షిణాది వాడిని అని చెప్పుకోవడానికి ఇష్టపడతాను. నా సినిమాల్ని కేరళ వాసులు తమ సొంత సినిమాగా భావిస్తారు. అందుకే అక్కడి నుంచి వచ్చిన ఓ చిత్రానికి అండగా నిలబడాలనుకుంటున్నా. ఈ చిత్ర నిర్మాత వినోద్ రెడ్డి నాకు స్నేహితుడు. నా సినిమా 'నా పేరు సూర్య' కొని నష్టపోయినా నాపై అభిమానం అలానే ఉంది. నా కోసం నిలబడిన వాళ్ల కోసం నేనెప్పుడూ నిలబడతాను. నా పుట్టిన రోజు కోసం ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తానో, ప్రేమికుల రోజు కోసం కూడా అలానే ఎదురుచూస్తుంటా. నా శ్రీమతిని ఎలా ఆశ్చర్యపరచాలా అని ఎదురుచూస్తుంటా" అన్నారు. "నాకు అల్లు అర్జున్ గారంటే చాలా ఇష్టం. ఆయనతో కలిసి వేదికను పంచుకోవడం ఆనందంగా ఉంద"ని చెప్పింది ప్రియా ప్రకాష్. "నటుడు అవ్వాలన్న కోరికతో ఈ రంగంలోకి అడుగుపెట్టా. కానీ నిర్మాతనయ్యా. ప్రేమికులందరినీ మెప్పించే చిత్రమిద"న్నారు గురురాజ్. "మలయాళంలో చాలా మంది స్టార్స్ ఉన్నారు. కానీ వాళ్లెవరూ మా వీడియోని షేర్ చేయలేదు. బన్నీ మాత్రమే షేర్ చేశారు. కొత్తవాళ్లతో చేసిన ప్రయత్నమిది. అందరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంద"న్నారు దర్శకుడు. ఈ కార్యక్రమంలో చంటి అడ్డాల, చైతన్య ప్రసాద్, అలీ, అశోక్ రెడ్డి, వోసేపచన్ వాల్‌కుజి తదితరులు పాల్గొన్నారు.

వీరనారి విజృంభణకు సిద్ధం

కంగనా రనౌత్ నటించిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'. బ్రిటిష్ సేనలపై అపర కాళికలా దండెత్తి తన వీరత్వంతో చరిత్ర పుటల్లో నిలిచిపోయిన ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జీవితగాథతో ఈ చిత్రం రూపొందింది. లక్ష్మీబాయిగా కంగన నటించింది. తెలుగు దర్శకుడు క్రిష్‌తో కలసి కంగన దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించింది. ప్రముఖ తెలుగు రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు. సుమారు రూ.125 కోట్ల బడ్జెట్‌తో హిందీ, తెలుగు, తమిళ భాషల్లో భారీ స్థాయిలో తెరకెక్కిన ఈ చిత్రం గణతంత్ర దినోత్సవ కానుకగా శుక్రవారం విడుదలవుతోంది. 'మణికర్ణిక' విశేషాలివీ.



'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'

విడుదలకు సిద్ధం

నాయిక ప్రాధాన్య చిత్రాలతో గుర్తింపును తెచ్చుకుంది కంగన. ఆమె నుంచి సినిమా వస్తోందంటే సర్వత్రా ఆసక్తి ఉంటుంది. ఈసారి లక్ష్మీబాయి లాంటి శక్తిమంతమైన మహిళ పాత్రలో నటించడంతో ఆ ఆసక్తి రెట్టింపైంది. ఈ సినిమా ట్రైలర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అంచనాలు పెరిగాయి. కంగన కెరీర్‌లోనే భారీ స్థాయిలో విడుదలవుతున్న చిత్రమిదని తెలుస్తోంది. రెండేళ్ల పాటు ఈ చిత్రం కోసం శ్రమించిందామె. తన పాత్ర కోసం కత్తి యుద్ధం, గుర్రపు స్వారీ నేర్చుకుంది. పోరాట సన్నివేశాల్లో డూప్ అవసరం లేకుండా స్వయంగా పాల్గొంది. కొన్ని సార్లు గాయాల బారిన పడి ఆసుపత్రి పాలైంది. అయినా బెదరక మొక్కవోని దీక్షతో సినిమాను ముందుకు తీసుకెళ్లింది. తన కష్టానికి తగిన ఫలితాన్ని ఈ చిత్రం తప్పక అందిస్తుందన్న విశ్వాసంతో ఉంది కంగన. ఓ చిన్నారికి తల్లిగా ఉంటూనే పాతికేళ్లు కూడా నిండని వయసులో స్వరాజ్య పాలన కోసం కత్తి పట్టి రణరంగంలోకి దూకిన వీరనారి లక్ష్మీబాయి పాత్రను పోషించడంతో జీవితం ధన్యమైందని సంతోషం వ్యక్తం చేసింది కంగన.

విశేషాలు

- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కోసం రాష్ట్రపతి భవన్‌లో ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. సినిమాపై ప్రశంసలు కురిపించిన కోవింద్ చిత్రబృందాన్ని సత్కరించారు.
- ఈ చిత్రంలో యుద్ధ సన్నివేశాలకు చాలా ప్రాధాన్యత ఉంది. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ నిక్ పావెల్ నేతృత్వంలో ఆ సన్నివేశాలను తెరకెక్కించారు. వాటి కోసం కంగన రోజూ 8 గంటల పాటు కత్తి యుద్ధాన్ని సాధన చేసేదట.
- కంగన సైన్యం కోసం నాలుగు వందల మందిని ఎంపిక చేసి నాలుగు నెలల పాటు యుద్ధ విద్యల్లో శిక్షణ ఇచ్చారట.
- 1857 నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో ఆ కాలం నాటి ఆయుధాలనే వినియోగించారట. అప్పట్లో బ్రిటిష్ సైనికులు వాడిన చిన్న పిస్టళ్లు, రైఫిళ్లను ఉపయోగించారట. కంగన వాడిన కత్తులు, కవచం చాలా బరువు ఉండేవట. కవచం బరువే ఐదు కిలోలట.
- యుద్ధ సన్నివేశాలు చిత్రీకరిస్తున్న రోజుల్లో చిత్రబృందం ఉదయం మూడు గంటలకే నిద్ర లేచేదని, సెట్ సిద్ధం చేయడానికే 7 గంటలు పట్టేదని, రోజుకు రెండు మూడు షాట్స్ మాత్రమే తీయగలిగేవాళ్లమని చెప్పింది కంగన.

పెళ్లిళ్లు.. ప్రత్యేక సందర్భాల్లో పట్టు చీరలదే హవా! మరి ఏరి కోరి ఎంచుకొనే వారికి ఈ కంచి.. ఆరణి పట్టు చీరలు చక్కని ఎంపికవుతాయి. ఆకట్టుకునే రంగులు.. వైవిధ్యమైన డిజైన్లతో రూపొందిన ఈ చీరలు నేటి మగువలకు ప్రత్యేకం!

పట్టు కనికట్టు



మామిడి మోటిఫ్‌లు.. బ్రొకేడ్ అంచుతో తీర్చిదిద్దిన ముదురు నీలం రంగు కంచిపట్టు చీర.



గళ్లు, నెమలి, జింక, ఏనుగు మోటిఫ్‌లతో తీర్చిదిద్దిన కంచిపట్టుచీర సోయగం.



అందంగా, హుందాగా రూపొందిన ఆరణి పట్టు చీరకు... అంచు అద్భుతం.



ఖాదీ అంచుతో కనికట్టు చేసేలా రూపొందిన ఆరణి పట్టుచీర.

నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld

ఈ దుస్తులు అన్నీ కళాంజలి షోరూంలలో లభిస్తాయి

మోడల్: కృతిక సింగ్ రాథోడ్
ఫొటోలు: పద్మావతి పాతూరి

బంగారం వెండి



24న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	33,340	33,440	33,300	33,000
ఆర్నమెంట్	31,150	31,240	30,850	30,700
వెండి (కిలో)	39,780	40,100	40,300	40,000
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	33,200	33,000	33,340	33,460
ఆర్నమెంట్	30,710	30,670	30,870	30,940
వెండి (కిలో)	40,000	40,000	39,900	40,300
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	33,200	33,290	-------	-------
ఆర్నమెంట్	30,880	30,960	3,089	3,097 గ్రా
వెండి (కిలో)	40,000	40,000	42.10	42.50 గ్రా

నా పాదాలకు తరచూ ఇన్‌ఫెక్షన్ వస్తోంది. వేళ్ల దగ్గర కాయల్లా, బొబ్బల్లా వస్తున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా తగ్గట్లేదు. తెలిసినవాళ్లు చెప్పుల వల్ల అలర్జీ వచ్చిందని అంటున్నారు. వాటితో ఇన్‌ఫెక్షన్ వస్తుందని నేనెప్పుడూ వినలేదు. అలా అయ్యే అవకాశం ఉందా. నా సమస్యకి పరిష్కారం చెప్పండి
- ఓ సోదరి

చెప్పుల వల్ల అలర్జీ వస్తుందా?

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

పాదరక్షల వల్ల అలర్జీ వస్తుందన్న మాట వాస్తవమే. బహుశా మీరు షూ కాంటాక్ట్ డెర్మటైటీస్‌తో బాధపడుతున్నారనిపిస్తోంది. ముఖ్యంగా ఈ సమస్య లెదర్, చెప్పుల్ని అంటించడానికి వాడే గ్లూ, రబ్బర్, ఫుట్‌వేర్ యాక్సెసరీస్‌లో ఉండే కోబాల్, నికిల్ వంటి లోహాలు, డీఎమ్ఎఫ్ అనే రసాయనం వల్ల, అలానే ఎగ్జిమా, ఎటోపిక్ డెర్మటైటీస్, సోరియాసిస్ వంటివి ఉన్నప్పుడు ఈ సమస్య రావొచ్చు. స్వతహాగా బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా ఇది ఎదురవుతుంది. ఈ సమస్య ఎప్పుడైనా రావొచ్చు. కొత్త చెప్పులు వేసుకున్న వెంటనే వస్తే కారణం తెలుసుకోవడం సులువు. లేదంటే ఎందుకిలా అయ్యిందని గుర్తించడం కష్టమవుతుంది. దురద, బొబ్బలు రావడం, అవి చితికిపోవడం, పగుళ్లు, మంట, నొప్పి, వాపు వంటివి ఈ సమస్యకు సంకేతాలు. ఇలాంటి సంకేతాలు ఉంటే గనుక వాడుతోన్న చెప్పులు పక్కన పెట్టేయండి. కొబ్బరినూనె, మాయిశ్చరైజర్‌తో మర్దన చేయండి. అలానే మైల్డ్ టాపికల్ స్టెరాయిడ్ క్రీములు వాడుతుంటే క్రమంగా తగ్గుతుంది.

బొబ్బలు రావడం, చితికిపోవడం అంటే ఇన్‌ఫెక్షన్ రెండో దశకు చేరిందని అర్థం. అలాంటప్పుడు తప్పనిసరిగా యాంటీబయోటిక్ క్రీములు వాడాలి. కొందరికి అరికాళ్లలో బాగా చెమటలు పడుతుంటాయి. అలాంటివారు వెంటనే సమస్యని నియంత్రించుకోవాలి. లెదర్ గ్లూ ఉన్నవి కాకుండా వెజిటబుల్ డైస్ ఉన్న బూట్లు, చెప్పులు వేసుకోవాలి. రబ్బర్ సోల్ ఉన్న వాటికి దూరంగా ఉండాలి. సాక్సులు వాడే అలవాటు ఉన్నవారు వాటిని ఏరోజుకారోజు మార్చుకోవాలి. తప్పనిసరిగా కాటన్ సాక్సులనే ధరించాలి. కాయల్లా, గుల్లల్లా వస్తున్నాయంటున్నారు కాబట్టి... మైల్డ్ స్టెరాయిడ్ క్రీము, అల్యూమినియం క్లోరైడ్ హెక్సాహైడ్రేట్ ఉన్నవి రాసుకోవాలి. వీటి వల్ల చెమట సమస్య కూడా తగ్గుతుంది. పాదాల సమస్యలున్న వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన కోర్టెక్స్ సాక్సు కూడా వాడొచ్చు. అలానే చెప్పుల్ని నాణ్యమైనవాటినే ఎంచుకోవాలి. సోల్ మెత్తగా ఉండేలా చూసుకోవాలి. రోజూ ఇంటికి రాగానే గోరువెచ్చటి నీళ్లతో కాళ్లు కడుక్కొని, శుభ్రంగా తుడుచుకుని మాయిశ్చరైజర్ రాసుకోవాలి. దీనివల్ల ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు దరిచేరవు. అలానే పదే పదే కాళ్లు కడుక్కోవడం కూడా సరికాదు. సాధ్యమైనంత వరకూ పొడిగా ఉండేలా చూసుకోవాలి. మీరు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సమస్య అదుపులోకి రాకపోతే మాత్రం వైద్యుల్ని సంప్రదించడం మంచిది.

- మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

నజరానా

చేపల నుంచి వచ్చే వాసన సులువుగా పోవాలంటే... సెనగపిండి రాసి ఐదు నిమిషాల తరువాత శుభ్రం చేయాలి.

మీ అభిప్రాయాలు పంపాల్సిన మా చిరునామా
వసుంధర,
ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలిం సిటీ,
అబ్దుల్లాపూర్ మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512
vasundhara@eenadu.net

బానిస బతుకుల్లో చైతన్య గీతిక

ఆమెకు చిన్నవయసులోనే పెళ్లైంది. అప్పటికే అత్తింటివారంతా ఓ క్వారీలో బాండెడ్ లేబర్స్‌గా ఊడిగం చేస్తున్నారు. ఆ ఇంటి కోడలిగా ఆమెకూ ఆ బానిసత్వం తప్పలేదు. ప్రభుత్వాధికారుల చేయూతతో బానిస బతుకు నుంచి ఓ రోజు బయటపడ్డారంతా. మిగతా అందరూ తమ దారిని తాము వెతుక్కుంటే, ఆమె మాత్రం తమ లాంటివారిని గుర్తించి 400 మందికి విముక్తి కల్పించింది. ఆమె తమిళనాడుకి చెందిన పచ్చయమ్మాళ్.



తమిళనాడులోని కాంచీపురానికి చెందిన పచ్చయమ్మాళ్‌ది వ్యవసాయ కుటుంబ నేపథ్యం. ఆమెకు పదహారేళ్ల వయసులో ఉల్లావూరులోని అరుళ్‌తో పెళ్లైంది. అత్తింటివారంతా రాళ్ల క్వారీలో బాండెడ్ లేబర్స్. ఈ విషయం అక్కడికి వచ్చాక కానీ ఆమెకి తెలియదు. కేవలం చిన్న మొత్తం అప్పు తీర్చలేక, వాళ్లంతా బానిసలయ్యారని తెలిసినా, ఏమీ చేయలేక వాళ్లలో ఒక కూలీగా మారిందామె.

జీతం రెండొందలే

ఉదయం అయిదు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు క్వారీలో రాళ్లు కొట్టడం వారి పని. ఇంట్లో నలుగురు మనుషులు రోజంతా పనిచేస్తే నెలకు రూ.800 జీతం వచ్చేదని చెబుతుంది పచ్చయమ్మాళ్. 'ఆ డబ్బుతోనే నెలంతా గడపాలి. ఎక్కువరోజులు గంజే ఆహారం. ఇక పనిచేసేటప్పుడు కాసేపు విశ్రాంతి తీసుకోవడం అసలే కుదరదు. ఇక అక్కడ లైంగిక వేధింపులు భరించలేని స్థితిలో ఉండేవి. కనీసం మరుగు దొడ్డికి వెళ్లాలన్నా భయమే. అలానే ఆరేళ్లు పని చేశా. అక్కడ పని మానేయాలనుకున్నా అదేమంత సులువుకాదు. ఎందుకంటే మా మామయ్య చేసిన పదివేల అప్పు, వడ్డీతో సహా 50 వేల రూపాయలు అయ్యిందట. అది చెల్లిస్తేనే కానీ మమ్మల్ని విడుదల చేయరని తెలిసి నిస్సహాయంగా ఉండిపోయాం' అంటోంది.

ఏడ్చేశారు...

పచ్చయమ్మాళ్ పనిచేసే క్వారీపై ఓ రోజు స్థానిక ఆర్డీవో అధికారులు, పోలీసులతో కలిసి రైడ్ చేశారు. అక్కడ వెట్టి చేస్తోన్న కార్మికులందరినీ విడిపించారు. వారు దాడిచేస్తోన్న విషయం తెలిసి యజమాని ముందుగానే పారిపోయాడు. 'అధికారులు మాతో సహా 15 కుటుంబాలను రక్షించి, వారి ఆఫీసుకు తీసుకెళ్లారు. అక్కడ తినడానికి అన్నం పొట్లాలిచ్చారు. తెరిచి చూస్తే అది బిర్యానీ. కడుపు నిండా ఇటువంటి ఆహారం ఎప్పుడు తిన్నామో అనుకుంటూ మాలో చాలా మంది ఏడ్చేశారు. ఆ క్షణమే అనుకున్నా.. మేమంతా అక్కడ నుంచి బయటపడ్డాక ఇలా వెట్టితో బానిసల్లా క్వారీలు, ఇటుక బట్టీలు, కార్పెంటరీ యూనిట్లలో ఊడిగం చేస్తున్న వారికి విముక్తి కల్పించాలనుకున్నా'. అంటోంది పచ్చయమ్మాళ్.

గుర్తింపు కోసం

వెట్టి నుంచి బయటికి వచ్చిన కుటుంబాలన్నింటికి నిలువనీడ కల్పించమని అధికారులను కోరిందామె. ప్రభుత్వం తరఫున తలా 20వేల రూపాయలు సాయం, గుర్తింపు కార్డులు వచ్చేలా చేసింది. ఇవన్నీ తేవడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొంది. 'ప్రభుత్వ సాయంతో తాత్కాలిక గుడిసెలు వేసుకున్నాం. రేషన్, ఆధార్, ఓటరు కార్డుల కోసం అధికారుల చుట్టూ ఎన్నో సార్లు తిరగాల్సి వచ్చింది. ఇళ్లకు మంచినీరు, కరెంటు సౌకర్యం అన్నీ అందాయి. దాంతో క్రమంగా మా జీవితాల్లో మార్పు వచ్చింది. మా కాలనీ వారికోసం పూడికతీతలు, పొలం, గృహనిర్మాణం వంటి పనులు ఎక్కడున్నా తెలుసుకుంటా. వాటిని అందరం కలిసి పంచుకుంటాం. మాలా పిల్లలు బతకకూడదనే కాలనీ వారందరినీ ఒప్పించి చిన్నారులను ప్రభుత్వపాఠశాలల్లో చేర్చా' అని చెబుతోంది పచ్చయమ్మాళ్.


పొదుపు చేయిస్తూ..

అక్కడితో తన పని అయిపోయిందనుకోలేదామె. ఎక్కడైతే బాండెడ్ కార్మికులుంటారో వారిని గుర్తిస్తుంది. ఆ వివరాలను ఆర్డీవో కార్యాలయానికి అందిస్తుంది. ఆపై పోలీసులు, స్థానిక సామాజిక సేవాసంస్థల సాయంతో వారిని విడిపిస్తుంది. అలా బయటకి వచ్చినవారిని సొంతూళ్లకు పంపించడం, అవసరం ఉన్నవారికి ఉపాధి కల్పించడం చేస్తుంది. అలా ఇప్పటి వరకు దాదాపు 400 మందికి పైగా విముక్తి కల్పించింది. అలానే అక్కడి మహిళలు అవసరాలకు అప్పులు చేయకూడదనే ఆలోచనతోనే పొదుపు నేర్పింది. 'వచ్చిందంతా ఖర్చు పెట్టేసి, అవసరమొస్తే అప్పు చేయకూడదు. గతంలో ఇలా చేసిన అప్పుల వల్లే ఊడిగం చేయాల్సి వచ్చింది. అందుకే మహిళలందరినీ ఒకతాటిపై కి చేర్చి పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేశా. ప్రతీ ఒక్కరూ వారానికి కనీసం 50 రూపాయలివ్వాలి. తిరిగి వారి నగదుని వారి అవసరాలకే ఇస్తా. అది కూడా అప్పులాగే. ఇప్పుడు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం కృషి చేస్తున్నా. అలాగే నాలాంటివారిని విడిపించే లక్ష్యం కొనసాగుతూనే ఉంటుంది' అంటోంది పచ్చయమ్మాళ్.

బరువు తగ్గాలా...

చాలామంది బరువు... తగ్గాలని రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే వాటితోపాటు జీవక్రియ రేటును మెరుగ్గా ఉంచే కొన్ని వ్యాయామాల్ని చేసి చూడండి. ఆరోగ్యం బాగుంటుంది. త్వరగా బరువూ తగ్గుతారు.

- స్క్వాట్స్ వల్ల జీవక్రియల రేటు మెరుగవుతుంది. త్వరగా బరువు తగ్గే అవకాశముంటుంది. ఇలా రోజూ కాసేపైనా చేయాలి. దీనివల్ల కాళ్ల కండరాలు దృఢపడతాయి. పొట్ట చుట్టూ ఉన్న కొవ్వు త్వరగా తగ్గుతుంది.
- వ్యాయామం చేసే వారికి ప్లాంక్స్ కూడా సరైన ఎంపిక. చేతులు.. కాలి మునివేళ్లతో చేసే ఈ వ్యాయామం వల్ల కండరాలు గట్టి పడతాయి. నడుము చుట్టూ ఉన్న కొవ్వు తగ్గుతుంది. జీవక్రియ రేటు మెరుగ్గా ఉంటుంది.
- యోగాసనాల వల్ల శరీరంలో జీవక్రియల పనితీరు మెరుగుపడుతుంది. ముఖ్యంగా, భుజంగాసనం, బద్ధకోణాసనం, కపాలభాతి, వృక్షాసనం వల్ల మంచి ఫలితముంటుంది. ప్రాణాయామాలు కూడా చేయొచ్చు.



- ప్రతిరోజూ ఇంట్లో చేసే వ్యాయామం విసుగ్గా అనిపిస్తే ఒకరోజు వాకింగ్ లేదా రన్నింగ్‌కి వెళ్లొచ్చు. ఈ వ్యాయామాలు గంటపాటు చేస్తే ఎంతో ఉత్సాహం సొంతమవుతుంది. కెలోరీలు సులువుగా కరిగిపోతాయి.

ఇలా చేద్దాం...

- ఉదయం లేచిన తరువాత చాలా మంది కాఫీ, టీలతో దినచర్య మొదలుపెడుతుంటారు. కానీ మొదట బాదం, ఖర్జూరాలు, చిన్న అరపండు ముక్క.. ఇలా వీటిలో ఏదో ఒకటి తీసుకుంటే మంచిది. వీటి నుంచి శక్తి, ప్రొటీన్లు అందుతాయి. అవి తీసుకున్న అరగంట తరువాతే కాఫీ, టీలు తీసుకోవాలి.
- పొద్దున సమయంలో కొందరికి వేణ్నీళ్లు తాగే అలవాటు ఉంటుంది. అయితే పచ్చి పసుపు కొమ్ము వేసి మరిగించిన నీళ్లను చల్లార్చి తీసుకుంటే శరీరంలోని విష వ్యర్థాలు బయటకు వచ్చేస్తాయి. దీనివల్ల జీవక్రియ రేటు బాగుంటుంది. త్వరగా బరువు తగ్గడం సాధ్యమవుతుంది.

మీ ఒంట్లో క్యాల్షియం తగ్గిందా!

ఎముకలు, పళ్లు ఆరోగ్యంగా ఉండటానికే కాదు.. మరెన్నో విధాలుగా కూడా క్యాల్షియం మేలు చేస్తుంది. అసలు దాన్ని నిర్లక్ష్యం చేస్తే.. ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో, ఏం తినాలో చూద్దాం.

- శరీరంలో క్యాల్షియం లోపించడం వల్ల కలత నిద్ర ఉంటుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. అలానే కండరాల నొప్పి బాధించొచ్చుట.
- క్యాల్షియం లోపం గుండెకు కూడా చేటు చేస్తుంది. గుండె వేగంగా లేదా నెమ్మదిగా కొట్టుకోవడం.. వంటి హెచ్చుతగ్గులు కనిపిస్తాయి.
- నెలసరి సరిగా రాకపోవడం, అధిక రక్తస్రావం లాంటి సమస్యలు కూడా కొన్నిసార్లు ఈ పోషకలోపం వల్ల ఎదురవుతాయి.



- ఈ సమస్యను నివారించాలంటే.. ఆహారంలో పాలు, పాల పదార్థాల్ని ఎక్కువగా తీసుకోవాలి. అలానే చేపలు, పాలకూర, సోయా, నట్స్, గింజలు వంటివి తగినంతగా ఆహారంలో భాగం చేసుకోవాలి. మరీ క్యాల్షియం తక్కువగా ఉంటే వైద్యుల సలహాతో మాత్రలు వేసుకోవాలి.

విహారి



గో.. వాహ్!

కుటుంబంతో చలో

**కుర్రకారుకు కూతవేటు దూరంలో ఉండే స్వర్గం
ఐరోపాను మరిపించే అందాల తీరం.. గోవా
క్యాసినోలు.. కార్నివాల్స్.. పబ్బులు.. పార్టీలు..
కొంకణ తీరం కోణం ఇదే అనుకుంటారంతా!
కానీ, ఈ చిట్టి రాష్ట్రంలో ఇంతకు మించిన విశేషాలున్నాయి.
ప్రకృతి రమణీయత.. సుందర తీరాలు.. నిర్మలమైన
సూర్యాస్తమయాలు.. సాగర హోరులో సాగే సాహసాలు.. ఇలా
ఎన్నో!! ఇవన్నీ ఏ కొందరికో పరిమితం కాదు. అందరినీ
అలరించేవే. ఈసారి గోవాకు కుటుంబంతో వెళ్లండి. అలలపై
ఓలలాడండి.. తీరంలో తనివితీరా సేదతీరండి. అక్కడి వింతలను
కొత్తగా ఆస్వాదించండి.**

వలస పాలకులు చివరి వరకూ మన దేశంలో వదలని ప్రాంతం గోవా. సముద్ర అందాలన్నీ ఒక్కచోటే పోగేసినట్టుండే తీరాలు ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటాయి. అందుకే వయోభేదం లేకుండా అందరూ గో.. గోవా అనేస్తుంటారు. కుటుంబ విహారమైనా, స్నేహితులతో సరదా ట్రిప్పయినా అనుకూల పర్యాటక కేంద్రమిది. ఆహ్లాదపరిచే కొబ్బరి తోటలు, ఆ తోటల నడుమ అక్కడక్కడా విసిరేసినట్టుగా ఉండే రంగురంగుల ఇళ్లు, చూసినన్ని చారిత్రక వారసత్వ కట్టడాలు, జాలీస్పాట్‌లు ఇలా విహార పర్వం విజయవంతం చేసే నెలవులెన్నో గోవాలో కొలువుదీరాయి. నవంబరు, డిసెంబరు నెలల్లో యువత కేరింతలతో ఊగిపోయే గోవా.. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అందరి విహార కేంద్రమవుతుంది. వినోదాల్లో తేలిపోయే కుటుంబాలు, అలల ఆలింగనంతో చెదిరిపోయే కొత్తజంటల పాదముద్రలతో సుందర తీరం మరింత మనోహరంగా కనిపిస్తుంది.

క్రూయిజ్.. హుర్రే..

గోవాలో క్రూయిజ్ విహారం.. మరచిపోలేని అనుభూతినిస్తుంది. అరేబియా సముద్రం, మండోవి నదిపై సాగుతూ ప్రకృతి ఒడిలో తేలిపోవచ్చు. క్రూయిజ్ డెక్ పైన స్థానిక పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ పెద్దలు కూడా పిల్లలు అయిపోతారు.

ధర: రూ.300 (ఒక్కొక్కరికి)



దక్షిణ తీరాల్లో.. మధుర క్షణాలు

గోవాలో 125 కి.మీ. పొడవునా తీరాలు విస్తరించి ఉన్నాయి. వీటిని ఉత్తర, దక్షిణ తీరాలుగా విభజన చేశారు. పార్టీలు, కార్నివాల్స్, సాహస విన్యాసాలకు ఉత్తర తీరాలు కేరాఫ్‌గా నిలిస్తే.. ప్రశాంతంగా సేద తీరడానికి దక్షిణ తీరాలు అనువుగా ఉంటాయి. దక్షిణ తీరాల్లో పాలొలెమ్ బీచ్ ముఖ్యమైంది. ఇక్కడ సముద్ర జలాలు స్వచ్ఛంగా ఉంటాయి. ఒడ్డున చిన్న చిన్న కుటీరాలు, ఆయుర్వేద కేంద్రాలున్నాయి. ఉదయాన్నే యోగా తరగతులు నిర్వహిస్తుంటారు. మంకీ ద్వీపం, కోటిగావో వన్యప్రాణుల అభయారణ్యం ఇక్కడికి సమీపంలో ఉంటాయి. ఇదే వరుసలోని అగొండా బీచ్ కూడా ప్రశాంతంగా ఉంటుంది. ఉత్తర తీరాల్లో కాలన్‌గూట్ ప్రధానమైనది. 'బీచ్‌ల మహారాణి'గా పేరున్న ఈ తీరం ప్రపంచంలో అందమైన పది బీచ్‌లలో ఒకటి. దీనికి సమీపంలోని బాగా బీచ్ బాగుంటుంది. ఇదే వరుసలో కొండల శ్రేణుల మధ్య ఉండే అంజునా గ్రామంలో ప్రకృతి అందాలు పరవశింపజేస్తాయి.

చేరుకునేదిలా..

- హైదరాబాద్ నుంచి గోవాకు నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ఉన్నాయి. ప్రైవేట్ బస్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. విజయవాడ, విశాఖపట్టణం నుంచి హైదరాబాద్ మీదుగా గోవా విహారం కొనసాగించవచ్చు.
- గోవా ప్రాంతంలో కులెం, మాడ్‌గావ్, వాస్కో డా గామా రైల్వేస్టేషన్లు ఉన్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖ నుంచి రైళ్లు అందుబాటులో ఉన్నాయి. ఆయా స్టేషన్లలో దిగి ట్యాక్సీలో గోవా తీరాలకు చేరుకోవచ్చు.

బస భలే..

గోవాలో అన్నివర్గాల వారికి అతిథి గృహాలు అందుబాటులో ఉన్నాయి. కుటుంబసభ్యులతో సందర్శించే వారికి రాష్ట్ర పర్యాటక శాఖ నిర్వహించే అతిథిగృహాలు మొదటి ఎంపిక. ఆన్‌లైన్ బుకింగ్‌తో తక్కువలోనే మంచి డీల్స్ సొంతం చేసుకోవచ్చు.

- అద్దె రోజుకు రూ.500 నుంచి రూ.5,000 వరకు ఉంటుంది.

ఆటాడుకుందాం రా..

గోవా సందర్శనలో జలక్రీడలు ప్రత్యేక అంకం. సినిమాల్లో చూసే ఫీట్లు ఇక్కడ చేసేయొచ్చు. విండ్ సర్ఫింగ్, డింగై సెయిలింగ్, యాంగ్లింగ్, వాటర్ స్కూటర్ వంటి ఆటలు రోజులను క్షణాల్లా కరిగించేస్తాయి.

- **జెట్ స్కీయింగ్**
  కండోలిం, బాగా, వగేటర్ బీచ్‌లు
  ధర: రూ. 1,200 నుంచి
- **పారాసెయిలింగ్**
  అంజునా, వగేటర్ బీచ్‌లు
  ధర: రూ.1,500



- **వాటర్ రాఫ్టింగ్**
  మండోవి నది, వగేటర్ బీచ్
  ధర: రూ.1,800
- **స్కూబా డైవింగ్**
  వాస్కో సమీపంలోని గ్రాండ్ ఐలాండ్.
  స్కూబా డైవింగ్ ధర: రూ.2,500– రూ.4,000
  స్నార్కెలింగ్ ధర: రూ.1,000



విభజించు.. ఆకర్షించు

పోర్చుగీసు పాలకులు మనకు ఇచ్చిన బహుమతిగా కనిపిస్తుంది అగువాడ కోట. అరేబియా అలల తాకిడిని తట్టుకునేలా, 79 ఫిరంగులతో శత్రుదుర్భేద్యంగా నిర్మించారు. సిన్క్వరియం, కండోలిం బీచ్‌లను విభజించే కోట లోపల 1864లో నిర్మించిన లైట్‌హౌస్ ఆకట్టుకుంటుంది. సూర్యాస్తమయాన ఎర్రటి కోట అందం రెట్టింపవుతుంది. ఉదయాన్నే బీచ్‌లను సందర్శించే యాత్రికులు మధ్యాహ్నమయ్యేటప్పటికి కోటలో పాగా వేస్తారు.





శతాబ్దాల సౌందర్యం

గోవాలో తప్పక చూడాల్సింది కేథలిక్‌ల ఆరాధ్య కేంద్రమైన బోమ్ జీసస్ బాసిలికా చర్చి. 1605లో దీన్ని కట్టారు. బరోక్ నిర్మాణ శైలిలో కట్టిన ఈ అద్భుత చర్చిని రోజూ వేలమంది సందర్శిస్తుంటారు. చర్చి ఉదయం 9 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు తెరిచి ఉంటుంది.

ఇంకా...

- గోవాలో సలీం అలీ పక్షుల సంరక్షణ కేంద్రం.. తప్పక చూడాలి.
- గోవా-కర్ణాటక సరిహద్దులోని మండోవి నదిపై ఉన్న దూద్‌సాగర్ జలపాతం అద్భుతమైన ప్రకృతి దృశ్యం. 1,017 అడుగుల ఎత్తు నుంచి నిటారుగా దూకే జలధారలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి.
- గోవాలో ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ చూపి ద్విచక్రవాహనాలు అద్దెకు తీసుకోవచ్చు. అద్దె రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఉంటుంది.
- గోవాలో రాత్రుళ్లు అద్భుతంగా ఉంటాయి. టిటో స్ట్రీట్ క్లబ్బులకు పెట్టింది పేరు. తెల్లవారుజాము వరకూ పార్టీలు జరుగుతూనే ఉంటాయి. తీరంలోని కాటేజీల్లోనూ పార్టీలు నిర్వహిస్తుంటారు.
- సముద్రం బ్యాక్‌వాటర్‌లో భారీ ఓడల్లో ఏర్పాటు చేసిన క్యాసినోలు (జూదశాలలు) ఆకర్షిస్తుంటాయి. కుటుంబాలతో కూడా వీటిల్లోకి వెళ్లొచ్చు. చిన్నపిల్లలకు ప్రత్యేకంగా కేర్ సెంటర్లుంటాయి. భారీ బఫేలు, రకరకాల చిరుతిళ్లు, వినోద కార్యక్రమాలు ఉంటాయి.

(ధర: ఒకరికి రూ.1,500 నుంచి..)

వారం వారం 'సంత'సం

గ్రామ సంతలు గోవాలో మరో ప్రత్యేకత. చవక ధరల్లో షాపింగ్ చేయవచ్చు. సాధారణంగా ఈ సంతలు కండోలిం, అంజునా చెంత నిర్వహిస్తారు. శనివారాలు సెకండ్‌హ్యాండ్ వస్తువుల మార్కెట్ కూడా ఉంటుంది. అంజునా బీచ్‌లో ప్రతి బుధవారం ఫ్లీ (బేరసారాల) మార్కెట్ జరుగుతుంది. తక్కువ ధరల్లో అద్భుతమైన వస్తువులు కొనొచ్చు.



– చంద్ర మదన్‌మోహన్, ఈనాడు, హైదరాబాద్

చల్లని కొండపై.. మెత్తటి స్వామి

తెలుగు రాష్ట్రాల్లో నరసింహస్వామి క్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో సింహభాగం దట్టమైన అడవుల్లో, కొండల్లో ఉన్నవే! అలా వెలిసిందే హేమాచల నరసింహ క్షేత్రం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండలం మల్లూరులో పచ్చని అడవిలో కొండపై వెలిసిన హేమాచల నృసింహుడి దర్శనం ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచడంతో పాటు అడవితల్లిని పరిచయం చేస్తుంది.

ఒకవైపు పక్షుల కిలకిలలు.. మరోవైపు వనదేవత పచ్చదనంతో నిండుగా దర్శనమిస్తుంది హేమాచలం. మల్లూరు నుంచి చెట్ల నీడలో మూడు కిలోమీటర్లు నడిచి హేమాద్రికి చేరుకుంటారు. వాతావరణంలో చల్లదనం.. పరిసరాల్లో కొత్తదనం.. మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. ఆ ఆనందంలో నుంచి తేరుకోకముందే నరసింహస్వామి దర్శనంతో దివ్యానుభూతి కలుగుతుంది. ఆలయానికి ఎడమ వైపున ఒక చిన్న జలధార ఉంటుంది. దీనిని చింతామణి జలపాతం అంటారు. ఏ కాలంలో అయినా నీటిధార ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయనేది ప్రశ్నార్థకం.

గుట్టలు గుట్టలుగా ఆనవాళ్లు

వనదేవత ఒడిలో ఉన్న మల్లూరు గుట్టపై చారిత్రక ఆనవాళ్లు ఎన్నో కనిపిస్తాయి. ఈ ప్రాంతంలో సుమారు 20 కిలోమీటర్ల పొడవున వేలాది ఎకరాల్లో గుట్టలు విస్తరించి ఉన్నాయి. వీటిని గడెలగుట్ట, సంగంపల్లి మొకిరెగుట్ట, గుడ్డేలుగాల గుట్ట, నరసింహస్వామి బాడువల గుట్ట, మల్లూరు గుట్టగా పిలుస్తుంటారు. వీటన్నింటినీ మల్లూరు గుట్టలుగానే పరిగణిస్తారు. ఈ గుట్టల్లోనే నాలుగు కోటలు ఉన్నాయి. శాతావహనుల కాలం నాటి కోట, రుద్రమదేవి, ప్రతాపరుద్రుని కోటలు, నిజాం రాజుల కోటలు ఉన్నాయి. గుట్టపై నాలుగు దిక్కులా పది అడుగుల ఎత్తులో భారీ కుడ్యం (గోడ) కనిపిస్తుంది. గుట్టల్లో ధాన్యాగారం, రాక్షస గుహలు, చెరువులు, కుంటలు, సొరంగాలు ఇలా ఎన్నో ఔరా అనిపిస్తాయి. నరసింహస్వామిని దర్శించుకోవడానికి వచ్చిన యాత్రికులు తిరుగు ప్రయాణంలో మంగపేట మండలం రమణక్కపేట చేరుకుంటారు. అక్కడి నుంచి స్థానిక గిరిజనుల సహకారంతో గుట్టలపై ఉన్న కోటలను, గుహలను చూసి వస్తుంటారు.





సమీపంలో

లక్నవరం సరస్సు (60 కి.మీ.)
బొగత జలపాతం (35 కి.మీ.)
మేడారం (55 కి.మీ.)

చేరుకునేదిలా..

వరంగల్ నుంచి మల్లూరు సుమారు 130 కి.మీ. దూరంలో ఉంటుంది. హైదరాబాద్, వరంగల్ నుంచి మంగపేటకు బస్సులు ఉన్నాయి. అక్కడి నుంచి మల్లూరుకు బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో (8 కి.మీ.) చేరుకోవచ్చు. కొండపైకి ప్రైవేట్ వాహనాలు వెళ్తాయి. మంగపేట, ఏటూరునాగారంలో బస సౌకర్యం ఉంది.

మనిషి దేహంలా..

హేమాచల నృసింహుని విగ్రహం రాతితో మలిచిందే అయినా.. నాభి ప్రదేశం మనిషి దేహంలా మెత్తగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. నాభి దగ్గర ఎప్పుడూ ఒక ద్రవం ఊరుతూ ఉంటుంది. ఆ ద్రవాన్ని నాభి చందనంగా పిలుస్తారు. దానినే ప్రసాదంగా స్వీకరించడం ఇక్కడి ప్రత్యేకత.

– అక్కెనపల్లి వెంకటేశ్వర్లు, మంగపేట

దిక్సూచి

వేకప్ విత్ వాద్యం

విడిది బాగుంటే విహారం అద్భుతంగా సాగుతుంది. వేదాంతావేకప్ అతిథి గృహాలు.. బసకు మాత్రమే పరిమితం కావు. ఇక్కడ సంప్రదాయం పలకరిస్తుంది. సంస్కృతి కనిపిస్తుంది. శాస్త్రీయ సంగీతం వినిపిస్తుంది. వాద్యహోరు అలరిస్తుంది. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో వేదాంతా వేకప్ అతిథి గృహాలు ఉన్నాయి. కూర్గ్, అలెప్పీ, కొచ్చి, తెక్కడి, ఎర్నాకులం, కన్యాకుమారి తదితర ప్రాంతాల్లో ఈ వసతిగృహాలు ఉన్నాయి. డార్మెటరీ నుంచి డబుల్ రూమ్ వరకు అన్ని రకాల అవకాశాలు ఉన్నాయిక్కడ. అద్దె రూ.300 నుంచి రూ.2,500 వరకు ఉంటుంది. మేక్‌మైట్రిప్, ట్రిప్ అడ్వైజర్ తదితర ట్రావెల్ యాప్స్ ద్వారా గదులు బుక్ చేసుకోవచ్చు.



లెట్స్ గో

తెహ్రీ సరస్సులో సరదాగా

భగీరథి నదిపై స్పీడుబోట్‌లో రయ్‌మని దూసుకుపోవాలని అనుకుంటున్నారా! అయితే తెహ్రీ లేక్ ఫెస్టివల్‌కు వెళ్లిపోండి. ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు మూడు రోజుల పండగ కావాల్సినంత వినోదాన్ని పంచుతుంది. దేశంలోనే అత్యంత ఎత్తయిన తెహ్రీ డ్యామ్ బ్యాక్‌వాటర్స్‌లో ఉన్న సరస్సు మంచుకొండల నడుమ మనోహరంగా కనిపిస్తుంది. ఈ సరస్సులో ఏటా నిర్వహించే పండగకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు హాజరవుతారు. ఇక్కడ జరిగే సాహస క్రీడల్లో



పాలుపంచుకుంటారు. బాలీవుడ్ సెలబ్రిటీల హంగామా, బాణసంచా వెలుగులు.. తెహ్రీ ఉత్సవ్ ఉత్సాహాన్ని పెంచుతాయి. సరస్సు చెంతన ఏర్పాటు చేసిన అతిథి గృహాలు మరో అద్భుతం. గఢ్వాల్ పర్వత శ్రేణుల సౌందర్యాన్ని చూస్తూ అలా గంటల కొద్దీ గడిపేయొచ్చు. తెహ్రీ సరస్సులో సాగే స్పీడ్‌బోటింగ్, బనానా రైడింగ్, కయాకింగ్ వంటి జలక్రీడలు, ఒడ్డున పారా గ్లైడింగ్ సాహసాలు పర్యాటక ప్రియులను ఆద్యంతం అలరిస్తాయి.

ఎప్పుడు?: ఫిబ్రవరి 26-28

చేరుకునేదిలా

- హైదరాబాద్, ఢిల్లీ నుంచి డెహ్రాడూన్‌కు నాన్‌స్టాప్ విమానసర్వీసులు అందుబాటులో ఉన్నాయి. అక్కడి నుంచి తెహ్రీ సుమారు 86 కి.మీ. దూరంలో ఉంటుంది. బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు.
- విజయవాడ నుంచి హరిద్వార్‌కు రైళ్లో వెళ్లి.. అక్కడి నుంచి ట్యాక్సీలో, బస్సుల్లో తెహ్రీకి (95 కి.మీ.) చేరుకోవచ్చు.